PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 348 | విజయవాడ, శనివారం 19 జులై 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 19 July 2025 | Rs

సంఘ్ పరివార్‌తో మీరా పోరాడేది !

- రాహుల్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన సిపిఎం
- ఆర్‌ఎస్‌ఎస్‌తో సమానంగా సిపిఎంను చూడటంపై అభ్యంతరం

7

ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్

- ఆరుగురు మావోయిస్టుల మృతి

ఛత్తీస్‌గఢ్ : ఛత్తీస్‌గఢ్‌లో నాయయణ్‌పూర్ జిల్లాలోని అబూజ్‌మఢ్ అటవీ ప్రాంతంలో శుక్రవారం జరిగిన ఎదురు కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం అబూజ్‌మఢ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టు క్యాడర్ దాగి ఉన్నదన్న నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా దళాలు కూంబింగ్‌ను చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో ఆరుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. వారి మృతదేహాలను జిల్లా కేంద్రానికి తీసుకొచ్చారు. చనిపోయిన మావోయిస్టులు ఎవరు, వారిటి వివరాలు ఏమిటి అనేది గుర్తించాల్సి ఉన్నది. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం నుంచి పలు ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నామని పోలీసు అధికారులు చెప్పారు.



కంపెనీల నుంచి ఒప్పంద పత్రాలు అందుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా రాష్ట్రం

సిఎం చంద్రబాబు ప్రకటన • రూ.51 వేల కోట్ల ఒప్పందాలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రానున్న కాలంలో రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాధాన్యత పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో తక్కువ ఖర్చుతో విద్యుదుత్పత్తికి నిపుణులు, ఆయా కంపెనీలు పరిశోధనలు చేయాలని సూచించారు. రాజధాని అమరావతిలోని ఎస్‌ఆర్‌ఎం విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్‌లో ఆయన ప్రసంగించారు. 1999లో తాను తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణల వల్ల 2004లో అధికారం కోల్పోయినా వెనక్కి తగ్గలేదన్నారు. తక్కువ ఖర్చుతో హరిత ఇంధనం ఉత్పత్తి, స్టోరేజీపై దృష్టి పెట్టాలని కోరారు. రెండు రోజుల్లో అమరావతి గ్రీన్ హైడ్రోజన్ డిక్లరేషన్ ఇస్తామన్నారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. అందుకు తగిన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇంధన ఖర్చు తగ్గాలని, ప్రజలకు ప్రయోజనం చేకూరాలన్నదే ముఖ్యమని అన్నారు. సమీప భవిష్యత్ అంతా గ్రీన్ హైడ్రోజన్‌దేనని, ఇంధన రంగంలో అది గేమ్ ఛేంజర్‌గా మారు తుందని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో, సామాన్యులు కూడా వ్యయం భరించగలిగేలా ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. విశాఖలోని ఎన్‌టిసిపి సంస్థ గ్రీన్ హైడ్రోజన్ తయారీకి ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోందన్నారు. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి త్వరలోనే ప్రారంభమవు తుందని తెలిపారు. 160 మెగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని రాష్ట్రం నిర్దేశించుకుందన్నారు. రాష్ట్రంలోరూ.51 వేల కోట్లతో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేసేందుకు రెండు సంస్థలు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సమిట్ వేదికగా ట్రాన్స్‌ఫర్మేటివ్ అవగాహన ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, ఆయా సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. యుకెకు చెందిన యమ్నా సంస్థ రూ.16 వేల కోట్ల పెట్టుబడితో నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద ఏడాదికి ఒక మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఎంఒయు కుదుర్చుకుంది. కెఎస్ఎహెచ్ ఇన్ఫ్రా సంస్థ మచిలీపట్నంలో 150 కిలో టన్నుల సామర్థ్యంతో గ్రీన్ హైడ్రోజన్, 600 కిలో టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.35 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. అంతకుముందు సదస్సులో భాగంగా ఇంధన రంగానికి చెందిన వివిధ సంస్థల సిఇఒలు, ఎండిలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖాముఖి భేటీ అయ్యారు. సమ్మిట్‌కు నీతి ఆయోగ్ సభ్యులు వికె.సారస్వత్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు.

లూలూకు విజయవాడ పాత బస్టాండ్?



విజయవాడ గవర్నర్ పేటలోని ఆర్‌టిసి పాత బస్టాండ్ ప్రాంతం

• విద్యాధరపురం డిపో కూడా! • రాష్ట్ర ప్రభుత్వ కసరత్తు • ఆర్‌టిసికి గొల్లపూడి వద్ద ప్రత్యామ్నాయ స్థలం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ నడిబొడ్డున ఉన్న ఆర్‌టిసి పాత బస్టాండ్ (ప్రస్తుతం గవర్నర్ పేట బస్‌డిపో)ను బడా కార్పొరేట్లకు అప్పగించడానికి రంగం సిద్ధమైంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ స్థలాన్ని అంతర్జాతీయ వాణిజ్య సంస్థ లూలూకు కేటాయించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే ఆర్‌టిసి , రెవెన్యూ అధికారులు డిపో స్థలాన్ని పరిశీలించినట్లు తెలిసింది. పాత బస్టాండ్‌తో పాటు విద్యాధరపురంలోని ఆర్‌టిసి డిపోను కూడా మూసివేసి, ఆ స్థలాన్ని కూడా లూలూ సంస్థకు అప్పగించనున్నట్లు చెబుతున్నారు. ఈ రెండు స్థలాలకు ప్రత్యామ్నాయంగా ఆర్‌టిసికి గొల్లపూడి సమీపంలోని రాళ్లకుంట వద్ద 6 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించనుందని సమాచారం. దీంతో ఈ విషయం ఆర్‌టిసి వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది. విశ్వసనీయ వర్గాలు చెబుతున్న సమాచారం ప్రకారం ఈ నెల 24వ తేది జరగనున్న రాష్ట్ర మంత్రిమండలి సమావేశం ముందుకు ఈ ప్రతిపాదన రానుంది. ఇప్పటికే అవసరమైన కసరత్తు పూర్తికావడంతో ఆ సమావేశంలోనే ఆమోదముద్ర పడుతుందని చెబుతున్నారు. మార్కెట్ రేటు ప్రకారం పాత బస్టాండ్ స్థలం విలువ 300 నుండి 400 కోట్ల రూపాయలు ఉంటుందని చెబుతున్నారు. విద్యాధరపురం డిపో విలువ కూడా భారీ మొత్తంలోనే వుంది. ఇంత విలువైన స్థలాన్ని బహుళజాతి సంస్థకు అప్పగిస్తుండటంపై ఆర్‌టిసి వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాత బస్టాండ్ స్థలంలో లూలూ ఇంటర్నేషనల్ కంపెనీ పెద్ద కమర్షియల్ మాల్ నిర్మించనుందని చెబుతున్నారు. విద్యాధరపురం స్థలాన్ని కూడా లూలూ సంస్థకే అప్పచెప్పనున్నారని, అయితే, అక్కడ మాల్ నిర్మిస్తారా... ఇతర అవసరాలకు వినియోగిస్తారా అన్న అంశంపై స్పష్టత లేదని చెబుతున్నారు. గతంలో గన్నవరం వద్ద ఆర్‌టిసి స్థలాన్ని ఓ కార్పొరేట్ కంపెనీకి కేటాయిస్తే ఇంత వరకు అక్కడ ఎటువంటి వ్యాపార కార్యక్రమాలు నిర్వహించిన దాఖలాల్లేవు. తాజాగా విద్యుత్తు బస్సుల నిర్వహణ పేరుతో ఆర్‌టిసి స్థలాలు, భవనాలను కార్పొరేట్ సంస్థలకు, ప్రైవేటే వ్యక్తులకు నామమాత్రపు లీజుతో కట్టబెట్టే యోచన రాష్ట్ర ప్రభుత్వం చేస్తోంది. స్థలాలకు మంచి గిరాకీ ఉండటం, పట్టణాల మధ్యలో ఆర్‌టిసి డిపోలు ఉండటంతో కార్పొరేట్లు ఆయా స్థలాలను దక్కించుకునేందుకు పోటీ పడుతున్నారని, ఆర్‌టిసి ఉద్యోగులు అంటున్నారు.

'విశాఖ ఉక్కు' ప్రైవేటీకరణ ఆపాలి

- కడప ఉక్కు పరిశ్రమ స్థాపించి, యువతకు ఉపాధి కల్పించాలి
- జంతర్ మంతర్ వద్ద డివైఎఫ్ఐ ఆందోళన
- కేంద్ర ప్రభుత్వం తీరని ద్రోహం చేసింది : ఎఎ రహీం



జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'విశాఖ ఉక్కు' ప్రైవేటీకరణ ఆపాలని రాజ్యసభ ఎంపి, డివైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు ఎఎ రహీం డిమాండ్ చేశారు. శుక్రవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద డివైఎఫ్ఐ ఎపి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనకు ఎఎ రహీం, ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్, ఐద్వా కోశాధికారి ఎస్ పుణ్యవతి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎఎ రహీం మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు జరపకుండా తెలుగు ప్రజలకు బిజెపి ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. ఇప్పుడు ఏకంగా తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా ఉన్న విశాఖ ఉక్కును నష్టాల పేరుతో ప్రైవేటీకరణ చేసేందుకు కుట్రలు చేస్తోందని విమర్శించారు. ఆ కుట్రలను మిగతా 6లో

భవిష్యత్ కార్యాచరణకు సిద్ధంకండి

- మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కె ఉమామహేశ్వరరావు పిలుపు
- సమస్యల పరిష్కారం కోసం కొనసాగిన సమ్మె



అనంతపురంలో మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు, విజయవాడ ధర్నా చౌక్ వద్ద కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న కె ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-యంత్రాంగం/ అనంతపురం కార్పొరేషన్

గత సమ్మె కాలపు ఒప్పంద అంశాల సాధన కోసం భవిష్యత్ కార్యాచరణకు సిద్ధం కావాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు పిలుపునిచ్చారు. జిఒ 36 ప్రకారం వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారమూ కొనసాగింది. విజయవాడ ధర్నా చౌక్ వద్ద కార్మికులనుద్దేశించి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారంలో టిడిపి కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు.

గత 24 రోజులుగా మొక్కవోని దీక్షతో కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, దీనిలో భాగంగానే 'చలో డిఎంఎ' నిర్వహించారని తెలిపారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతపురంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. గుత్తిలో వంటావార్పు, రాయదుర్గంలో నిరసన ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. విశాఖలో తాటిపూడి రిజర్వాయర్ పంప్ హౌస్ వద్ద మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు నిరసన తెలిపారు. కార్మికుల పోరాటానికి మద్దతుగా జివిఎంసి వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. తిరుపతిలో ధర్నా అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. సూళ్లూరుపేట మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. శ్రీకాళహస్తి, వెంకటగిరి, నాయుడుపేట, గూడూరుల్లోనూ నిరసనలు కొనసాగాయి. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం, ఆమదాలవలస మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా, ఇచ్ఛాపురంలో నిరసన ర్యాలీ చేశారు. పలాసలో కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఏలూరు జిల్లా చింతలపూడిలో కార్మికుల సమ్మెకు మద్దతుగా వాటర్ వర్క్ సిబ్బంది నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. తాడేపల్లిగూడెంలో ధర్నా చేశారు. గుంటూరులో నిరసన తెలిపారు.

మా సమస్యలను పరిష్కరించండి
- మంత్రి నారాయణకు మున్సిపల్ కార్మికుల వినతి


తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని మున్సిపల్ కార్మికులు మంత్రి నారాయణను కోరారు. శుక్రవారం అనంతపురం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయనను మాసినేని హోటల్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కార్మికులు కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజ, మున్సిపల్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు గోపాల్, ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, సంజీవ రాయుడు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా గత ఆరు రోజులుగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలో ఉన్నారని తెలిపారు. జిఒ 36 ప్రకారం వేతనాలు పెంచాలని, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ కల్పించాలని, చనిపోయిన, అనారోగ్యంపాలైన వారి స్థానాల్లో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. గ్రాట్యుటీ, పెరుగుతున్న నగర జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై మంత్రి స్పందిస్తూ వేతనాల పెంపు, ఇతర సమస్యలపై ప్రభుత్వం సోమవారంలోపు నిర్ణయం తీసుకుంటుందని, కార్మికులు శుభవార్త వింటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, మురళి, కోశాధికారి పోతులయ్య, హెల్త్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి తిరుమలేశు, బండారి ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, వరలక్ష్మి, రవికిరణ్, పెన్నాకుమార్ పాల్గొన్నారు.

సంపన్నులు సాయం చేయాలి

- పి-4 మార్గదర్శుల విందులో సిఎం చంద్రబాబు
- ఆగస్టు కల్లా 15 లక్షల మందిని దత్తత తీసుకోవాలి


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



సంపన్నులు సాయం చేయాలని తద్వారా పేదరికం పోవాలన్న ఉద్దేశంతోనే పి-4 కార్యక్రమం చేపట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. పి-4 మార్గదర్శులకు శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి విందు ఇచ్చారు. పి-4పై తన ఆలోచనలను వివరించారు. మార్గదర్శుల అభిప్రాయాలూ తీసుకున్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ఆగస్టు 15 నాటికల్లా 15 లక్షల మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలనేది తన సంకల్పమని పేర్కొన్నారు. ఇందుకు సంపన్నులు, కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంధ సంస్థలు కలిసి రావాలని అన్నారు. అంబేద్కర్ నుండి అబ్దుల్ కలాం వరకూ ఎదిగిన వారందరికీ వారి జీవితకాలంలో ఎవరో ఒకరు సాయం చేశారని తెలిపారు. సమాజంలో విజయం సాధించిన వారందరూ సామాజిక బాధ్యతగా తిరిగి ఖర్చు పెట్టాలని సూచించారు. గేట్స్ ఫౌండేషన్ ఈ విషయంలో స్ఫూర్తిగా నిలుస్తుందని, 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చూసేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ 5 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించామని, వీరికి సాయం చేసేందుకు 47 వేల మంది మార్గదర్శులుగా నమోదు చేసుకున్నారని వివరించారు.

నాడు జన్మభూమి.. నేడు పి-4

47 ఏళ్లుగా తను రాజకీయాల్లో ఉన్నానని, ముఖ్యమంత్రి అయిన తరువాత రెండో విడత సంస్కరణలు తీసుకొచ్చానని తెలిపారు. ఐటికి పెద్దపీట వేసి, విద్యకు ప్రాధాన్యత ఇచ్చానని పేర్కొన్నారు. వాటి వల్ల మంచి ఫలితాలు వచ్చి ప్రజలు అభివృద్ధి చెందారని తెలిపారు. రాష్ట్రంలో అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను ఆర్థికంగా, సామాజికంగా పైకి తీసుకురావాలన్నదే తన సంకల్పమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పి-4 వైస్ ఛైర్మన్ కుటుంబరావు, ప్రముఖులు శ్రీనిరాజు, రవి సన్నారెడ్డి, అనిల్ చలమలశెట్టి, పివి కృష్ణారెడ్డి, ఎవివి రంగరాజు, వివిఎన్ రావు, సజ్జన్‌కుమార్ గోయెంకా వంటి ప్రముఖులు పాల్గొన్నారు.



నిస్తార్‌ను జాతికి అంకితం చేస్తూ సంతకం చేస్తున్న సంజయ్ సేత్

ఐఎన్ఎస్ నిస్తార్ జాతికి అంకితం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

భారత నావికా దళానికి చెందిన మొట్టమొదటి స్వదేశీ డైవింగ్ సపోర్ట్ యుద్ధ నౌక ఐఎన్ఎస్ నిస్తార్‌ను జాతికి అంకితం చేశారు. శుక్రవారం విశాఖలోని నావల్ డాక్ యార్డులో జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేత్, నేవీ అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజయ్ సేత్ మాట్లాడుతూ స్వదేశీ పరిజ్ఞానంతో నిస్తార్ రూపుదిద్దుకుందని తెలిపారు. ఈ నౌక ద్వారా నావికాదళం బలం మరింత పెరిగినట్టయిందన్నారు. స్వదేశీ నౌకానిర్మాణ పరిశ్రమ 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా సాగుతోందని తెలిపారు. ప్రస్తుతం వివిధ దశల్లో స్వదేశీ పరిజ్ఞానంతో 57 కొత్త యుద్ధ నౌకలు నిర్మాణంలో ఉన్నాయని వెల్లడించారు. ఐఎన్ఎస్ నిస్తార్ భారత నౌకా నిర్మాణ అధ్యయంలో ఒక మైలురాయి అని పేర్కొన్నారు. నేవీ అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి మాట్లాడుతూ నిస్తార్ అధునాత సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హిందుస్థాన్ షిప్‌యార్డ్ సిఎమ్‌డి కమాండర్ హేమంత్ ఖత్రి, తూర్పు నావికా దళ విభాగాధిపతి రాజేష్ పెందర్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిస్తార్ ప్రత్యేకతలివే..

ఐఎన్ఎస్ నిస్తార్ అత్యాధునిక డైవింగ్ పరికరాలతో కూడి ఉంది. 300 మీటర్ల లోతు వరకు డైవింగ్ సాల్వేజ్ కార్యకలాపాలను చేపట్టగలదు. జలాంతర్గామిల రెస్క్యూ ఆపరేషన్లలో కీలకపాత్ర వహిస్తుంది. సిబ్బందిని రక్షించేందుకు, సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తోడ్పడుతుంది. మునిగిపోయే నౌకకు ఇది 'మదర్ షిప్'గా ఉపయోగపడుతుంది. హెలికాప్టర్, రిమోట్ ఆధారిత వ్యవస్థలతో సముద్ర రక్షణ, పరిశోధన కార్యక్రమాలకు ఉపయోగపడనుంది. 10 వేల టన్నుల కంటే ఎక్కువ బరువు, 118 మీటర్ల పొడవు కలిగి ఉంది. 18 నాటికన్ మైళ్ల వేగంతో ప్రయాణిస్తుంది. రూ.2396 కోట్ల వ్యయంతో 120 ఎంఎస్ఎంఇల భాగస్వామ్యంతో రూపుదిద్దుకుంది. దీన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ సంస్థ నిర్మించింది.

ఉప్పాడ తీర ప్రాంత కోత సమస్యకు శాశ్వత పరిష్కారం

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడ ప్రాంతాన్ని వేధిస్తున్న తీర ప్రాంత కోత సమస్యకు శాశ్వత పరిష్కారం లభించబోతోందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో శుక్రవారం చేసిన పోస్టులో రూ.323 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను కేంద్రం పరిశీలిస్తోందని చెప్పారు. గత ఐదేళ్లలో సగటున ఏటా 1.23 మీటర్ల తీరం కోతకు గురైందన్నారు. ఎన్‌డిఎ ఎన్నికల వాగ్దానానికి కట్టుబడి అవసరమైన అనుమతులు లభించిన వెంటనే నిర్మాణ పనులను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

సెన్సెక్స్ 500 పాయింట్ల పతనం

ముంబయి : భారత్ స్టాక్ మార్కెట్లలో నష్టాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడితో బిఎస్ఇ సెన్సెక్స్ 501.51 పాయింట్లు లేదా 0.61 శాతం పతనంతో 81,758కి పరిమితమయ్యింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 143.05 పాయింట్లు లేదా 0.57 శాతం తగ్గి 24,968 వద్ద ముగిసింది. విదేశీ సంస్థాగత మదుపర్లు జులైలో ఏకంగా రూ.2,660 కోట్ల షేర్లను విక్రయించారు. ఇది సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి, చమురు ధరలు 70 డాలర్లకు చేరడం కూడా మార్కెట్‌ను ప్రభావితం చేశాయని బ్రోకర్లు భావిస్తున్నారు.

లింగారెడ్డికి భద్రత కొనసాగించండి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

ప్రాణహాని ఉందని, భద్రత కల్పించాలని ఎవరైనా కోర్టుకు వస్తే తీవ్రంగా పరిగణించి తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. వైసిపి నాయకులు లింగాల రామలింగారెడ్డికి 1ప్లస్1 భద్రతను కొనసాగించాలని కడప జిల్లా ఎస్‌పిని ఆదేశించింది. భద్రతకు అయ్యే ఖర్చులను లింగారెడ్డే భరించాలంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులపై 3 నెలల తర్వాత సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని భద్రత సమీక్ష కమిటీ (ఎస్ఆర్‌సి)ని జస్టిస్ నూనెపల్లి హరినాథ్ ఆదేశిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. గత ప్రభుత్వంలో ఉన్న భద్రతను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడాన్ని కడప జిల్లా, వేముల గ్రామానికి చెందిన లింగాల రామలింగారెడ్డి సవాల్ చేసిన కేసులో తీర్పు వెలువరించారు.

జియోలాగే స్మార్ట్ మీటర్లు !

- స్పందించకపోతే నష్టపోతాం : వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి - యంత్రాంగం


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

స్మార్ట్ మీటర్లను అడ్డుకోకపోతే తీవ్ర నష్టం జరుగుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. నెల్లూరు ఎన్‌టిఆర్ నగర్‌లో స్మార్ట్‌మీటర్లపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో రిలయన్స్ సంస్థ జియో పేరుతో ఉచితంగా సిమ్, ఇంటర్నెట్ కనెక్షన్ ఇచ్చిందని, తర్వాత నెలకు రూ.300, రూ.500, రూ.800 అంటూ భారీగా ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తోందని వివరించారు. స్మార్ట్ మీటర్ల వల్ల అనేక ఉపయోగాలుంటాయని కబుర్లు చెబుతున్నారని, ఇందులో ఏ మాత్రమూ వాస్తవం లేదన్నారు. ప్రీపెయిడ్‌తో కరెంట్ రీఛార్జ్ చేసుకోవాల్సి వస్తుందన్నారు. ఎప్పుడు రీఛార్జ్ అయిపోతుందో తెలియదని, దీంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. నెల్లూరులో చిన్న చిన్న టిఫెన్ అంగళ్లకు గతంలో రూ.500 వచ్చే బిల్లు స్మార్ట్ మీటర్‌ను ఏర్పాటు చేశాక రూ.ఐదు వేలు వచ్చినట్లు తెలిసిందన్నారు. విజయవాడలో పిండి మిల్లు పెట్టుకున్న ఓ వ్యక్తికి నెలకు రూ.ఆరు వేలు బిల్లు వచ్చేదని, స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేశాక రూ.26 వేలు వచ్చిందని వివరించారు. కరెంట్ ఛార్జీల దెబ్బకు టెక్స్‌టైల్, గార్మెంట్ వంటి సంస్థలు మూతపడుతున్నాయన్నారు. రెండు రోజుల క్రితం విశాఖపట్నంలో స్టార్ హోటళ్ల యజమానులు సమావేశం ఏర్పాటు చేసి కరెంట్ బిల్లులు చెల్లించలేమని చెప్పారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సి ఉందన్నారు. కరెంట్ ఛార్జీల పేరుతో రూ.17 వేల కోట్లు ప్రజలపై భారం వేశారని వివరించారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కృష్ణా జిల్లా ఉయ్యూరు సుందరమ్మపేటలో ఇంటింటికీ ప్రచారం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్ల బిగింపుతో సామాన్య, మధ్యతరగతి ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. గత ప్రభుత్వం అదానితో కుదుర్చుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయకుండా ప్రజలపై మరింత భారం మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ జివిఎంసి ఒకటో వార్డు, ఆరిలోవ, ఆదర్శనగర్, వివేకానందనగర్, మారికవలస, శారదనగర్, చైతన్యనగర్, హిమాచల్ నగర్ ప్రాంతాల్లోనూ పాదయాత్రలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు వల్ల కలిగే నష్టాలపై అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో ఉపాధి హామీ పని ప్రదేశంలో ప్రచారం చేశారు. విజయవాడ విద్యాధరపురం రామరాజు నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఏకలవ్య నగర్‌లో నివాసం ఉంటున్న ముఠా కార్మికులు జి.రాజు ఇంటికి స్మార్ట్ మీటర్‌ను ఏర్పాటు చేయడంతో దానిని తొలగించాలని ఎఇకు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు.

ద్రవ్యోల్బణం నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ద్రవ్యోల్బణం నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, నిత్యావసర వస్తువుల ధరలపై రోజువారీ సమీక్షలతోపాటు ఎప్పటికప్పుడు నియంత్రణ చర్యలు చేపట్టాలని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. సచివాలయంలో శుక్రవారం మార్కెట్ ధరల పర్యవేక్షణపై మంత్రి అధ్యక్షతన మంత్రుల బృందం (జిఒఎమ్) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వరిపై మార్కెట్ రుసుమును రెండు శాతం నుంచి ఒక శాతానికి తగ్గించే ప్రతిపాదనపై చర్చించారు. అనంతరం మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ.. ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉండేలా కూటమి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందన్నారు. టమోటా ఉత్పత్తిపై బేరీజు వేసుకుంటూ ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు ఫుడ్ సేఫ్టీ విభాగాన్ని బలోపేతం చేయాలని మంత్రుల కమిటీ నిర్ణయించిందన్నారు. సిబ్బంది కొరతను నివారించేందుకు ఇతర శాఖల నుంచి అర్హులైన ఉద్యోగులను శిక్షణతో నియమించాలని సూచించారు. తూనికలు, కొలతలశాఖ, ఫుడ్ సేఫ్టీ విభాగం సంయుక్తంగా విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి ప్రాంతాల్లో ఆహార నాణ్యతపై అవగాహన కార్యక్రమాలు, తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సన్నరకం ధాన్యం సాగు చేయించేందుకు రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, పౌరసరఫరాల సంస్థ, వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

అనుభవంతో ఆదాయాన్ని పెంచండి

- ఎగవేతదారులకు మనమేంటో చూపించాలి
- వాణిజ్యపన్నులశాఖ వర్క్‌షాప్‌లో పయ్యావుల

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వాణిజ్య పన్నులశాఖలో ఎంతోమంది అనుభవజ్ఞులు ఉన్నారని, వారు తమ అనుభవంతో ఆదాయాన్ని పెంచేందుకు ప్రయత్నించాలని ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. స్థానిక వాణిజ్య పన్నులశాఖ ప్రధాన కార్యాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ.. మారుతున్న సాంకేతికతను వాడుకుంటూనే వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా ఆదాయంపై దృష్టి సారించాలన్నారు. జిఎస్‌టి వసూళ్ల నేపథ్యంలో అధికారులకు ఏ ఇబ్బందులు తలెత్తినా ప్రభుత్వం తరపున అండగా ఉంటామని పయ్యావుల చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి పెట్టుబడులతోపాటు అభివృద్ధి, సంక్షేమం కూడా ముఖ్యమేనన్నారు. గతేడాది కన్నా ఈ ఏడాది పన్నుల వసూళ్లు పెరిగాయని, ఇందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలుపుతున్నానన్నారు. వచ్చే నెల రోజుల్లో శాఖాపరంగా మరింత మార్పులు కనిపించాలన్నారు. పన్నులను ఎగవేసే వారికి మనమంటే ఏమిటో చూపించాలన్నారు. ఇందు కోసం డేటాను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి నూనె వంటి దిగుమతులు చేసుకునే వ్యాపారులు పన్నుల నుంచి తప్పించుకోకుండా చూడాలని పేర్కొన్నారు. అలాగే రిజిస్ట్రేషన్లలోనూ ఇతర శాఖలతో అనుసంధానంపై సమన్వయ సమావేశాలను నిర్వహించుకోవాలన్నారు. ఇందులో భాగంగానే తనిఖీలు కూడా విస్తృతం చేయాలని సూచించారు. బకాయిలను కూడా త్వరగా వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సదస్సులో పాల్గొన్న ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్‌కుమార్, వాణిజ్య పన్నులశాఖ చీఫ్ కమిషనర్ ఎ బాబు.. పన్నుల వసూళ్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రవిశంకర్, సౌమ్య, రమేష్‌తోపాటు జాయింట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు పాల్గొన్నారు.

గిరిజనులకు మెరుగైన స్థితిగతులకు కృషి

- గవర్నర్‌కు నివేదిక సమర్పించిన కమిషన్ ఛైర్మన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజనులకు మెరుగైన విద్య, వైద్యం, జీవన స్థితిగతులు కల్పించేందుకు ఎస్‌టి కమిషన్ చిత్తశుద్ధితో కృషి చేసిందని కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు వివరించారు. కమిషన్ వార్షిక ప్రగతి నివేదికను శుక్రవారం గవర్నర్‌కు సమర్పించిన సందర్భంగా, కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వానికి చేసిన సూచనలతోపాటు గిరిజనుల స్థితిగతులు, చేపట్టాల్సిన చర్యలు గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లారు. గిరిజన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించినట్లు, ఆయా సందర్భాలలో కమిషన్ దృష్టికి వచ్చిన సమస్యలు, వినతి పత్రాల రూపంలో గిరిజనులు పేర్కొన్న అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు. క్షేత్ర స్థాయి పర్యటనల్లో వివిధ జిల్లాల కలెక్టర్లతో సమావేశమై, ఆయా జిల్లాల్లో గిరిజనుల స్థితిగతులను సమీక్షించి, తీసుకోవాల్సిన చర్యలు సూచించినట్లు పేర్కొన్నారు. గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలు కాపాడుతూ, వారి సహజ జీవన శైలిలో జీవించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించినట్లు తెలిపారు. గవర్నర్‌ను కలిసిన వారిలో కమిషన్ కార్యదర్శి కె.రామశేషు, డైరెక్టర్ కట్ట సాంబయ్య, సూపరింటెండెంట్ బి.సుశీల్ కుమార్ ఉన్నారు.

సైబర్ నేరాల అదుపునకు చట్ట సవరణ

- వచ్చే సమావేశాల్లోనే బిల్లు : రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రస్తుతం ఉన్న చట్టానికి మరింత పదును పెట్టేలా వచ్చే శాసనసభ సమావేశాల్లో చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని శాసనసభ పిటిషన్ల కమిటీ నిర్ణయించినట్లు కమిటీ ఛైర్మన్, డిప్యూటీ స్పీకరు కె రఘురామకృష్ణరాజు తెలిపారు. పటిష్టమైన చట్ట రూపకల్పనకు హోం, ఐటి శాఖ కార్యదర్శులతో కమిటీ శుక్రవారం సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ.. బెట్టింగ్, లోన్ యాప్స్ వల్ల రాష్ట్రంలో ఎంతోమంది అమాయకులు మోసపోతున్నారని, వీటికి సంబంధించి కేవలం నాలుగు శాతం కేసులు నమోదయ్యాయని, మొత్తం రూ.960 కోట్ల మేర మోసం జరిగిందని పేర్కొన్నారు. ఇందులో రూ.300 కోట్ల మేర రికవరీ చేశామన్నారు. ఏడాదికి దాదాపు రూ.30 వేలకోట్ల వరకూ సైబర్ నేరాలు జరుగుతున్నట్లు చెప్పారు. యాప్స్ రూపొందించే వారిపైనా, సిస్టమ్స్‌లో వాటిని లోడ్ చేసే వారిపైనా కేసులు పెట్టే అవకాశం ప్రస్తుతం ఉన్న చట్టంలో లేదన్నారు. మోసాలకు సంబంధించిన సమాచారాన్ని వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సినీ ప్రముఖులతో పలు మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేసే అంశాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పల్లా శ్రీనివాసరావు, శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, డిప్యూటీ సెక్రటరీ కె రాజకుమార్, కమిటీ సభ్యులు కొణతాల రామకృష్ణ, పి విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు.

ప్రజల్లోకి సంక్షేమ కార్యక్రమాలు : హోంమంత్రి అనిత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి కుట్రలను తిప్పికొడుతూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మంగళగిరి టిడిపి కార్యాలయంలో రాష్ట్ర తెలుగు మహిళా విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. సిఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌తోపాటు ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ముందుకు సాగుతుందన్నారు. కుట్రలు చేయడం వైసిపికి వెన్నతోపెట్టిన విద్య అని అన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులోకి రానుందన్నారు. ఈ సమావేశంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఎఇఇ అదృశ్యం

- రిలీవ్ చేయకుండా అధికారులు, ఎమ్మెల్యే వేధిస్తున్నారని సూసైడ్ నోట్

ప్రజాశక్తి - తిరువూరు (ఎన్‌టిఆర్ జిల్లా)

తాను బదిలీ అయినా రిలీవ్ చేయకుండా అధికారులు, ఎమ్మెల్యే వేధిస్తున్నారని, దీంతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని జల వనరుల శాఖ ఎఇఇ రక్తంతో లేఖ రాసి అదృశ్యమయ్యారు. ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులో గురువారం జరిగిన ఈ సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. "ప్రభుత్వం బదిలీ చేసి నెల రోజులవుతున్నా రిలీవ్ ఆర్డర్ ఇవ్వకుండా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఇఇ, స్పెషల్ డివిజన్, విజయవాడ) పి.గంగయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డిఇఇ, స్పెషల్ సబ్ డివిజన్, కంచికచర్ల) ఎస్.ఉమాశంకర్, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కలిసి ఆడుతున్న రాజకీయ నాటకంలో నేను అలసిపోయాను. ఒక దళిత ఉద్యోగిగా నాకు జరిగిన అన్యాయం ఇంకెవరికీ జరగకుండా చర్యలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, మంత్రి నారా లోకేష్‌కు, ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ కె.ఎస్.జవహర్‌కు విజ్ఞప్తి చేస్తూ తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖ రాసి ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎఇఇ) వేసుపోగు కిషోర్ అదృశ్యమయ్యారు. ఎన్‌టిఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామానికి చెందిన కిషోర్ జల వనరుల శాఖలో తిరువూరు ఎఇఇగా పని చేస్తున్నారు. గత నెల 16న నాగార్జున సాగర్ కెనాల్ (ఎన్ఎస్‌సి) ఓ అండ్ ఎం సెక్షన్ గౌరవరం (జగ్గయ్యపేట నియోజకవర్గం)నకు ప్రభుత్వం బదిలీ చేసింది. రిలీవ్ ఆర్డర్ ఇవ్వకుండా జల వనరుల శాఖ ఇఇ గంగయ్య, డిఇఇ ఉమాశంకర్, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వేధిస్తున్నారు. దీంతో ఇఇ, డిఇఇ, ఎమ్మెల్యేపై, పరోక్షంగా వారికి సహకరించిన సీనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, మంత్రి పిఎ బి.శ్రీనివాసరావులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ లేఖ రాసి అన్ని శాఖల ఉద్యోగుల వాట్సప్ గ్రూపుల్లో పోస్టు చేసి అదృశ్యమయ్యారు. కిషోర్ మామ జె ఆనందరావు ఫిర్యాదు మేరకు తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు కిషోర్ చివరి ఫోన్‌కాల్ తిరువూరు సరిహద్దు ఖమ్మం జిల్లా వి.ఎం.బంజరులో గుర్తించినట్లు పోలీసులు చెప్పారని జల వనరుల శాఖ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు టైమ్‌స్కేల్

- మంత్రి లోకేష్‌కు పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, విద్యుత్ తదితర సంస్థలు, వర్సిటీలు, ఎస్ఎస్ఎ, హెల్త్, కెజిబివి తదితర ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ సొసైటీలు, టిటిడి తదితర ధార్మిక సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, ఆప్కాస్ ఉద్యోగులకు మినిమం టైమ్‌స్కేల్ అమలు చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బి గోపి మూర్తి కోరారు. ఈ మేరకు ఐటిశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లిలో శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ పథకాల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది మూడున్నర లక్షల మంది పని చేస్తున్నారని తెలిపారు. వీరిలో ప్రభుత్వ శాఖల్లోని కాంట్రాక్టు ఉద్యోగులకు మినహా మిగిలిన 3 లక్షల మందికి గత ప్రభుత్వం మినిమం టైమ్‌స్కేల్‌ను అమలు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయడం లేదన్నారు. వీరందరికీ ఎంటిఎస్ అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంపు, ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా ప్రభుత్వ పథకాలు అమలు చేయాలన్నారు. అందర్నీ రెగ్యులరైజేషన్ చేసే వరకూ ఆప్కాస్‌ను కొనసాగించాలని కోరారు. సమస్యలను పరిష్కరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. గోపిమూర్తి వెంట జెఎసి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్, వర్కర్స్, ఎపిస్టేట్ గవర్నమెంట్ కంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, కో-ఛైర్మన్ బి కాంతారావు, కోశాధికారి డి దయామణి తదితరులు ఉన్నారు.

పొగాకు కొనుగోళ్లు వేగవంతం చేయండి

- మంత్రి అచ్చెన్నకు రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వం ప్రకటించిన విధంగా పొగాకు కొనుగోళ్లు జరగడం లేదని, కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతున్నందున ఈ ప్రక్రియను వేతవంతం చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడును రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు శుక్రవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం ప్రకటించిన కొనుగోలు ధర రూ.12 వేలు, రూ.9 వేలు, రూ.6 వేలు ఉండగా, రూ.12 వేలు చెల్లించి కొనుగోలు చేయడం కనుమరుగవుతుందని తెలిపారు. గ్రామాల్లో చాలా తక్కువ ధరకే ప్రైవేటు కంపెనీలు పొగాకును అడుగుతున్నాయని తెలిపారు. రైతుల వద్ద ఇంకా 80 శాతం పొగాకు మిగిలి ఉందన్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికీ రాయలసీమలో 13 మండలాలకు సంబంధించి మార్క్‌ఫెడ్ ఒక్క కేంద్రం కూడా ప్రారంభించలేదన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని కోరారు. కొనుగోలు చేసిన పొగాకు డబ్బులు కూడా 20 రోజులు కావస్తున్నా రైతుల ఖాతాలలో జమ కాలేదన్నారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రిని కోరారు. ప్రైవేటు కంపెనీలను, అధికారులను వెంటనే సమావేశపరిచి కొనుగోళ్ల తీరుపై వెంటనే సమీక్షించాలని విజ్ఞప్తి చేశారు.



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కొండలరావు, పైడమ్మ

ఇద్దరు మున్సిపల్ కార్మికుల ఆత్మహత్యాయత్నం

- కమిషనర్ బూతులు తిట్టడమే కారణమని ఆరోపణ

ప్రజాశక్తి- నూజివీడు టౌన్ (ఏలూరు జిల్లా)

నూజివీడు మున్సిపల్ కమిషనర్ బూతులు తిట్టారని మనస్తాపంతో ఇద్దరు మున్సిపల్ కార్మికులు శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వీరిద్దరూ భార్యాభర్తలు. చికిత్స నిమిత్తం బంధువులు వారిని నూజివీడు ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై బాధితురాలు దలై పైడమ్మ మాట్లాడుతూ తనను, తన భర్త కొండలరావును మున్సిపల్ కమిషనర్ చెప్పేందుకు అవకాశం లేని బూతులు తిట్టడంతో మనస్తాపానికి గురై నిద్ర మాత్రలు మింగామని తెలిపారు. ఈ కమిషనర్ వచ్చిన నాటి నుంచి కార్మికులను ఇష్టానుసారం దూషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవా లని కోరారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకట్రామిరెడ్డిని వివరణ కోరగా, తనకు వ్యక్తిగతంగా ఎవరితోనూ విభేదాలు లేవని, పారిశుధ్య పనిలో ఎటువంటి లోపాలున్నా సహించబోనని అన్నానే తప్ప, ఎటువంటి బూతులూ తిట్టలేదని తెలిపారు.

2027 డిసెంబర్‌కు పోలవరం పూర్తి

- మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

పోలవరం ప్రాజెక్టు 2027 డిసెంబర్ నాటికి పూర్తవుతుందని, ఆ దిశగా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి విశాఖలోని ఎంవిపి.కాలనీలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది జనవరిలో ప్రారంభించిన డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని డిసెంబర్‌లో పూర్తి చేస్తామని తెలిపారు. 2019 నాటికి 72 శాతం పోలవరం పనులు పూర్తి చేశామని, తదుపరి ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం 3 శాతం పనులు చేపట్టగా.. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలో 6 శాతానికిపైగా పూర్తి చేసిందని వివరించారు. పోలవరం నిర్వాసితుల కోసం ఇచ్చిన నిధులను కూడా వైసిపి ప్రభుత్వం పక్కదారి పట్టించిందని ఆరోపించారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్‌ను సిద్ధం చేసి ఉంటే ఉత్తరాంధ్రకు పోలవరం నీరు వచ్చి ఉండేదని తెలిపారు. సముద్రంలో కలిసిపోయే నీటిని ఒడిసిపట్టేందుకే బనకచర్లను ప్రతిపాదిస్తున్నామన్నారు. సముద్రంలోకి ఏటా కలిసిపోతున్న 3 వేల టిఎంసిల నీటిలో 200 టిఎంసిల నీటిని వంద రోజుల గడువులో వాడుకునేలా ఈ ప్రాజెక్టును డిజైన్ చేస్తున్నామని తెలిపారు. బనకచర్లపై జగన్‌మోహన్‌రెడ్డి అవగాహనా రాహిత్యంతో వ్యవహరిస్తూ పొరుగు రాష్ట్రానికి మేలు చేసేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. వంశధార, తోటపల్లి రిజర్వాయర్ పనులు 80 శాతం పూర్తయ్యాయని, ఈ ఏడాదిలో వాటిని పూర్తి చేసి ప్రాజెక్టును ప్రారంభిస్తామని ప్రకటించారు. నాగావళి - చంపావతి నదులను అనుసంధానం చేస్తామన్నారు.

కడప కేంద్ర కారాగారంలో డిఐజి విచారణ

- ఎర్రచందనం స్మగ్లర్ నుంచి 10 సెల్‌ఫోన్లు స్వాధీనం?

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప కేంద్ర కారాగారంలో జైళ్లశాఖ విచారణ చేపట్టింది. ఖైదీల వద్ద నుంచి సెల్‌పోన్లు పట్టుబడుతున్నాయనే వార్తల నేపథ్యంలో రాజమహేంద్రవరం జైలు డిఐజి రవికిరణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఖైదీల దగ్గర నుంచి సిబ్బంది వరకు వరుస క్రమంలో విచారించారు. కడప సెంట్రల్ జైలులో పిడి యాక్టు కింద అరెస్టు అయిన ఓ ఎర్రచందనం స్మగ్లర్‌కు సెల్‌ఫోన్లు ఎలా అందుతున్నాయనే కోణంలో విచారణ చేసినట్లు తెలుస్తోంది. ఖైదీలతోపాటు సిబ్బందిని కూడా డిఐజి ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. విచారణ ముగిసిన అనంతరం నివేదికను రాష్ట్ర ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిసింది. ఎర్రచందనం స్మగ్లర్ దగ్గర నుంచి పది సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారనే వార్తల నేపథ్యంలో జైలు సూపరింటెండెంట్ రాజేశ్వరరావును సంప్రదించగా ఎటువంటి సెల్‌ఫోన్లు పట్టుబడలేదని, సెల్‌ఫోన్ల లభ్యతపై విచారణ మాత్రం సాగుతోందని తెలిపారు.

టిటిడి ఇఒ పేరుతో ఫేక్ అకౌంట్

- యాత్రికులు అప్రమత్తంగా ఉండాలి : టిటిడి

ప్రజాశక్తి - తిరుమల

టిటిడి ఇఒ జె శ్యామలరావు పేరుతో సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ఫేస్‌బుక్‌లో గుర్తుతెలియని వ్యక్తులు నకిలీ ఖాతాను సృష్టించి, యాత్రికులకు సందేశాలు పంపుతూ డబ్బులు కావాలని కోరుతున్నట్లు టిటిడి దృష్టికి వచ్చింది. ఇది పూర్తిగా మోసగాళ్ల నకిలీ చర్యగా గుర్తించింది. యాత్రికులు ఇటువంటి నకిలీ అకౌంట్లకు దూరంగా ఉండాలని, ఎవరికైనా ఇలాంటి సందేహాస్పద సందేశాలు వస్తే వెంటనే టిటిడి విజిలెన్స్ విభాగానికి చెందిన సెల్ నెం: 9866898630. లేదా టిటిడి టోల్ ఫ్రీ నెం: 18004254141కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని కోరింది. యాత్రికులు కేవలం టిటిడి అధికారిక వెబ్‌సైట్, సోషల్ మీడియా అధికారిక ఖాతాల ద్వారా వచ్చే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని విజ్ఞప్తి చేసింది.

పంట భూములు.. బీడుగా మార్చేశారు..!

- ఉమ్మడి నెల్లూరులో 50 వేల ఎకరాలు సేకరణ
- ప్రస్తుతం పది వేల ఎకరాలే వినియోగం
- కార్పొరేట్ల చేతుల్లో మిగతా భూములు
- ఇప్పుడు మళ్లీ భూసేకరణ అంటూ కొత్త నాటకం



పచ్చని పొలాలతో కరేడు గ్రామం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

పారిశ్రామికాభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు పేదల భూములను కార్పొరేట్ శక్తులు, బడా వ్యాపారులకు అప్పగిస్తున్నాయి. కొత్త కొత్త జిఒలు తీసుకొచ్చి పచ్చని పొలాలను బీడు భూములుగా మార్చేస్తున్నాయి. ప్రజలు ప్రశ్నిస్తే..“ పరిశ్రమలొస్తే ఉద్యోగం, ఉపాధి దొరుకుతుంది. మీ పిల్లల భవిష్యత్తు బాగుపడుతుంది” అని బడాయి మాటలు చెబుతున్నాయి. ఇందులో వాస్తవం లేదని ఇక్కడ పరిస్థితులు చేస్తే ఇట్టే అర్థమవుతోంది.

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఆసియాలోనే పెద్ద పోర్టుగా కృష్ణపట్నం పోర్టు అభివృద్ధి చెందుతోందని, ఇక్కడ వందలాది పరిశ్రమలు వస్తాయని, లక్షల్లో ఉద్యోగాలు వస్తాయని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గొప్పగా అనేక బహిరంగ సభల్లో ప్రకటించారు. థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి కేంద్రంగా నెల్లూరు మారుతోందని చెప్పి 2006లో 33 వేల మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టుల కోసం 33 వేల ఎకరాలు తీసుకున్నారు. ఆ రోజుల్లో రైతులు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ప్రాజెక్టుల వల్ల కాలుష్య ప్రమాదం ఉందని వామపక్షాలు, జెవివి వంటి సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌కు 5600 ఎకరాలు సేకరించారు. ప్రస్తుతం అక్కడ కొద్దిపాటి ప్రాజెక్టులు మాత్రమే ఉన్నాయి. కేవలం ఐదు వందల ఎకరాలు మాత్రమే వినియోగంలో ఉండగా మిగిలిన భూములు బీడుగా మారాయి. తడ మండలం వరదాయపాళెంలో శ్రీసిటి కోసం 5500 ఎకరాలు సేకరించగా.. ఇక్కడ అంతర్జాతీయ, జాతీయ పరిశ్రమలు వచ్చాయి. ఇక్కడ సుమారు వెయ్యి ఎకరాలు వినియోగంలో ఉండగా మిగిలిన భూములు ఖాళీగా ఉన్నాయి. చిల్లకూరు మండలం చింతవరం సెజ్ కోసం 2500 ఎకరాలు సేకరించారు. ఇందులో శ్రీలంకకు చెందిన బట్టల పరిశ్రమ కోసం 1996లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. ఇప్పుడు శిలాఫలకం కూడా కనిపించడం లేదు. 2005లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం కృష్ణపట్నం పోర్టు అభివృద్ధి కోసం ఆరువేల ఎకరాలు, కృష్ణపట్నం సెజ్‌కు మరో ఆరు వేల ఎకరాలు ఇక్కడ తీసుకున్నారు. ఇఫ్కో ఎరువుల పరిశ్రమల కోసం కొడవలూరు మండలం రేగడచెలిక వద్ద 2700 ఎకరాలు 35 సంవత్సరాల క్రితం తీసుకున్నారు. ఎరువుల పరిశ్రమ రాకపోవడంతో 2008లో దీనిని ఇఫ్కో కిసాన్ సెజ్‌గా పేరు మార్పు చేశారు. ఇక్కడ ఒకటో, రెండు పరిశ్రమలు వచ్చాయి. రైతుల నుంచి రిలయన్స్ థర్మల్ కోసం 2006లో కృష్ణపట్నం గ్రామంలో 2550 ఎకరాలు బలవంతంగా సేకరించారు. ఇప్పటికీ అక్కడ ఏలాంటి ప్రాజెక్టూ రాలేదు. ఈ గ్రామ ప్రజలు కూలీలుగా మారి జీవనం సాగిస్తున్నారు. రిలయన్స్ యాజమాన్యం ఈ భూములు ఎక్కువ ధరలకు అమ్ముకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది. అప్పట్లో రైతుల నుంచి కేవలం ఎకరా రూ.ఆరు లక్షలకు తీసుకున్నారు. ఇప్పుడు ఎకరా రూ.75 లక్షలు పలుకుతోంది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 50 వేల ఎకరాలు రైతుల నుంచి తీసుకుంటే ప్రస్తుతం పది వేల ఎకరాలు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. సుమారు 40 వేల ఎకరాలు పెద్దల చేతిలో పెట్టేశారు. కొందరు ఈ భూములు బ్యాంకుల్లో తాకట్టుపెట్టి రుణాలు తీసుకున్నారు. మరికొందరు అమ్మకాలకు పెట్టారు.

కరేడును కన్నీరు పెట్టిస్తున్నారు..!

అభివృద్ధి, ఉద్యోగాలు, ఉపాధి కళ్ల ముందు చూపించి గతంలో భూములు కాజేశారు. ఇప్పుడు రామాయపట్నం పోర్టు పేరు చెప్పి మళ్లీ కొత్త నాటకం మొదలు పెట్టారు. అందుకే ప్రజలు, రైతులు ముక్త కంఠంతో భూములు ఇవ్వబోమని తెగేసి చెబుతున్నారు. ఇండోసోల్ పరిశ్రమ కోసం 8,639 ఎకరాలు సేకరించనుండగా తాజాగా కరేడులో 4300 ఎకరాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. తమ భూములు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వబోమని రైతులు చెబుతున్నారు. ఈ నెల 4న జరిగిన ప్రజాభిప్రాయసేకరణలోనూ తమ నిరసన తెలిపారు. కరేడు రైతులకు న్యాయం చేయాలని వామపక్షాలు, కాంగ్రెస్, వైసిపి, ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

రాష్ట్రానికి ఏం కావాలో వివరించండి

- టిడిపి ఎంపిలకు బాబు దిశానిర్దేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రం నుండి రాష్ట్రానికి ఏం కావాలో పార్లమెంటు సమావేశాల్లో వివరించాలని, దానిని రాబట్టుకునేందుకు కృషి చేయాలని టిడిపి ఎంపిలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిశా నిర్దేశం చేశారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో శుక్రవారం టిడిపి పార్లమెంటరీ పార్టీతో ఆయన సమావేశమయ్యారు. త్వరలో జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై వివరించారు. రైతులకు మద్దతు ధర, నదీ జలాలు, పారిశ్రామీకీకరణ వంటి అంశాలను పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించాలని చెప్పారు. ఆయా అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించడంతో పాటు కేంద్రం నుంచి ఆశిస్తున్న సహాయాన్ని పార్లమెంట్ ద్వారా కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు, ప్రాజెక్టుల సాధనకు కృషి చేయాలని చెప్పారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న నేరపూరిత రాజకీయాలపై కూడా మాట్లాడాలని అన్నారు. ప్రధాని మోడీ చేస్తున్న మంచి పనులను కూడా సభలో ప్రస్తావించాలన్నారు. ఆపరేషన్ సింధూర్, ఎమర్జెన్సీకి 50 ఏళ్లు వంటి అంశాలపై జరిగే చర్చలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరును సమర్ధించాలన్నారు. రాష్ట్ర సమస్యలపై నిరంతరం సంప్రదింపులు జరపాలని, ఎంపిలకు శాఖల వారీగా కేటాయించిన విభాగాలకు సంబంధించిన సమస్యలు, పెండింగ్ అంశాలపై కేంద్ర మంత్రులతో నిరంతరం మాట్లాడాలని, అదే సమయంలో రాష్ట్ర యంత్రాంగంతోనూ సమన్వయం చేసుకోవాలని చెప్పారు. సంప్రదింపుల వల్లే నరేగాకు సంబంధించి రూ.180కోట్ల ఎన్‌ఆర్‌ఇజిఎస్ బిల్లులను తిరిగి ప్రక్రియలో పెట్టగలిగామన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల ప్రమోషన్లపై మరింత అధ్యయనం

- మంత్రివర్గ ఉపసంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల ప్రమోషన్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుపై మరింత అధ్యయనం చేసి ఎవరికీ ఇబ్బందులు లేకుండా నిర్ణయం తీసుకుంటామని మంత్రివర్గ ఉపసంఘం పేర్కొంది. సచివాలయంలో ఉపసంఘంలోని మంత్రులు డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, గుమ్మడి సంధ్యారాణి, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, పలువురు ఉన్నతాధికారులు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఇతర రాష్ట్రాల్లో ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల ప్రమోషన్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు తీరు, పలు కేసుల్లో న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులపైనా సుధీర్ఘంగా చర్చించారు. మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు.

మెమో 57 ప్రకారం పాత పెన్షన్ పునరుద్ధరించాల్సిందే

- డిఎస్‌సి-2003 ఫోరం ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ధర్నా



గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

సిపిఎస్ అమలు తేదీ కంటే ముందే వెలువడిన నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగం పొందినా, ఇతరత్రా కారణాల వల్ల ఆలస్యంగా ఉద్యోగాలలో చేరిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ డిఎస్‌సి-2003 టీచర్స్ ఫోరం ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు ఆందోళనలకు దిగారు. కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేశారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయుల ఆందోళనలకు పలు సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

ఏలూరు కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయులు నిర్వహించిన ధర్నానుద్దేశించి ఎమ్మెల్సీ గోపిమూర్తి మాట్లాడారు. తమది డబుల్ ఇంజన్ సర్కార్ అని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. 2003లో డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చి ప్రక్రియ అంతా పూర్తయినప్పటికీ అప్పటి ప్రభుత్వం కావాలనే నియామక ఉత్తర్వులు ఆలస్యంగా ఇచ్చిందని గుర్తు చేశారు. 2004 సెప్టెంబర్ ఒకటి నుంచి కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం అమల్లోకి వచ్చిందని, అయితే 2004 కంటే ముందే విడుదలైన నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు సిపిఎస్ వర్తింపజేయడం తగదన్నారు. శాసనమండలి సమావేశాల్లో ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయకపోతే ఉపాధ్యాయుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వందలాది మంది ఉపాధ్యాయులు గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షులు మోపిదేవి శివశంకర్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. కేంద్రం విడుదల చేసిన మెమో 57 ప్రకారం 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు కూడా ఒపిఎస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ముగ్గురు ఐఎఎస్‌లకూ ఒపిఎస్ ఇచ్చారని గుర్తు చేశారు. దాదాపు 15 రాష్ట్రాల్లో మెమో 57ను అమలు చేశారని తెలిపారు. కానీ ఉపాధ్యాయులకు మాత్రం అమలు చేయకపోవడం సరికాదన్నారు. దీనిపై రానున్న కాలంలో ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఉపాధ్యాయులకు పిడిఎఫ్ అండగా ఉంటుందని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎఎస్ రామకృష్ణ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యు.రాజశేఖర్‌రావు, ఎపిటిఎఫ్ 1938 జిల్లా అధ్యక్షులు నరసింహారావు, ఎపిటిఎఫ్ 257 అధ్యక్షులు బసవలింగారావు, ఫోరం జిల్లా అధ్యక్షులు ప్రసన్నకుమార్ తదితరులు ప్రసంగించారు. కృష్ణా జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి ఎపి జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. మెమో 57కు లోబడి అర్హులైన ప్రతి ఒక్కరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫోరం రాష్ట్ర కన్వీనర్లు కె. ఎల్.శ్రీనాథ్, తమ్ము నాగరాజు, పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు డి. శ్రీనివాస్ పాల్గొన్నారు.విజయనగరం, ప్రకాశం, చిత్తూరు కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు చేపట్టారు. విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. శ్రీకాకుళం కలెక్టరేట్ ఎదుట కుటుంబ సమేతంగా ఉపాధ్యాయులు ధర్నా చేశారు.

నియామకాలు, ఉద్యోగోన్నతుల్లో రిజర్వేషన్లు పక్కాగా అమలు చేయాలి

- జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్



హెచ్‌పిసిఎల్ ఉద్యోగులతో సమావేశమైన రామచందర్


ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఉద్యోగ నియామకాల్లో, ఉద్యోగోన్నతుల్లో రిజర్వేషన్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలని, ఎక్కడా అవకతవకలు జరగడానికి తావులేకుండా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దిగువ స్థాయిలో ఉన్న వారికి అభివద్ధి ఫలాలు అందేలా సహకారం అందించాలని సూచించారు. రెండో రోజు పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం విశాఖ జిల్లా మల్కాపురంలోని హెచ్‌పిసిఎల్ మహారత్న యూనిట్‌ను సందర్శించారు. అక్కడ పరిస్థితులను గమనించారు. ముందుగా భద్రతా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి, ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి బోర్డు కమిటీ సభ్యులతో సమావేశమై వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. నియామకాలు, ఉద్యోగోన్నతుల విషయంలో అనుసరిస్తోన్న విధానాలపై ఆరా తీశారు. ఉపాధి శిక్షణ, సిఎస్ఆర్ నిధుల వినియోగం, ఉద్యోగుల ప్రొబేషన్ విధానం, సంక్షేమం తదితర అంశాలపై లోతుగా చర్చించారు. వివిధ అంశాలపై స్పందించిన ఆయన ఎస్‌సిలకు కేటాయించిన 15 శాతం రిజర్వేషన్ ప్రక్రియను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు.

ఎస్‌సి యువతకు మరిన్ని అవకాశాలు కల్పించాలని సూచించారు. ఎంఎస్ఎంఇ టెండర్ల ప్రక్రియలో అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఎస్‌సి కమిషన్ డైరెక్టర్ జి.సునీల్ కుమార్ బాబు, రీసెర్చ్ అధికారి డి.వరప్రసాద్ పాల్గొన్నారు.

భారత్ నుంచి తరలిన 5 బిలియన్ల పెట్టుబడులు


- జూన్‌లో రెట్టింపు



న్యూఢిల్లీ : పెట్టుబడిదారులకు భారత ఆర్థిక వ్యవస్థ ఆకర్షణీయంగా కనబడుతున్నట్లు లేదు. ఈ నేపథ్యంలోనే ఇక్కడి పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్లు విదేశాల్లో పెట్టుబడులకు ఎక్కువగా మొగ్గ చూపిస్తున్నారని తెలుస్తోంది. ఇందుకు భారత్ నుంచి బయటకు వెళ్లిన ఎఫ్‌డిఐల గణంకాలే నిదర్శనం. ప్రస్తుత ఏడాది జూన్‌లో బయటికి తరలిపోయిన ఎఫ్‌డిఐలు 5.03 బిలియన్ డాలర్లకు చేరింది. గతేడాది ఇదే నెలలో ఈ మొత్తం 2.9 బిలియన్ డాలర్లతో పోల్చితే దాదాపు 74 శాతం పెరుగుదల చోటు చేసుకుందని స్వయంగా ఆర్‌బిఐ గణంకాలే స్పష్టం చేస్తున్నాయి. విదేశాలకు తరలిపోయిన వాటిలో ఈక్విటీ పెట్టుబడులు 2.04 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇవి గతేడాది ఇదే నెలలోని 670.7 మిలియన్ డాలర్లతో పోల్చితే మూడు రెట్ల పెరుగుదల చోటు చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్ కాలంలో విదేశాలకు తరలిపోయిన పెట్టుబడులు 6.64 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలో 4.3 బిలియన్ పెట్టుబడులు తరలిపోయాయి.

రూ.9,000 కోట్ల నిధుల సమీకరణలో రిలయన్స్ పవర్

న్యూఢిల్లీ :రిలయన్స్ పవర్ లిమిటెడ్ బోర్డ్ తాజాగా రూ.9,000 కోట్ల నిధుల సమీకరణకు ఆమోదం తెలిపింది. శుక్రవారం జరిగిన బోర్డు భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నిధులను ఈక్విటీ, నాన్-కన్వర్టిబుల్ డిబెంచర్ల ద్వారా క్యూఐపి లేదా ఇతర పద్ధతుల ద్వారా సేకరించనున్నారు. ఈ నిధులు పునరుత్పాదక శక్తి విస్తరణ, కొత్త వ్యాపార అవకాశాలు, వర్కింగ్ క్యాపిటల్ కోసం ఉపయోగించబడతాయని ఆ కంపెనీ తెలిపింది.



రాజీనామా పత్రంపై సంతకం చేస్తున్న అశోక్‌గజపతిరాజు

గవర్నర్‌గా నియామకంతో టిడిపికి అశోక్‌గజపతిరాజు రాజీనామా

ప్రజాశక్తి-విజయనగరం కోట

గోవా గవర్నర్‌గా నియమితులైన టిడిపి సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి పి అశోక్‌గజపతిరాజు శుక్రవారం ఆ పార్టీ శాశ్వత సభ్యత్వానికి, పార్టీ పొలిట్‌బ్యూరో పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు, జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుకు లేఖ పంపించారు. తన రాజీనామాను ఆమోదించాలని కోరారు. కుటుంబ సమేతంగా సింహాచలం అప్పన్న స్వామిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో రాజీనామా పత్రాలపై అశోక్‌గజపతిరాజు సంతకాలు చేశారు. టిడిపి సభ్యుడిగా, నాయకుడిగా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. గవర్నర్‌గా ఎంపికైన నేపథ్యంలో స్వామి దర్శనం అనంతరం పదవి చేపట్టనున్నట్లు తెలిపారు. సుదీర్ఘకాలం కొనసాగిన పార్టీకి రాజీనామా చేయడం బాధాకరంగా ఉందని అన్నారు. రాజీనామా విషయం ఇప్పటికే చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడి ఆమోదం తీసుకున్నట్లు తెలిపారు.

26న గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం

ఈ నెల 26న గోవా గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసేందుకు అక్కడి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని అశోక్‌గజపతిరాజు తెలిపారు. 26 నుంచి రాజ్యాంగంలో ఇంకో రోల్ ప్లే చేయాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావత్‌తో మాట్లాడినట్లు చెప్పారు.



బయోమైనింగ్ పనుల ప్రారంభ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ

ప్రతి ఇంటికి ట్యాప్ కనెక్షన్

- మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ
- అనంతపురంలో బయోమైనింగ్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అమత్ పథకం కింద రూ. 8,500 కోట్లతో ప్రతి ఇంటికి ట్యాప్ కనెక్షన్ ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు. అనంతపురం కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని మరో నాలుగు మున్సిపాల్టీల్లో జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ ద్వారా చేపట్టనున్న బయోమైనింగ్ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, కలెక్టర్ వి.వినోద్‌కుమార్, కమిషనర్ బాలాస్వామి తదితరులు పాల్గొన్నారు. గుత్తి రోడ్‌లో ఉన్న కంపోస్ట్ యార్డ్‌ను మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. చెత్త సేకరణ, తరలింపు తదితర వివరాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడుతూ... వైసిపి ప్రభుత్వం చెత్తపైనా పన్నులు వేసిందని, టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పన్నును రద్దు చేశామన్నారు. వచ్చే అక్టోబర్ రెండు నాటికి రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్తను తొలగించాలని ముఖ్యమంత్రి ఆదేశించిన నేపథ్యంలో ఇప్పటికే 50 లక్షల టన్నుల చెత్తను తొలగించామని తెలిపారు. మరో 35 లక్షల చెత్తను తొలగిస్తామన్నారు. అనంతపురం కంపోస్ట్ యార్డ్‌లో 1.65 లక్షల టన్నుల చెత్త మిగిలిందని, రోజుకు నాలుగు నుంచి ఆరువేల టన్నుల చొప్పున చెత్తను తొలగిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ.. కార్పొరేషన్‌కు సంబంధించి స్పెషల్ గ్రాంట్ ఫండ్స్‌ను విడుదల చేయాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రామ్మోహన్ రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దారెడ్డి గృహ నిర్బంధం

- తాడిపత్రికి వెళ్లనీయకుండా అడ్డగింత

ప్రజాశక్తి-యల్లనూరు (అనంతపురం జిల్లా)



తిమ్మంపల్లిలోని తన నివాసం నుంచి తాడిపత్రికి వెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు మరోసారి గృహ నిర్బంధం చేశారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో శుక్రవారం నిర్వహించనున్న వైసిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొనేందుకు పెద్దారెడ్డి సిద్ధమయ్యారు. కాగా పెద్దారెడ్డి వస్తే అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో పోలీసులు పెద్దారెడ్డిని యల్లనూరు మండలం తిమ్మంపల్లిలోని ఆయన నివాసంలో గృహ నిర్బంధం చేశారు. శుక్రవారం ఉదయమే పెద్ద సంఖ్యలో పోలీసులు తిమ్మంపల్లికి చేరుకున్నారు. శాంతిభద్రతల దృష్ట్యా తాడిపత్రికి వెళ్లేందుకు వీల్లేదంటూ పెద్దారెడ్డికి పోలీసులు తెలిపారు. ఈ సమయంలో పోలీసులపై పెద్దారెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడిపత్రికి వెళ్లేందుకు కోర్టు తనకు అనుమతిచ్చినా 18 నెలలుగా పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. జెసి ప్రభాకర్ రెడ్డి కోర్టు ఆదేశాలను సైతం ధిక్కరించేలా ప్రవర్తిస్తుంటే ఆయనను నిలువరించాల్సింది పోయి తనను అడ్డుకోవడం ఏమిటన్నారు.

అసాంఘిక శక్తులకు ప్రోత్సహిస్తున్న జెసి : పెద్దారెడ్డి

తాడిపత్రిలో అసాంఘిక శక్తులను జెసి ప్రభాకర్‌రెడ్డి ప్రోత్సహిస్తున్నారని పెద్దారెడ్డి విమర్శలు చేశారు. తిమ్మంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గంజాయి, మట్కా, పేకాట క్లబ్‌లను జెసి ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. వీటిని అరికట్టలేని పోలీసులు తాను తాడిపత్రికి వెళ్తానంటే మాత్రం అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంపాదకీయం

తేనెతుట్టె కదిలించొద్దు

రెండు తెలుగు రాష్ట్రాల నడుమ నదీ జలాల వివాదాలపై కేంద్రం నిపుణుల కమిటీ ఏర్పాటు సమస్యను జటిలం చేసేదిగా ఉంది. తక్షణం ముందుకొచ్చిన పోలవరం- బనకచర్లను వదిలేసి అన్ని వివాదాలపైనా ముగ్గులోకి లాగడం వెనుక కేంద్ర ప్రభుత్వ దుర్బుద్ధి స్పష్టంగా కనిపిస్తుంది. కేంద్రం సహాయంతో బనకచర్లను నిర్మించి తీరతామని టిడిపి కూటమి ప్రభుత్వం కొన్ని నెలలుగా ప్రచారం చేస్తోంది. అటు తెలంగాణ ప్రభుత్వం నుంచి తీవ్ర వ్యతిరేకతలొస్తున్నాయి. ఒక సమయంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చొని పరిష్కరించుకుంటామని ఒకరికొకరు మీడియాముఖంగా ప్రతిపాదనలు పంపుకున్నారు. ఏమైందోఏమో కేంద్రం జోక్యాన్ని ఎపి కోరింది. కేంద్రానికి తెలంగాణ తన అభ్యంతరాలను రాతపూర్వకంగా ఇచ్చింది. ఎప్పుడు దూరదామా అని కాచుక్కూర్చున్న కేంద్రానికి అవకాశం దొరికింది. బుధవారం ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్ నేతృత్వంలో రెండు రాష్ట్రాల సిఎంలు సమావేశమై కృష్ణా, గోదావరి నదీజలాల వివాదాల పరిష్కారానికి నిపుణుల కమిటీకి ఓకే చెప్పుకున్నారు. నీటి లెక్కలు తీయడానికి యంత్రాలు, అమరావతికి కృష్ణా నదీ జలాల యాజమాన్య బోర్డు తరలింపు వంటివి ఉన్నప్పటికీ ఆగమేఘాల మీద సోమవారమే కమిటీ ఏర్పాటవుతుందని స్పష్టీకరించారు. దీనిలో కేంద్రానికి చెందిన ఐఎఎస్‌లు, నిపుణులూ ఉంటారు. దీనర్థం ఇద్దరి జుట్లూ కేంద్రం చేతికి చిక్కినట్లు కాదా? రాజకీయ ప్రయోజనాలు లేకుండానే కేంద్రం ఈ పని చేసిందని నమ్మగలమా?

అసలు బుధవారం జలశక్తి శాఖ నిర్వహించిన సమావేశానికి ఎంత వరకు చట్టబద్ధత ఉందో అర్థం కాదు. నదీజలాల వివాదాల పరిష్కారానికి కేంద్ర జలశక్తి మంత్రి అధ్యక్షతన రెండు తెలుగు రాష్ట్రాల సిఎంలు సభ్యులుగా అపెక్స్ కౌన్సిల్ వేయాలని విభజన చట్టంలో ఉంది. ఈ పదకొండేళ్లల్లో రెండంటే రెండు తడవలు అపెక్స్ కౌన్సిల్ భేటీ అయింది. ఇప్పుడు జరిగింది అపెక్స్ మీటింగే కాదని కేంద్రం స్పష్టం చేసింది. అంటే దీనిలో తీసుకున్న నిర్ణయాలకు కేంద్రం, రెండు రాష్ట్రాలు బద్ధులు కావాల్సిన అవసరం లేదనే ధ్వని కేంద్ర ప్రకటనలో స్ఫురిస్తోంది. కాగా నిపుణుల కమిటీ నివేదిక మేరకు నడుచుకోడానికి అంగీకరించినట్లు చెబుతున్నారు. సమావేశంపై ఇటు ఎపి సిఎం చంద్రబాబు, అటు తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి వెలుపలికొచ్చి మబ్బులో పెట్టి మాట్లాడారని సులభంగానే అర్థం చేసుకోవచ్చు. సమావేశం జరిగినంతసేపూ మీడియాలో బనకచర్లపైనే చర్చ అని గంటలకు గంటలు చర్చావేదికలు, లైవ్‌లు నడిచాయి. తీరా అసలు ఆ ఎజెండానే లేదని ఇద్దరు సిఎంలు, కేంద్ర మంత్రి పాటిల్ వెల్లడించారు. అక్కడికి లోపలేదో తమ తమ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఇద్దరు సిఎంలు, అధికారులు పట్టుబట్టినట్లు లీకులిచ్చారు.

నదీ జలాల విషయంలో రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న దానికంటే భిన్నంగా జరిగినట్లయితే అది ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు తీవ్రనష్టం కలిగిస్తుంది. నిపుణుల కమిటీ పేరుతో కొత్త వివాదాలకు ఆస్కారం ఇవ్వరాదు. అంతర్రాష్ట్ర నదీ జలాల సమస్యలు ముందుకొచ్చినప్పుడు అఖిలపక్ష సమావేశం నిర్వహించి పరిస్థితులను వివరించి రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు అందరూ ఏకతాటి పైకి రావాలి. అదే ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనం అవుతుంది. ఆల్మట్టి సహా గతంలో పలు అంశాల్లో ఆల్‌పార్టీ భేటీలు జరిగాయి. ఆ ఆనవాయితీ గంగలో కలిసింది. ప్రభుత్వాలు ఏమనుకుంటే అదే. ఈ వైఖరి ప్రజలకు తీరని అన్యాయం చేస్తుంది, ప్రజాస్వామ్య విలువలకు హాని కలిగిస్తుంది. డబుల్ ఇంజన్ సర్కార్ అంటున్న బిజెపి రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా తొండాట ఆడుతోంది. దీన్ని రెండు తెలుగు రాష్ట్రాలూ గమనించాలి. ఎపి ప్రభుత్వం తక్షణం అఖిలపక్షం వేసి నిపుణుల కమిటీ విధి విధానాలపై అందరి అభిప్రాయాలు తెలుసుకోవాలి. అన్ని వివరాలు ప్రజలకు తెలియజెప్పాలి. రూ.82 వేల కోట్ల బాహుబలి ప్రాజెక్టు బనకచర్ల సాధ్యాసాధ్యాలపై నిపుణుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అవేమీ పట్టించుకోకుండా మూడేళ్లల్లో పూర్తి చేస్తామంటోంది కూటమి సర్కారు. బనకచర్ల కంటే ముందు రాష్ట్రంలో రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఇతర వెనకబడిన ప్రాంతాల్లో పెండిగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తే ప్రజలకు, రైతులకు, సాగుకు ఎనలేని ఉపయోగం. ఈ వాస్తవం కూటమి ప్రభుత్వం తలకెక్కట్లేదు.

మహనీయుల మాట



పోరాటం మాత్రమే పీడిత వర్గాన్ని ఎడ్యుకేట్ చేస్తుంది. పోరాటం మాత్రమే దాని శక్తి ఏమిటో దానికి తెలియచేస్తుంది. పోరాటం మాత్రమే దాని శక్తిని విస్తృతపరుస్తుంది. దాని సామర్థ్యాన్ని పెంచుతుంది. దానికి స్పష్టతనిస్తుంది. ఆత్మస్థైర్యాన్ని ఇస్తుంది.

- వి.ఐ. లెనిన్

సామ్రాజ్యవాద, నాజీ, ఫాసిస్టు ఆయుధాలతో ఆర్‌ఎస్‌ఎస్

విశ్లేషణ




ఎం.ఎ. బేబి

తన మత విశ్వాసానికి తగినట్టు జీవించే స్వేచ్ఛ ప్రతీ భారతీయుడికీ ఉంది. అదే సమయంలో మతం రాజ్య నిర్వహణలో జోక్యం కల్పించుకోకూడదు అన్న భావన కూడా ఉంది. మన రాజ్యాంగం పునాది సూత్రాలలో ఒకటైన లౌకికవాదం విలువ ఈ ప్రాతిపదిక పైనే ఏర్పడింది. కాని ఇప్పుడు అదే రాజ్యాంగానికి కట్టుబడి నడుచుకుంటామని ప్రమాణం చేసి అధికారం చెలాయిస్తున్నవారు ఈ రెండు విలువలనూ ఉల్లంఘిస్తున్నారు. నెమ్మది నెమ్మదిగా, క్రమంగా భారతదేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చివేసే పథకాన్ని వాళ్ళు అమలు చేస్తున్నారు. బాబ్రీ మసీదును ధ్వంసం చేసి అదే స్థలంలో రామ మందిరాన్ని నిర్మించడం వంటి చర్యలు ఆ పథకంలో భాగమే. ఇప్పుడు కేవలం మత ప్రాతిపదికన చాలా హెచ్చు సంఖ్యలో ప్రజలకు పౌరసత్వాన్ని నిరాకరించడం కూడా ఆ దిశగా వేస్తున్న మరో అడుగు.

పౌరసత్వానికి సంబంధించి రెండు దృక్పథాలు ఉన్నాయి. మొదటిది: ఎక్కడ పుట్టారన్నదానిని బట్టి పౌరసత్వం నిర్ణయించడం. రెండవది: ఏ జాతికి, (రేస్) ఏ సంస్కృతికి చెందినవారన్న దానిని బట్టి పౌరసత్వాన్ని నిర్ణయించడం. 1949 రాజ్యాంగ సభలో పౌరసత్వం మీద చర్చ జరిగిన అనంతరం, పుట్టిన స్థలాన్ని బట్టి పౌరసత్వాన్ని నిర్ణయించాలన్న ఆధునిక దృక్పథాన్ని మన భారత రాజ్యాంగం స్వీకరించింది. అప్పుడు కూడా మతాన్ని ప్రాతిపదికగా చేసుకుని పౌరసత్వం నిర్ధారించాలన్న వాదనలు వచ్చాయి. కాని రాజ్యాంగ సభ ఆ వాదనలను తిరస్కరించింది. ఏ ప్రగతిశీల సమాజానికీ మత అస్థిత్వాలను బట్టి పౌరసత్వాన్ని నిర్ణయించడం పొసగదు అన్న వైఖరిని రాజ్యాంగసభ అవలంబించింది. మతాన్ని ప్రాతిపదికగా చేసుకుని పౌరసత్వాన్ని నిర్ణయించే ఏ రాజ్యం అయినా లౌకిక రాజ్యం అనిపించుకోదు. అది మతాధిపతుల పాలన అవుతుంది. భారతదేశాన్ని అట్టి రాజ్యంగా మార్చివేయాలనుకోవడం రాజ్యాంగ విరుద్ధం.

భారత రాజ్యాంగంలోని 5 నుండి 11 వరకు గల అధికరణలు పౌరసత్వం గురించి నిర్దేశిస్తాయి. భారత భూభాగం మీద జన్మించిన ఏ వ్యక్తి అయినా భారతీయ పౌరసత్వాన్ని పొందడానికి అర్హుడు లేదా అర్హురాలు అని చాలా స్పష్టంగా 5(ఎ) అధికరణ చెప్తోంది. ఐతే, ఆ తర్వాత కాలంలో దీనినుండి కొంత పక్కకు పోవడం జరిగింది. 1986లో రాజీవ్ గాంధీ ప్రభుత్వం, 2003లో వాజ్‌పేయి ప్రభుత్వం ఈ స్పష్టతను కొంత నీరుగార్చాయి. ముఖ్యంగా, 2003లో చేసిన సవరణలో ఈ గడ్డ మీద పుట్టినప్పటికీ, తల్లిదండ్రులలో ఒకరు గనుక చట్టవిరుద్ధంగా ఈ దేశంలోకి వచ్చి బతుకుతున్నట్లైతే అప్పుడు ఆ బిడ్డకు పౌరసత్వం పొందే అర్హత ఉండదని ఉంది. ఈ రోజు మన ముందున్న పౌరసత్వ సవరణ చట్టం (సి.ఎ.ఎ)కు దీనిని తొలి రూపం అని చెప్పవచ్చు. దానిని తెచ్చినది బిజెపి ప్రభుత్వం అయితే, యు.పి.ఎ-2 ప్రభుత్వం 2010లో దానిని అమలు చేయడానికి కావలసిన సన్నాహాలను ప్రారంభించింది. అందులో భాగంగానే జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్.పి.ఆర్) అన్నదానిని రూపొందించింది. ఆ తర్వాత వచ్చిన బిజెపి ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి జాతీయ పౌరసత్వ రిజిస్టర్‌ను రూపొందించాలన్న ఉద్దేశాన్ని ప్రకటించింది. ప్రజాబాహుళ్యంలో బలంగా తలెత్తిన వ్యతిరేకత కారణంగా ప్రస్తుతానికి ఈ రెండూ ఆగిపోయాయి.

పౌరసత్వ సవరణ చట్టం వలన ఇప్పుడు పౌరులుగా ఉన్న వారికేమీ ఇబ్బంది ఉండబోదని సంఘపరివార్ అంటోంది. ఐతే, కేంద్ర హోం మంత్రి పార్లమెంటులోను, వెలుపల కూడా "వరుస క్రమాన్ని అర్థం చేసుకోండి" అని ప్రకటించారు. ఏమిటా వరుస క్రమం? మొదట పౌరసత్వ చట్ట సవరణ అమలు అవుతుంది. ఆ తర్వాత జాతీయ పౌరసత్వ రిజిస్టర్ వస్తుంది. తగిన డాక్యుమెంట్లను చూపలేనివారు తమ పౌరసత్వాన్ని సి.ఎ.ఎ నిబంధనల ప్రకారం రుజువు చేసుకోవలసి వస్తుంది. పౌరసత్వ రిజిస్టరు తయారీ సమయంలో అధికారులు అడిగిన వివరాలకు-తమ తల్లిదండ్రుల జన్మస్థలాల వివరాలతో సహా, ఖచ్చితమైన సమాధానాలు ఇవ్వలేనివారు అనుమానాస్పద జాబితాలో పడతారు. అలా పడ్డవారు అస్సాంలో 19 లక్షల మంది. వారిలో మూడింట రెండొంతులు మహిళలు. వారందరి పౌరసత్వమూ అనుమానాస్పదమైపోయింది. ఇదే మాదిరిగా దేశమంతటా జరగదన్న గ్యారంటీ ఏముంది?



సంఘపరివార్ లక్ష్యం మైనారిటీ మతస్తులు కావచ్చు. కాని మెజారిటీ మతానికి చెందినవారైనప్పటికీ చదువు లేనివారు, పేదలు కూడా చాలామంది దగ్గర ఖచ్చితమైన డాక్యుమెంట్లు ఉండవు. ఒక అంచనా ప్రకారం దేశంలో 42 శాతం మంది దగ్గర జనన ధ్రువ పత్రాలు (బర్త్ సర్టిఫికెట్) లేవు. అటువంటి వారి విషయంలో పౌరసత్వం ఏవిధంగా నిర్ధారించాలో ఇంతవరకూ స్పష్టత లేదు. అంటే, ఖచ్చితమైన ధ్రువపత్రాలు లేనందున కోట్లాదిమంది భారతీయ పౌరులు కాకుండా పోతారన్నమాట. అటువంటివారంతా నిర్బంధ క్యాంపుల్లోనైనా బతకాలి లేదా ఎటువంటి పౌర హక్కులూ లేకుండానైనా కొనసాగాలి. ఈ చేదు వాస్తవం మన ముందు నిలిచి సవాలు చేస్తోంది.

ఇప్పుడు భారతదేశంలో మనం చూస్తున్న పరిణామాల మాదిరిగానే గతంలో నాజీ జర్మనీలో కూడా జరిగాయి. ముఖ్యంగా తాజాగా ఎన్నికల కమిషన్ బీహార్‌లో ఓటర్ల జాబితాను సవరించే పేరుతో సాగిస్తున్న కసరత్తు చూస్తే దొడ్డి దారిన జాతీయ పౌరసత్వ రిజిస్టర్‌ను అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు భావించాలి. 1935 సెప్టెంబర్ 15న నాజీ జర్మనీ న్యూరెంబర్గ్ చట్టాలు అనే యూదు వ్యతిరేక, జాత్యహంకార చట్టాలను తయారు చేసింది. అందులో ప్రధానమైనవి రెండు చట్టాలు. 1.రీచ్ (జర్మన్ రాజ్యం) పౌరసత్వ చట్టం, 2. జర్మన్ రక్తాన్ని, జర్మన్ గౌరవాన్ని పరిరక్షించే చట్టం. మొదటి చట్టంలో జర్మన్లు, జర్మన్లతో బంధుత్వం ఉన్నవారు మాత్రమే పౌరులుగా పరిగణించబడతారు. యూదులు, తక్కినవారు రాజ్యానికి భృత్యులుగా పరిగణించబడతారు. వారికి ఓటు హక్కు, పదవులు చేపట్టే హక్కు వంటివి ఉండవు. వారికి న్యాయపరమైన రక్షణ కూడా ఉండదు. రెండవ చట్టం ప్రకారం జర్మన్ పౌరులతో యూదులు వివాహ, వివాహేతర సంబంధాలను కలిగి వుండరాదు. యూదులు తమ ఇళ్ళలో 45 సంవత్సరాల లోపు వయస్సు కల మహిళలను ఇంటి పనులకోసం నియమించుకోరాదు. యూదులు జర్మనీ పతాకాన్ని ఎగురవేయరాదు.

యూదుల అస్తిత్వాన్ని మత ప్రాతిపదికన కాకుండా జాతి ప్రాతిపదికన గుర్తించడం ఈ చట్టాలలో ప్రత్యేకత. వారి మతాచారాలను బట్టి లేదా వారి వ్యక్తిగత విశ్వాసాలను బట్టి కాకుండా వారి పూర్వీకులను బట్టి యూదులా కాదా అన్నది నిర్ధారించడం ప్రారంభించారు. మూడు లేదా నాలుగు తరాల వెనుక వారు (ముత్తాతల కాలం నుండి) గనుక యూదులు అని తేలితే అట్టివారిని యూదులుగా గుర్తించారు. తక్కినవారిని సంకర జాతి వారుగా గుర్తించారు. వారి చట్టపరమైన హోదా తక్కువగా ఉండేది. యూదులను చట్టపరంగా వేధించడంలో న్యూరెంబర్గ్ చట్టాలు ఒక కీలక అడుగు. వివక్షత, వేరుగా ఉంచడం, చివరిగా సామూహికంగా అంతం చేయడం అనే దుర్మార్గాలకు ఈ చట్టాలు పునాది వేశాయి. అప్పటి నాజీ జర్మనీకి, నేటి భారతదేశానికి ఈ విషయంలో, చట్టాల సారాంశంలో కాని, లక్ష్యాలలో కాని, ఎంత దగ్గర పోలికలు ఉన్నాయో ఇంకా వివరించనవసరం లేదు.

> **సి.ఎ.ఎ, ఎన్.ఆర్.సి, బీహార్ ఓటర్ల జాబితా సవరణ వంటి నాజీ జర్మనీ విధానాలే ఇక్కడ, ప్రస్తుతం అమలు అవుతున్నాయి. ఇటువంటి చట్టాలు మనకు అవసరం అని చెప్పుకుంటున్నారు ఆర్.ఎస్.ఎస్ వాళ్ళు. అందుకే సిపిఐ(ఎం) ప్రస్తుతం భారతదేశంలో నయా ఫాసిస్టు విధానాలు ఉనికిలోకి వచ్చాయని సరిగ్గా అంచనాకి వచ్చింది. ఇది పాత కాలపు ఫాసిజం కంటే భిన్నం. నాజీలు చేసిన రీచ్ పౌరసత్వ చట్టం ఇక్కడ సి.ఎ.ఎ లో మనకు కనిపిస్తుంది. దానికి ఎన్.ఆర్.సి ని కలిపితే అప్పుడు మత అస్తిత్వం బట్టి పౌరసత్వాన్ని నిర్ణయించే వ్యవస్థ ఏర్పడుతుంది. ఈ చర్యలన్నీ ప్రత్యేకించి భారతీయ ముస్లింలను తమ లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ఖచ్చితమైన ధృవీకరణ పత్రాలను గనుక సమర్పించలేకపోతే, వారంతా రెండవ తరగతి పౌరులుగానో, దేశానికి చెందనివారుగానో మిగిలిపోతారు. అప్పుడు నాజీ జర్మనీలో కూడా ఈ మాదిరిగానే ఒక పద్ధతి ప్రకారం యూదులను, తక్కిన మైనారిటీలను ఒంటరి చేసి వారికి ఓటు హక్కు లేకుండా చేశారు.**

ఈ పోలికలుండడం యాదృచ్ఛికం ఏమాత్రమూ కాదు. ఆర్.ఎస్.ఎస్ ఏర్పడే సమయంలో, అంటే 1920-1930 కాలంలో, అది నాజీ జర్మనీ నుండి, ఫాసిస్టు ఇటలీ నుండి ప్రేరణ పొందింది. బి.ఎస్ మూంజె హిందూ మహాసభ అధ్యక్షుడు, ఆర్.ఎస్.ఎస్ వ్యవస్థాపకుడైన కేశవ్ బలిరాం భగత్‌కు గురువు. వీరిద్దరూ 1931లో ముస్సోలినీని కలవడంతో ఇటలీలో పుట్టిన ఫాసిస్టు సిద్ధాంతానికి, భారతదేశంలోని హిందూ జాతీయ దురహంకార భావజాలానికి మధ్య సంపర్కం అయ్యింది. 1931 మార్చి 15 నుండి 24 దాకా బి.ఎస్ మూంజె ఇటలీలో పర్యటించాడు. అప్పుడు ప్రధాని బెనిటో ముస్సోలీనీని కలిశాడు. "ఇటలీని సైనికంగా పునరుజ్జీవింపజేసిన ముస్సోలీనీ దార్శనికత"ను ప్రశంసిస్తూ మూంజె తన డైరీలో రాసుకున్నాడు. "భారత దేశానికి, ముఖ్యంగా హైందవ భారతానికి అటువంటి సైనిక సంస్థలుంటేనే ఇక్కడ కూడా హిందువుల సైనిక పునరుజ్జీవనం సాధ్యం" అని స్పష్టంగా అందులో పేర్కొన్నాడు.

అక్కడ చూసినదానితో ఉత్తేజం పొందిన మూంజె 1935లో కేంద్ర హిందూ మిలిటరీ విద్యా సొసైటీని స్థాపించాడు. భోన్సాలా మిలిటరీ స్కూల్‌ను నాసిక్‌లో 1937లో స్థాపించాడు. హిందూ రాజ్యాన్ని సైనికీకరణ చేసే లక్ష్యంతో వాటిని ఏర్పరిచాడు. వీటిలో రిక్రూట్ చేయడానికి, నిర్వహించడానికి అనుసరించిన విధానం ఆపెరా నాజియోనేల్ బాలిల్లా (ఇటలీ ఫాసిస్టు యువజన సంఘం)ను పోలివుంది. ఇదే విధానాన్ని ఆర్.ఎస్.ఎస్ తర్వాత కాలంలో తన సంస్థకు కూడా వర్తింపజేసింది. ముస్సోలినీ పద్ధతుల పట్ల మూంజె కనపరిచిన ఆరాధన తర్వాత కాలంలో ఆర్.ఎస్.ఎస్ సంస్థ, తక్కిన హిందూ జాతీయవాద సంస్థలు పాటించే విధానాలను, విలువలను తీర్చి దిద్దడంలో ప్రతిబింబించింది. ఆ ప్రభావం ఆర్ఎస్ఎస్ పైన, దాని సంస్థాగత అభివృద్ధిపైన దీర్ఘకాలంగా కొనసాగుతున్నాయి. అందులో ఇటాలియన్ ఫాసిస్టు శక్తుల, పారా మిలిటరీ దళాల సంస్థాగత విధానాలు కూడా ఒక భాగం.

తొలి తరం ఆర్.ఎస్.ఎస్ నేతలు, మాధవ్ సదాశివరావు గోల్వాల్కర్, సిద్ధాంతవేత్త వినాయక్ దామోదర్ సావర్కర్ బహిరంగంగానే హిట్లర్, ముస్సోలినీల పాలనను ప్రశంసించారు. "సాంస్కృతిక జాతీయవాదం" భావనతోను, ఆధిపత్యం చెలాయించగల ఒక మెజారిటీ జాతికో లేక మెజారిటీ మతానికో చెందిన వారితో సమాజాన్ని నడిపించడం అనే భావన తోను వారు ప్రత్యేకించి ప్రభావితులయ్యారు. 1939లో గోల్వాల్కర్ రచించిన 'వుయ్ అండ్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్' అన్న గ్రంథంలో ప్రత్యేకంగా హిట్లర్ విధానాల పట్ల ఆరాధన వ్యక్తం అయ్యింది. భారతదేశం కూడా హిందూ రాష్ట్ర గా పునర్నిర్వచించబడాలని, జర్మనీలో నాజీలు యూదుల పట్ల వ్యవహరించినట్టుగానే ఇక్కడ మైనారిటీ మతస్తుల పట్ల వ్యవహరించాలని ఆ గ్రంథంలో వాదించాడు.

ఆర్.ఎస్.ఎస్ సిద్ధాంతం రూపొందడం వెనుక ఈ గ్రంథం కీలక పాత్ర పోషించింది. ఆ సంస్థను ఫాసిస్టు భావజాలంతో ముడివేసింది. జాతీయత అన్న అంశంలో ఆర్.ఎస్.ఎస్ హిందూ రాష్ట్ర అన్నది కూడా ఫాసిస్టు, నాజీ నమూనాల మాదిరిగా రూపొందాలని గోల్వాల్కర్ తన బహిరంగ ఉపన్యాసాలలో సైతం ప్రకటించేవాడు. 'బంచ్ ఆఫ్ థాట్స్' అన్న తన మరొక గ్రంథంలో ముస్లింలను, క్రైస్తవులను, కమ్యూనిస్టులను భారతదేశానికి అంతర్గతంగా పొంచి వున్న ప్రమాదాలుగా వర్ణించాడు.

న్యూరెంబర్గ్ చట్టాలను రూపొందించిన కొద్ది కాలానికి నాజీ జర్మనీ అన్ని ప్రజాతంత్ర హక్కులనూ రద్దు చేసింది. ఎన్నికలను నిర్వహించడం ఆపివేసింది. సి.ఎ.ఎ, ఎన్.ఆర్.సి, బీహార్ ఓటర్ల జాబితా సవరణ వంటి నాజీ జర్మనీ విధానాలే ఇక్కడ, ప్రస్తుతం అమలు అవుతున్నాయి. ఇటువంటి చట్టాలు మనకి అవసరం అని చెప్పుకుంటున్నారు ఆర్.ఎస్.ఎస్ వాళ్ళు. అందుకే సిపిఐ(ఎం) ప్రస్తుతం భారతదేశంలో నయా ఫాసిస్టు విధానాలు ఉనికిలోకి వచ్చాయని సరిగ్గా అంచనాకి వచ్చింది. ఇది పాత కాలపు ఫాసిజం కంటే భిన్నం. నాజీలు చేసిన రీచ్ పౌరసత్వ చట్టం ఇక్కడ సి.ఎ.ఎ లో మనకు కనిపిస్తుంది. దానికి ఎన్.ఆర్.సి ని కలిపితే అప్పుడు మత అస్తిత్వం బట్టి పౌరసత్వాన్ని నిర్ణయించే వ్యవస్థ ఏర్పడుతుంది. ఈ చర్యలన్నీ ప్రత్యేకించి భారతీయ ముస్లింలను తమ లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ఖచ్చితమైన ధృవీకరణ పత్రాలను గనుక సమర్పించలేకపోతే, వారంతా రెండవ తరగతి పౌరులుగానో, దేశానికి చెందనివారుగానో మిగిలిపోతారు. అప్పుడు నాజీ జర్మనీలో కూడా ఈ మాదిరిగానే ఒక పద్ధతి ప్రకారం యూదులను, తక్కిన మైనారిటీలను ఒంటరి చేసి వారికి ఓటు హక్కు లేకుండా చేశారు.

బీహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను చూస్తే మైనారిటీలు, ఇతర బలహీన తరగతులవారు తమ ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం కనిపిస్తోంది. అధికార యంత్రాంగాన్ని ఉపయోగించి జనాభాలో కొన్ని తరగతులవారిని రాజకీయ ప్రక్రియ నుంచి దూరంగా నెట్టివేసే ప్రయత్నంలో దీనిని ఒక భాగంగా చూడాలి. నాజీ జర్మనీలో కూడా ఇదే మాదిరిగా చట్టపరంగా, అధికార యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకుని సమాజం నుండి యూదులను వేరు చేశారు. ఇలా చట్టాన్ని, అధికార యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకుని మత ప్రాతిపదికన పౌరసత్వాన్ని నిర్ణయించడం, మైనారిటీలకు ఓటు హక్కు లేకుండా చేయడం ప్రమాదకరమైన చర్యలు. దీనికి తోడు మైనారిటీలకు వ్యతిరేకంగా, లౌకికవాదానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున జరుగుతున్న విద్వేష ప్రచారం రానున్న కాలానికి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. 1933లో నాజీలు జర్మనీలో అధికారానికి వచ్చిన అనంతరం యూదుల పట్ల వివక్షత చూపే చట్టాలతోనే మొదలుబెట్టారు. ఇక్కడ ముస్లింలకు వ్యతిరేకంగా భారత ప్రజాస్వామ్యాన్ని ఒక మతాధికారుల రాజ్యంగా మార్చివేసే ప్రయత్నాలు మొదలుబెట్టారు.

కొందరేమో లౌకికతత్వం, సోషలిజం అనేవి విదేశీ భావనలు అని బాధపడిపోతున్నారు. కాని వాళ్ళు మాత్రం సామ్రాజ్యవాదుల నుండి, నాజీల నుండి, ఫాసిస్టుల నుండి విదేశీ భావనలను అరువు తెచ్చుకుని వాటిని ఇక్కడ అమలు చేయడానికి తయారౌతున్నారు. బ్రిటిష్ పాలకులను ఏ ఐక్యతతో ఓడించామో అదే ఐక్యతను మళ్ళీ సాధించి దానితోనే ఆర్.ఎస్.ఎస్ ను, దాని మత విద్వేష ఎజెండాను ఓడించాలి. భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యం భారతీయులందరి కోసమూ ఏర్పడినది. ఆ ఏర్పాటుకు ఆర్.ఎస్.ఎస్ తోడ్పడలేదు. జాతీయోద్యమం నుండి దూరంగా ఉండిపోయింది ఆర్.ఎస్.ఎస్. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, సిక్కులు, ఏ మత విశ్వాసాలూ లేనివారు అందరూ కలిసి ఐక్యంగా పోరాడబట్టే బ్రిటిష్ వాళ్ళు లొంగివచ్చారు. కమ్యూనిస్టులతో సహా పలువురు ధైర్య సాహసాలు ప్రదర్శించి తమ ప్రాణాలను సైతం బలి ఇచ్చారు. అందుచేత ఈ దేశం అందరికీ చెందేలా చూడడం, ప్రజలందరి ఐక్యతను పరిరక్షించడం మన కర్తవ్యం. (స్వేచ్ఛానుసరణ) ★

ఎన్నికల ప్రజాస్వామ్యంపై కారుమేఘాలు

వ్యాఖ్య

"బీహార్ ఓటర్ల జాబితాలో విదేశీయులకు చోటు' ఎన్నికల సంఘ ప్రకటన: ఇండియా కూటమి డేటాపై సందేహాలు"-ఒక ప్రధాన జాతీయ పత్రిక పతాక శీర్షిక ఘోష ఇది. ఎంతమాత్రం నమ్మశక్యం కానిదిగా కనిపించింది.

దీనిపై ఇది వరకు మేము రాసిన సంపాదకీయంలో ప్రత్యేక నిశిత పున:పరిశీలన (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-ఎస్.ఐ.ఆర్) కొరకు భారత ఎన్నికల సంఘం (సి.ఇ.సి) జూన్ 24న ఒక పత్రికా ప్రకటనలో విడుదల చేసిన కాలక్రమణికను పూర్తిగా పొందుపర్చాము. మా పాఠకుల సౌకర్యార్థం ఆ క్రమాన్ని మరోసారి గుర్తుచేస్తాము:బూత్ స్థాయి అధికారులు (బి.ఎల్.ఓ లు) ఈ ఫారాలను ఇంటింటికీ పంపిణీ చేసి మళ్లీ భర్తీ చేసిన తర్వాత సేకరించి పరిశీలిస్తారు. అంతేగాక పైస్థాయి అధికారులు వాటి హేతుబద్ధీకరణ, క్రమబద్ధీకరణ, పోలింగ్ స్టేషన్ల ఏర్పాట్లలో తగు కొత్త మార్పులు చేయాలి. పోలింగ్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణకు జాబితా తుది ఆమోదం తీసుకోవాలి. ముసాయిదా ఓటర్ జాబితాలను 2025 ఆగష్టు1 లోగా ప్రచురించాలి. తుది జాబితాను 2025 సెప్టెంబరు 30లోగా సిద్ధం చేయాలి."

ఇ.సి ఖండించకపోతే..?

నిజంగా జరగాల్సింది అదయితే ఎన్నికల సంఘం బీహార్ ఓటర్ల జాబితాలో విదేశీయులు బయటపడ్డారని చెప్పడమేమిటి? సెప్టెంబరు 30 లోగా ఎన్నికల సంఘం నుంచి అధికారిక ప్రకటన వచ్చే అవకాశమే లేదు. అంటే తప్పనిసరిగా కొందరు ఇ.సి అధికారులు ఈ తప్పుడు కథనాలను వదిలారన్నమాట. అత్యున్నత న్యాయస్థానంలో ఈ సమస్య జులై 28న విచారణకు వస్తుంది గనక ఈలోగా దురభిప్రాయం వ్యాప్తి చేయడానికి ఈ పనిచేసి వుండాలి. ఇది అధికారికంగా చేసిన లీకా లేక ఎవరైనా లోపాయికారిగా చేశారా అనేది అటుంచి దీనిపై చట్టపరమైన ఖండన విడుదల చేయకపోతే ఇ.సి నే అందుకు బాధ్యత వహించవలసి వుంటుంది.


ఈ బాధ్యతలకు సంబంధించిన ఈ అంశం మరింత తక్షణ ప్రాధాన్యత గలదిగా తయారవడానికి మరో కారణం కూడా వుంది. ఈ ప్రత్యేక సునిశిత పున:పరిశీలనను నిలిపేస్తూ సుప్రీంకోర్టు ఎలాంటి నిర్దిష్ట ఉత్తర్వు ఇవ్వకపోయినప్పటికీ (ఎందుకంటే పిటిషనర్లు అలాంటిది అడగలేదు గనక) ఈ మౌలిక ప్రశ్నలపై ఇ.సి సూటిగా సమాధానాలు చెప్పవలసే వుంటుంది.

కీలక ప్రశ్నలు

మొదటి ప్రశ్న: ఒక ఓటరు పౌరసత్వ హోదాను నిర్ణయించేందుకు ఇ.సి.ఐ కి అధికారం వుందా? ఈ విషయం హోంశాఖ పరిధిలోదనీ, ఒక వ్యక్తి పౌరుడా కాదా అనేది ఆ మంత్రిత్వ శాఖనే నిర్ణయించగలదనీ సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆధార్‌ను ఈ పరిశీలనకు అర్హమైన పత్రంగా చూడటానికి నిరాకరించిన ఇ.సి వైఖరిని వారి తరపు న్యాయవాది సమర్థించినప్పుడు కోర్టు ఇలా చెప్పింది: "పౌరసత్వం అనేది ఎన్నికల సంఘం నిర్ణయించేది కాదు, హోంశాఖ తేల్చవలసింది"

రెండవ ప్రశ్న: ఈ సమయంలో దీన్ని ఎందుకు చేపట్టినట్టు? ఇ.సి గనక కేవలం పౌరులు మాత్రమే ఓటర్ల జాబితాలో వుండాలని భావించి వున్నట్టయితే "ఈ ప్రక్రియను మరింత ముందుగా ప్రారంభించి వుండవలసింది" అని చెప్పింది. ఈ సమయంలో దీన్ని చేపట్టడంపై కీలకంగా ప్రశ్నిస్తూ బీహార్ ఎన్నికల నుంచి దీన్ని వేరు చేయవచ్చునా అని కూడా అడిగింది.

దీని వాస్తవిక పర్యవసానాలేమిటో జస్టిస్ ధూలియా నొక్కి చెప్పారు: "2025లో అప్పటికే ఓటర్ల జాబితాలో వున్న



PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

వ్యక్తిని గనక మీరు తొలగించేట్టయితే సదరు వ్యక్తి దానికి వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లవలసి వుంటుంది. ఈ మొత్తం తతంగం ముగియాలంటే అప్పుడు ఆ వ్యక్తి ప్రస్తుత ఎన్నికలలో ఓటు వేసే హక్కు నిరాకరించబడుతుంది. పౌరులు కాని వారెవరూ ఓటర్ల జాబితాలో వుండకుండా సునిశిత కసరత్తుతో మీరు మొత్తం జాబితాలను ప్రక్షాళన చేయడంలో తప్పేం లేదు. కానీ మీరు రానున్న ఎన్నికలకు కేవలం రెండు నెలల ముందు నిర్ణయించితే...." అంటూ ఇంకా ఇలా వాస్తవ పరిస్థితిని చెప్పేలా హెచ్చరించారు...'మీరు గనక ఈ పత్రాలను ఉన్నఫళాన చూపించమని అడిగితే నేను కూడా ఇప్పటికిప్పుడు వాటిని తీసుకు రాలేకపోవచ్చు. ఆచరణాత్మకంగా ఆలోచించండి. మీరు పెట్టిన గడువు ఎలా వుందో చూడండి..." ఇ.సి.ఐ చూపించాలని పట్టుపడుతున్న పత్రాలను ప్రస్తావిస్తూ అన్న మాటలివి. అవి అచ్చంగా జాతీయ పౌరసత్వ చట్టం చెప్పిన జాబితా లోవే కావడం కొట్టవచ్చినట్టు కనిపిస్తుందన్న వాస్తవాన్ని దృష్టికి తెచ్చారు.

ఏం చేస్తారు? ఎలా?

ఇక చివరగా మూడవ ప్రశ్న: ఇ.సి ఎలాంటి పద్ధతులను అనుసరిస్తుంది? ఓటు హక్కును రద్దు చేయవలసిన పరిస్థితి వస్తే ఇ.సి ఏ పద్ధతిని అనుసరిస్తుందో స్పష్టం చేయాలని న్యాయమూర్తులు అడిగారు. జస్టిస్ ధూలియా ఒక ప్రశ్న సూటిగా వేశారు: "ప్రజా ప్రాతినిధ్య చట్టం (ఆర్.పి.ఎ)లో ఆకస్మిక పున:పరిశీలన కింద ఓ ఓటరును తొలగించాల్సి వస్తే మౌఖికంగా వారి వాదన వినాలని వున్నప్పుడు ఈ సునిశిత పరిశీలనలో అందుకు అవకాశం వుండదని చెప్పగలరా?"

ఆర్.పి.ఎ నిబంధనల ప్రకారం ఓటర్ల తొలగింపునకు సంబంధించిన సందర్భాలన్నిటిలోనూ, చనిపోయారని ఖచ్చితంగా నిరూపణ అయినప్పుడు తప్ప-ఓటరుకు నోటీసు ఇవ్వడం తప్పనిసరి, వారి వాదన వినిపించే అవకాశమివ్వాలి. ఈ ప్రశ్నలడగడం గురించి మాట్లాడే సందర్భంలో కొన్ని పత్రాలను స్వీకరించవచ్చు కదా అనే అంశం వచ్చింది. ఆ క్రమంలో ఆధార్, ఓటరు ఫోటో ఐడెంటిటీ కార్డు (ఎపిక్), రేషన్ కార్డు ఈ ప్రత్యేక సునిశిత పున:పరిశీలన (ఎస్.ఐ.ఆర్)కు అర్హమైన పత్రాలుగా తీసుకోవచ్చు కదా అని సుప్రీంకోర్టు ఇ.సి ని అడిగింది. ఇ.సి విడుదల చేసిన 11 పత్రాల జాబితాపై ఇప్పటికే విస్తృత భయాందోళన, గందరగోళం తలెత్తిన నేపథ్యంలో ఆ పరిధిని మరింత విస్తరించేందుకు దీనివల్ల అవకాశం కలగొచ్చు. ప్రజలను వెంటాడుతున్న ఖచ్చితమైన ప్రశ్నలు కొన్ని వున్నాయి.

> **సమానావకాశాలు కలిగిస్తూ స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికలు నిర్వహించేందుకు ఇ.సి కి సర్వాధికారాలు వున్నాయనడంతో ఎవరూ విభేదించరు. అయితే జూన్ 24 ఉత్తర్వు కమిషన్ చెప్పిన పద్ధతి, ఇచ్చిన కాలవ్యవధి గతంలో అనుసరిస్తున్న వరవడిలో ఎన్నడూ లేనంత తేడాగా వున్నాయి. ఎస్.ఐ.ఆర్ కు సంబంధిత శాసన నిబంధనలలో గానీ, నియమావళిలో గానీ ప్రాతిపదికే లేదు. ఎన్.ఆర్.సి ప్రక్రియను దొడ్డిదోవన ప్రవేశపెట్టే ప్రయత్నంగా ఇది గోచరిస్తుంది. దీని ఫలితం ఏమంటే-భారీ సంఖ్యలో ప్రజలు ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం. మరీ ముఖ్యంగా ఆర్థికంగా సామాజికంగా ఉపేక్షకు గురైనవారు, డిజిటల్ సామర్థ్యం లేనివారే దానివల్ల నష్టపోతారు.**

సమానావకాశాలు కలిగిస్తూ స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికలు నిర్వహించేందుకు ఇ.సి కి సర్వాధికారాలు వున్నాయనడంతో ఎవరూ విభేదించరు. అయితే జూన్ 24 ఉత్తర్వు కమిషన్ చెప్పిన పద్ధతి, ఇచ్చిన కాలవ్యవధి గతంలో అనుసరిస్తున్న వరవడిలో ఎన్నడూ లేనంత తేడాగా వున్నాయి. ఎస్.ఐ.ఆర్ కు సంబంధిత శాసన నిబంధనలలో గానీ, నియమావళిలో గానీ ప్రాతిపదికే లేదు. ఎన్.ఆర్.సి ప్రక్రియను దొడ్డిదోవన ప్రవేశపెట్టే ప్రయత్నంగా ఇది గోచరిస్తుంది. దీని ఫలితం ఏమంటే-భారీ సంఖ్యలో ప్రజలు ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం. మరీ ముఖ్యంగా ఆర్థికంగా సామాజికంగా ఉపేక్షకు గురైనవారు, డిజిటల్ సామర్థ్యం లేనివారే దానివల్ల నష్టపోతారు.

ఇతర రాష్ట్రాలలో కూడా ఇలాంటి తతంగమే చేపట్టవచ్చునని ఇ.సి సూచనగా అంటున్నది గనక ఈ ప్రశ్నలకు సహేతుకమైన, అర్థవంతమైన పరిష్కారాలు తేలవలసిందే. లేకపోతే అసలు ఎన్నికల ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడిపోతుంది.

('పీపుల్స్ డెమోక్రసీ' జులై 16 సంపాదకీయం)

రాష్ట్ర పండగగా సత్యసాయి జయంతి వద్దు

- వెంటనే ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి
- రాందేవ్ బాబాకు భూ కేటాయింపులొద్దు
- జన విజ్ఞాన వేదిక డిమాండ్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి కార్యక్రమాన్ని రాష్ట్ర పండగగా నిర్వహించడం తగదని, ఇందుకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని, ప్రజల సంపదను స్వాములు, బాబాలకు ధారాదత్తం చేయడం మానుకోవాలని జన విజ్ఞన వేదిక చర్చా వేదికలో వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేదిక ఆధ్వర్యాన విజయవాడలోని ఎంబివికెలో 'పండగ జరపాల్సింది శాస్త్రీయతకా - మూఢత్వానికా?' అనే అంశంపై చర్చా వేదిక శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హేతువాద సంఘం అధ్యక్షులు నార్నే వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ.. దేశంలో బాబాలు, స్వాములు నేరారోపణలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సత్యసాయి బాబా అనేక వివాదాలకు కేంద్ర బిందువుగా ఉన్నారని, అటువంటి వ్యక్తి శత జయంతి ప్రభుత్వ పండగగా నిర్వహించడం తగదని అన్నారు. గత పాలకులైన నెహ్రూ, ఎన్‌టిఆర్ వంటి నాయకులు ఎందరో సెక్యులర్ విధానాలకే ప్రాధాన్యత ఇచ్చేవారని చెప్పారు. సాగర్ ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని ఎటువంటి పూజలు లేకుండానే నెహ్రూ నిర్వహించారని గుర్తు చేశారు. యోగా పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడాన్ని తప్పుబట్టారు. యోగాకు శాస్త్రీయత లేదన్నారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జెవివి కార్యదర్శి వెలగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మోసగాళ్లు, నేర చరిత్ర ఉన్నవాళ్లు, బాబాలకు ఎర్ర తివాచీ పరచడంతో భవిష్యత్ తరాలకు ఏమి సంకేతాలు ఇస్తున్నారనేది చెప్పాలన్నారు. కేంద్రంలో పాలిస్తున్న బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఉన్నారని, మదనపల్లిలో కోట్లాది విలువైన హార్స్‌లీ హిల్స్ భూములు రాందేవ్ బాబాకు అప్పనంగా ఇవ్వడం సిగ్గు చేటన్నారు. ఇటువంటి చర్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వాలని, అన్ని ప్రగతిశీల ప్రజా సంఘాల ఆధ్వర్యాన ఐక్యంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రముఖ నాస్తికులు మోతుకూరి అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాల విభజనలో సత్యసాయి, అన్నమయ్య వంటి పేర్లు పెట్టి అప్పటి సిఎం జగన్ తప్పిదం చేశారన్నారు. చిన జీయర్, శారదా పీఠాధిపతి, సచ్చిదానంద, డేరా బాబా, జిల్లెల్లమూడి అమ్మ, కల్కి పేరుతో ఉన్న ఆశ్రమాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయం అని పేర్కొన్నారు. జెవివి రాష్ట్ర నాయకులు మురళీధర్, వెనిగళ్ల మురళి, దివి కుమార్ (జన సాహితి), ఆర్ పిచ్చయ్య (ప్రజానాట్య మండలి), జె సత్యనారాయణ (నాస్తిక సమాజం), కె కోటేశ్వరరావు (ఒపిడిఆర్), యువజన నాయకులు సూర్యారావు, తోటకూర వెంకటేశ్వరరావు, చందు నాగేశ్వరరావు, బోయ రవి, ఆదినారాయణ, లెనిన్ బాబు, పద్మావతి, శోభన్ కుమార్ తదితరులు చర్చా వేదికలో మాట్లాడారు.

పంచాయతీ కార్యదర్శుల గ్రేడ్‌ల కుదింపు!

- ఉద్యోగ సంఘాలతో అధికారుల చర్చలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ పంచాయతీల్లో కార్యదర్శుల గ్రేడ్‌లను కుదించేందుకు పంచాయతీరాజ్‌శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు తాడేపల్లి లోని పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగ సంఘాలతో ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. ఉపముఖ్యమంత్రి ఒఎస్‌డి డి వెంకట కృష్ణ, పిఆర్ డిప్యూటీ కమిషనర్ నాగార్జునసాగర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రస్తుతం ఉన్న గ్రేడ్‌లను కుదిస్తూ, స్పెషల్ గ్రేడ్‌తో పాటు, 1, 2, 3 గ్రేడ్‌లకు ఆయా పంచాయతీల జనాభా, ఆదా యాన్ని ప్రాతిపదికగా తీసుకోవడం, పంచాయతీ కార్యదర్శి పేరును గతంలో ఉన్న విధంగా కార్యనిర్వాహణాధికారిగా మార్పు చేసే అంశాలపై ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చించారు. ఈ ప్రతిపాదనలను గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ స్వాగతిస్తుందని అధ్యక్షులు ఎమ్‌డి జానీపాషా తెలిపారు. గ్రేడ్-4 పంచాయతీల్లో పనిచేస్తూ జీతాల సమస్య ఎదుర్కొంటున్న కార్యదర్శులను, గ్రేడ్-6గా ఉన్న డిజిటల్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు.



ఆశావహ జిల్లాల పరిస్థితులపై సమీక్ష నిర్వహిస్తున్న రావు ఇంద్రజిత్ సింగ్

ఆశావహ జిల్లాల అభివృద్ధికి సహకారం

- కేంద్ర సహాయ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఆశావహ జిల్లాల (ఎస్పిరేషనల్ జిల్లాలు) అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని కేంద్ర ప్రణాళిక, సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ అన్నారు. ఆయా జిల్లాల ప్రత్యేక అభివృద్ధి అవసరాలపై తనకు నివేదిక అందజేస్తే కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఆయా జిల్లాలకు నిధులు మంజూరు చేసేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఆశావహ జిల్లాల కార్యక్రమంలో భాగంగా నీతి ఆయోగ్ గుర్తించిన అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక వసతులు, ఆర్థికాభివృద్ధి తదితర అంశాల్లో సాధించిన ప్రగతిని శుక్రవారం విశాఖ కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. జిల్లాలకు నీతి ఆయోగ్ కేటాయించిన నిధుల వినియోగంపై కలెక్టర్లు ఎఎస్.దినేష్ కుమార్, ఎ.శ్యాంప్రసాద్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాల ప్రత్యేక అవసరాలు, అభివృద్ధిలో నిధుల పరంగా ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా దినేష్‌కుమార్ మాట్లాడుతూ..ఎఎస్‌ఆర్ జిల్లాను పూర్తిగా సేంద్రీయ ఉత్పత్తుల జిల్లాగా రూపొందించాలని భావిస్తున్నామని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలోని కొన్ని పాఠశాలల్లో క్రీడాభివృద్ధి కేంద్రాలను అభివృద్ధి చేసి ఆయా స్కూళ్లలో విద్యతోపాటు క్రీడలపై కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తామని తెలిపారు. గిరిజన విద్యార్థులు కనీసం ఇంటర్మీడియెట్ స్థాయి వరకు విద్యను పూర్తిచేసే విధంగా కార్యాచరణ రూపొందించామని పేర్కొన్నారు. జిల్లాలో గిరిజన ప్రాంతాల్లో సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కేవలం చెక్ డ్యామ్‌లపైనే ఆధారపడి పంటలు పండించే పరిస్థితి ఉందన్నారు. ఎ.శ్యాంప్రసాద్ మాట్లాడు తూ..పార్వతీపురం మన్యం జిల్లాలో సూక్ష్మస్థాయి పరిశ్రమలు మినహా మధ్యతరహా, భారీ పరిశ్రమలు ఏవీ లేవన్నారు. దీనిని అధిగమించేందుకు సాంకేతిక విద్య, అవకాశాలు పెంపొందించేలా ఐటిఐలు, సాంకేతిక విద్యా సంస్థలు అధికంగా ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. అనంతరం అరకు కాఫీపై ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్‌ను కేంద్ర మంత్రి ఇంద్రజిత్ సింగ్ పరిశీలించారు. కార్యక్రమంలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చైనా గ్రాఫైట్‌పై అమెరికా 93.5 శాతం సుంకం

వాషింగ్టన్ : చైనా నుండి దిగుమతి అయ్యే గ్రాఫైట్‌పై 93.5 శాతం యాంటీ-డంపింగ్ సుంకాలను విధించాలని అమెరికా వాణిజ్య శాఖ నిర్ణయించింది. ఈ గ్రాఫైట్ ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలలో కీలకమైన భాగంగా ఉపయోగించబడుతుంది. చైనీస్ సంస్థలు తమ మార్కెట్‌ను చౌక గ్రాఫైట్‌తో నింపుతూ అమెరికన్ వ్యాపారాలకు పోటీని కష్టతరం చేస్తున్నాయని పేర్కొంది. అమెరికా ఉద్యోగాలు, ఉత్పాదక సామర్థ్యాన్ని రక్షించడానికి ఈ హెచ్చు టారిఫ్‌లను అమలు చేయాలని నిర్ణయించినట్లు యుఎస్ వాణిజ్య శాఖ తెలిపింది.

సిడికె ఇండియాకు గ్రేట్ ప్లేస్ టు వర్క్ గుర్తింపు

హైదరాబాద్ : ఆటోమోటివ్ రిటైల్ సాఫ్ట్‌వేర్ సంస్థ సిడికె ఇండియా 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' సంస్థచే భారత్‌లో టాప్ 100 మధ్యస్థాయి కార్యాలయాల్లో ఒకటిగా గుర్తింపును దక్కించుకుంది. సిడికె భారత్‌లో 2020 నుండి, అమెరికాలో 2022లో, కెనడాలో 2025లో 'గ్రేట్ ప్లేస్ టు వర్క్'గా ధ్రువీకరణ పొందింది. "ఈ గుర్తింపు మా ఉద్యోగులకు సమ్మిళిత మరియు స్థిరమైన కార్యాలయాన్ని అందించే మా నిబద్ధతను రుజువు చేస్తుంది," అని సిడికె ఇండియా హెచ్ఆర్ సీనియర్ డైరెక్టర్ ఆశిష్ సక్సేనా తెలిపారు.

రిలయన్స్ రిటైల్ చేతికి కెల్విన్‌టేర్ బ్రాండ్

హైదరాబాద్ : ప్రముఖ రిఫ్రిజిరేషన్ బ్రాండ్ కెల్వినేటర్‌ను రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ స్వాధీనం చేసుకుంది. అయితే ఎంత మొత్తానికి కొనుగోలు చేసిందనే విషయాన్ని ఆ కంపెనీ వెల్లడించారు. దేశంలో వేగంగా విస్తరిస్తున్న ప్రీమియం హోమ్ అప్లయన్సెస్ మార్కెట్‌లో తమ వృద్ధికి ఈ సంస్థ స్వాధీనం ఉపయోగపడుతుందని రిలయన్స్ రిటైల్ తెలిపింది. విస్తృత రిటైల్ నెట్‌వర్క్ కలిగిన రిలయన్స్‌తో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని రిలయన్స్ వెంచర్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇషా అంబానీ పేర్కొన్నారు.

సుప్రీంను ఆశ్రయించిన జస్టిస్ యశ్వంత్ వర్మ

- విచారణ కమిటీ నివేదికపై సవాల్
- కేసులో న్యాయ సూత్రాలు పాటించలేదని ఆరోపణ
- నోట్ల కట్టల వ్యవహారంలో కీలక పరిణామం

న్యూఢిల్లీ : నోట్ల కట్టల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి యశ్వంత్ వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ కమిటీ నివేదికను, తనను అభిశంసించాలన్న ప్రతిపాదనను సవాల్ చేస్తూ ఆయన పిటిషన్ వేసినట్లు తెలుస్తున్నది. ఒక జడ్జిని అభిశంసించాలని సిఫారసును రాష్ట్రపతికి చేయటంలో భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) అధికారాన్ని కూడా ఆయన సవాల్ చేశారు. యశ్వంత్ వర్మ వ్యవహారంపై సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన ముగ్గురు జడ్జిల విచారణ కమిటీ నివేదికను, జస్టిస్ వర్మ స్పందనను ఈ ఏడాది మే 4న అప్పటి సిజెఐ సంజీవ్ ఖన్నా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీలకు పంపిన విషయం విదితమే. జస్టిస్ వర్మను తొలగించే ప్రక్రియను ప్రారంభించాలని ఈ నివేదిక రాష్ట్రపతికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే. ముగ్గురు సభ్యుల జ్యుడిషియల్ కమిటీ నివేదికను సవాల్ చేసిన ఆయన.. ఈ కేసులో న్యాయ సూత్రాలను పాటించలేదని ఆరోపించారు. సరైన ప్రక్రియను పాటించకుండానే కమిటీ నివేదికలో అంశాలను పొందుపరిచారని చెప్పారు. అయితే ఈ కేసు విచారణ వచ్చే వారం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవైపు విచారణ కమిటీ ఆయనకు వ్యతిరేకంగా నివేదికను సమర్పించడం, మరోవైపు, కేంద్రం కూడా అభిశంసనకు సిద్ధమవుతున్న తరుణంలో జస్టిస్ వర్మ ఈ పిటిషన్‌ను దాఖలు చేయడంతో కేసులో కీలక పరిణామం చోటు చేసుకున్నట్టయ్యింది. ఢిల్లీలోని జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో కాలిన నోట్ల కట్టలు భారీ మొత్తంలో బయటపడిన విషయం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసిన విషయం విదితమే. ఈ ఏడాది మార్చి 14న చోటు చేసుకున్న ఈ ఘటన న్యాయ వర్గాల్లో సైతం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన తర్వాత అదే నెల 28న సుప్రీంకోర్టు కొలీజియం జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీని నియమించింది. ఈ అంశంపై విచారణ జరిపిన కమిటీ నివేదికను సమర్పించింది. డబ్బులు బయటపడిన విషయం వాస్తవమేనని, దీనికి సంబంధించి బలమైన ఆధారాలున్నాయని వివరించింది. ఆయనను తొలగించాలంటూ సిఫారసు చేసింది. మరోవైపు జస్టిస్ వర్మను తొలగించేందుకు కేంద్రం కూడా చర్యలు తీసుకుంటున్నది. ఆయనపై అభిశంసన తీర్మానాన్ని ఇప్పటికే సిద్ధమైంది.

ఆ విషయంలో అనుమతి ఇవ్వాల్సింది కేంద్రమే

- నిమిష ప్రియ కేసులో సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : యెమెన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటోన్న కేరళ నర్సు నిమిష ప్రియ కేసులో ఉత్కంఠ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ కేసులో బాధిత కుటుంబంతో మాట్లాడేందుకు తాము యెమెన్‌కు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని నిమిష తరఫున బృందం.. సుప్రీంకోర్టును కోరింది. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ.. అందుకోసం 'ఆ అనుమతులివ్వాల్సింది కేంద్రమే..మీరు కేంద్ర ప్రభుత్వం వద్దకే వెళ్లాలి' అని సూచించింది. నిమిష ప్రియ కేసుపై తాజాగా అత్యున్నత న్యాయస్థానం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఆమెకు మరణశిక్ష అమలును యెమెన్ తాత్కాలికంగా నిలిపివేసిన విషయాన్ని కేంద్రం.. ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లింది. ఈ కేసులో తమవైపు నుంచి చర్యలు కొనసాగుతున్నాయని కేంద్రం తరపున అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి కోర్టుకు తెలిపారు.

ట్రంప్.. ట్రబుల్

- వలస విధానాలపై అమెరికా అంతటా నిరసనలు
- 'గుడ్ ట్రబుల్' పేరుతో ఆందోళనలు
- నినాదాలతో మార్మోగిన నగరాలు



ఆందోళన చేస్తున్న అమెరికన్లు

వాషింగ్టన్ : అధ్యక్షుడు ట్రంప్ వివాదాస్పద విధానాలను నిరసిస్తూ అమెరికన్లు రోడ్డెక్కారు. "గుడ్ ట్రబుల్ లివ్స్ ఆన్" పేరుతో దేశవ్యాప్తంగా ఆందోళనలు హోరెత్తాయి. పౌరహక్కుల నాయకుడు జాన్ లూయిస్ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఈ ప్రదర్శనలు జరిగాయి. ప్రదాన నగరాలతో సహా 1600 ప్రాంతాల్లో నిరసన ర్యాలీలు నిర్వహించారు. దీంట్లో పాల్గొన్న ప్రజలు సామాజిక రక్షణ కోసం, వలసదారులు, అట్టడుగు వర్గాల హక్కులకై నినదించినట్లు ఆదేశ మీడియా వెల్లడించింది. అట్లాంటాలో మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ స్మారకం వద్ద భారీ ప్రదర్శన నిర్వహించారు. న్యూయార్క్‌లోని ఇమ్మిగ్రేషన్ కార్యాలయం చుట్టు కవాతు నిర్వహించారు. లాస్ ఏంజెల్స్‌లో పోలీసుల చేతిలో మృతి చెందిన వారి ఫొటోలు, ఇమ్మిగ్రేషన్ అధికారులు అరెస్ట్ చేసిన వారి ఫొటోలు, కోవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు.

ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా :

అమెరికాను తిరిగి ఉన్నతంగా తీర్చిదిద్దుతానని రెండోసారి అధికారంలోకి వచ్చిన ట్రంప్..ప్రతీకార సుంకాల పేరుతో మిత్ర దేశాలతో సైతం వైర్యం పెంచు కున్నారు. అక్రమ వలసదారుల నెపంతో సామూహిక అరెస్ట్‌లు, నిర్బందాలు పెరిగాయి. ఇటీవలే అమెరికాలో ద్రవ్యోల్బణం పెరిగిపోయిందని నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ (ఎన్‌బిఎస్) ప్రకటించింది. ఉద్యోగాల కల్పనా ఆశించినంతగా లేదని నిరసనకారులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. తమ హక్కుల కోసం గత నెలలో లక్షలాది మంది నిర్వహించిన 'నో కింగ్స్' ఉద్యమాన్ని అసాధారణంగా నేషనల్ గార్డ్‌లను ఉపయోగించి అణిచేసిన సంగతి తెలిసిందే. పౌరహక్కుల నాయకుడు జాన్ లూయిస్ స్ఫూర్తితో ప్రజాస్వామ్య హక్కుల కోసం, స్వేచ్ఛ కోసం పోరాడతామని ఆందోళనకారులు తెలిపారు.

తొలి త్రైమాసికంలో కేంద్ర సాయంలో భారీ కోత

- అంచనాల్లో వచ్చింది 4 శాతమే శ్రీ కాగ్ నివేదికలో వెల్లడి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కేంద్రం నుంచి రావాల్సిన సాయంలో భారీగా కోతలు పడ్డాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి త్రైమాసికంలో కేవలం నాలుగు శాతం నిధులు మాత్రమే రావడంతో ఆ ప్రభావం రాష్ట్ర ఖజానాపై పడుతోంది. ఇది భారీగా అప్పులు చేయాల్సిన పరిస్థితికి దారితీస్తోంది. కాగ్ ప్రకటించిన త్రైమాసిక నివేదిక ప్రకారం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. అటు సొంత ఆదాయం తగ్గడం, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడం, అప్పులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొనడంతో ఖజానా కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. కేంద్రం నుంచి గ్రాంట్లు రూపంలో ఏడాది మొత్తానికి రూ.32,284 కోట్లు రావాల్సి ఉండగా తొలి మూడు నెలల్లో కేవలం రూ.1,465 కోట్లు మాత్రమే వచ్చాయి. నెలకు సగటున రూ.2,690 కోట్లతో మూడు నెలలకు ఎనిమిది వేల కోట్ల వరకు రావాల్సి ఉంటుంది. అయితే కేవలం 4.54 శాతం నిధులు మాత్రమే రావడం గమనార్హం. గత ఏడాది తొలి త్రైమాసికంలో 6.64 శాతం రాగా ఈ ఏడాది రెండు శాతం వరకు తగ్గిపోవడం గమనార్హం. ఇది రాష్ట్రంలో అమలు చేసే పథకాలకు ఇబ్బందికరంగా మారుతుందని అధికారులు చెబుతున్నారు.

రాష్ట్ర సొంత ఆదాయాన్ని పరిశీలిస్తే ఇప్పటివరకు 20 శాతం నిధులు సమకూరాయి. బడ్జెట్ అంచనాల మేరకు రూ.1.66 లక్షల కోట్లుగా అంచనా వేయగా మూడు నెల్లలో రూ.33 వేల కోట్లు మాత్రమే చేతికందింది. ఇందులో ల్యాండ్ రెవెన్యూ అతి తక్కువగా రావడం విశేషం. రూ.221 కోట్లు రావాల్సి ఉండగా, కేవలం రెండు కోట్లు మాత్రమే రావడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

సగానికి చేరిన అప్పు

నిధుల రాక తగ్గిపోవడంతో చేసే రుణాలు కూడా భారీగా మారిపోయాయి. బడ్జెట్‌లో రూ.79,952 కోట్ల రుణ అంచనా వేయగా, తొలి మూడు నెల్లోనే ఏకంగా రూ.37,093 కోట్లు రుణంగా సేకరించడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో లోటు కూడా అదే స్థాయికి చేరిపోయింది. కాగా మొత్తం 20 శాతం ఆదాయం సమకూరగా, చేసిన ఖర్చు 24 శాతం వరకు ఉండడం విశేషం.

2024లో బిసిసిఐకి రూ.9,742కోట్లు రికార్డు ఆదాయం

- ప్రధాన ఆదాయ వనరుగా ఐపిఎల్
- మహిళల ప్రిమియర్ లీగ్‌కూ ప్రజాదరణ
- తాజా గణాంకాల సారాంశం ఇదే!

2024 ఆర్థిక సంవత్సరంలో బిసిసిఐకి రూ.9,742కోట్ల రికార్డు ఆదాయం లభించిదని, ఇందులో ఐపిఎల్ ద్వారానే రూ.5,761కోట్లు నగదు జమ అయినట్లు తాజా గణాంకాలు పేర్కొన్నాయి. బిసిసిఐకి జమ అయ్యే ఆదాయంలో ఐపిఎల్ ద్వారానే 59శాతం వస్తున్నట్లు, ఇటీవల జరిగిన బిసిసిఐ వార్షిక నివేదికలో వెల్లడైంది. అలాగే విదేశీ పర్యటనల్లో భారత్‌కు దక్కే వాటా మరింత పెంపుదలకు బిసిసిఐ కృషి చేస్తున్నట్లు, బ్రాడ్‌కాస్టింగ్, ప్రకటనలు, రెడిఫ్యూజన్ ప్రకారం 2023-24లో రూ.9.741కోట్లు ఆదాయం ఆర్జించినట్లు సమాచారం. మీడియా హక్కులు, స్ట్రీమింగ్, స్పార్ట్స్ ఒప్పందాలు వంటివి కూడా ఇటీవలికాలంలో భారీగా పెరిగినట్లు, ఐపిఎల్ కాకుండా ఇతర మీడియా హక్కుల ద్వారా కూడా బిసిసిఐ కొంతమేర సమకూరినట్లు, ఆ సమకూరే ఆదాయంలో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు, టోర్నీ ప్రసార హక్కులతోపాటు ఇతర కోణాలనుంచి కూడా ఆదాయం వస్తున్నట్లు, ఆ వచ్చిన ఆదాయంలో ప్రధానంగా ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) బంగారు గుడ్లు పెట్టే బాతులా దొరికినట్లు బిసిసిఐ రిపోర్టు నివేదకల్లో ఉంది. ఐపిఎల్‌కు లభించే ప్రజాదరణతోనే 'రంజీట్రోఫీ, దులీప్ ట్రోఫీ, సికె నాయుడు వంటి దేశీయ టోర్నీల నిర్వహణ కూడా సాధ్యమౌతుందని, ఇది మరోరకంగా వాణిజ్యీకరణకు దోహదపడుతున్నట్లు అందులో ఉంది. మీడియా హక్కులు రోజు రోజుకు పెరుగుతూ వస్తున్నాయని, కనీసం రంజీట్రోఫీలో ఆడే ఆటగాళ్లకు ఐపిఎల్ వేలం బరిలో ఉండనున్న దృష్ట్యా దేశీయ లీగుల్లో ఆడేందుకు యువ క్రికెటర్లు పోటీపడుతున్నారని, దీంతో రంజీట్రోఫీని లాభాల బాటలో పెట్టేందుకు ఒకరకంగా ఐపిఎల్ కూడా దోహదపడుతుందని, స్టార్ క్రికెటర్లు దేశీయ టోర్నమెంట్‌లలో ఆడేందుకు వస్తుండడంతో ఈ లీగ్‌లను వీక్షించేందుకు వచ్చే వారి సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోందని తాజా గణాంకాల సారాంశం. అలాగే ఈ లీగ్ ఒక ఫ్రాంచైజీ కనీస మూల నిధి దాదాపు రూ.100కోట్లుగా ఉండడంతో ప్రపంచవ్యాప్తంగా ఇందులో ఆడేందుకు క్రికెటర్లు ఎగబడుతున్నారని, ఐపిఎల్ ద్వారా ఆదాయంలో 100శాతం వాటా బిసిసిఐకే సమకూరుతుందని, ప్రపంచ క్రికెట్‌లోనే అతిపెద్ద బోర్డు అయిన బిసిసిఐ వద్ద ప్రస్తుతం రూ.30వేల కోట్ల నిల్వలు ఉన్నాయని, ఆ నగదు నిల్వల ద్వారానే రూ.వెయ్యి కోట్లు వడ్డీ రూపంలోనే వస్తుంది.

ఏడాది ఏడాదికి స్పాన్సర్ షిప్‌లు, మీడియా ఒప్పందాలు, మ్యాచ్‌ల ద్వారా వచ్చే ఆదాయం 10 నుంచి 12 శాతానికి పెరుగుతోందని రీడిఫ్యూజన్ చీఫ్ సందీప్ గోయల్ రిపోర్టులో తెలిపారు. బ్రాండ్ ఫైనాన్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అజిమోన్ ఫ్రాన్సిస్ తాజాగా విడుదల చేసిన రిపోర్టులో ఐపిఎల్ నిర్వహణ బిసిసిఐకి మంచి వ్యాపార నమూనా సృష్టించేందుకు దోహదపడిందని, దీని కారణంగానే ఐసిసి తన నిధుల్లో ఎక్కువభాగం రాబట్టేందుకు బిసిసిఐపై ఆధారపడాల్సి వచ్చిందని, ఐసిసి తన ఆదాయాన్ని పెంచుకొనే మార్గాలను సరిగ్గా అన్వేషించడం లేదన్నారు. ఈ ఏడాది ఐపిఎల్ నిర్వహణకు ప్రధాన ఆటంకం 'ఆపరేషన్ సింధూర్' రూపంలో ఎదురైందని, ఇది ఐపిఎల్-2025కు గట్టి ఎదురుదెబ్బ వంటిదని, దీని కారణంగానే షెడ్యూల్ ప్రకారం ముగియాల్సిన టోర్నీ మరో 10రోజులు పొడిగించబడిందని, ఆ తర్వాత జరిగినా... ప్రధాన ఆటగాళ్లు తమ తమ దేశాలకు తిరిగి వెళ్లిపోయారని ఫ్రాన్సిస్ వాదించారు. అలాగే మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్)కు రాబోయే రోజుల్లో మరింత ఆదరణ లభించడం ఖాయమని కొనియాడారు. ఐపిఎల్ ద్వారానే ఎక్కువ నగదు వస్తుంటే.. ఇతర లీగ్‌ల ద్వారా వచ్చే ఆదాయం వైపు బిసిసిఐ దృష్టి సారించచదని, ఇది నష్టదాయమని ఫ్రాన్సిస్ పాలకమండలి సమావేశంలో సూచించారు. ఇందుకోసం ఐపిఎల్‌లో ఈక్విటీ వాటాను తగ్గించుకొనేందుకు బిసిసిఐ ప్రయత్నించాలని, స్పాన్సర్‌షిప్‌లు పెంచుకొని, ఆదాయ పెంపుకు ప్రయత్నించాలని, దీంతో ఇతర దేశాల్లో క్రికెట్ ప్రాచుర్యం పొందడం ఖాయమని మథియాస్ సూచించారు.



ఐపిఎల్‌కు పోటీగా హండ్రెడ్ లీగ్



బిసిసిఐ సమావేశంలో రాజీవ్ శుక్లా, రోజర్ బిన్నీ(ఫైల్)

ఐసిసికి భారీగా నగదు జమ

2007 వరకు అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి)లో ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ క్రికెట్ బోర్డులతో హవా. కానీ 2007లో ఐపిఎల్ ప్రవేశంతో ఐసిసిలో బిసిసిఐ ప్రాతినిధ్యం క్రమంగా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుత ఐసిసి అధ్యక్షునిగా ఉన్న జే షా గతంలో ఐపిఎల్‌కు కార్యదర్శిగా పనిచేశారు. ఐసిసిలో మన పాత్ర పెరగడంతో జే షా ఎన్నికను వ్యతిరేకించేవారు ఎవ్వరూ లేకపోయారు. ఐపిఎల్ ద్వారా వచ్చే ఆదాయంలో కొంత శాతం ఐసిసికి ముట్టజెప్పడం, ఐపిఎల్‌లో ఆడే విదేశీ ఆటగాళ్లకు కోట్లాది రూపాయలు ముట్టజెప్పడంతో ఈ లీగ్ జరిగే రెండున్నర నెలలు ఐసిసి టాప్-8జట్ల టోర్నీలన్నింటినీ దాదాపు నిలిచిపోతున్నాయి.

ఒలింపిక్స్‌లోనూ క్రికెట్‌కు చోటు...

బిసిసిఐ క్రికెట్‌ను మరిన్ని దేశాల్లో ప్రాచుర్యం కల్పించేందుకు ఐపిఎల్ మరో రకంగానూ దోహదపడుతోంది. దీని కారణంగా ఇటలీ జట్టు 2026 టి20 ప్రపంచకప్‌కు తొలిసారి అర్హత సాధించడం, 2025 ఐసిసి టి20 ప్రపంచకప్‌కు అమెరికా ఆతిథ్యమివ్వడం జరిగింది. అలాగే 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు దక్కడం. ఇవన్నీ ఈ క్రీడ పట్ల ప్రజల్లో అంతకంతకూ ఆదరణ పెరుగుతుందనడానికి కారణంగా నిర్వాహకులు వాదిస్తున్నారు.

ఐపిఎల్‌కు పోటీగా 'హండ్రెడ్' టోర్నీ..

ఐపిఎల్‌కు రాబోయే రోజుల్లో ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు నిర్వహించే 'హండ్రెడ్' టోర్నీ నుంచి గట్టి పోటీ ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. గత ఏడాది జరిగిన 'హండ్రెడ్' టోర్నీలో భారత పురుషుల ఆటగాళ్లు కూడా ప్రాతినిధ్యం వహించాలని లాంక్‌షైర్ కౌంటీ క్రికెట్ క్లబ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సిఇవో) ఇంగ్లండ్-వేల్స్ క్రికెట్‌బోర్డు(ఇసిబి)కు ప్రతిపాదన పెట్టారు. అదే జరిగితే బిసిసిఐ వాటా మైనారిటీలో పడే ఛాన్స్ లేకపోలేదు.

- స్పోర్ట్స్ డెస్క్

సర్ణదేవాలయానికి బెదిరింపు మెయిల్స్

- సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అరెస్టు

అమృత్‌సర్: పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఉన్న స్వర్ణ దేవాలయాన్ని పేల్చివేస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డ కేసులో పోలీసులు ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను అరెస్టు చేశారు. బెదిరింపు ఈమెయిల్స్ చేసిన అనుమానితుడిని శుభం డూబేగా గుర్తించారు. అతని స్వస్థలం ఫరిదాబాద్. పోలీసు కమీషనర్ గురుప్రీత్ సింగ్ బుల్లార్ ఈ విషయాన్ని శుక్రవారం వెల్లడించారు. ఈ కేసులో పాక్షికంగా సక్సెస్ సాధించినట్లు ఆయన చెప్పారు. విచారణ నిమిత్తం అతన్ని కస్టడీలోకి తీసుకున్నట్లు కమీషన్ వెల్లడించారు. అలాగే, డూబేకు చెందిన ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. జూలై 14వ తేదీ నుంచి శిరోమని గురుద్వారా ప్రబందక్ కమిటీకి ఆరు సార్లు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. గోల్డెన్ టెంపుల్‌ను పేల్చివేస్తామని బెదిరించారు. ఈ నేపథ్యంలో పోలీసులు భద్రతను పెంచారు.

'విశాఖ ఉక్కు' ప్రైవేటీకరణ ఆపాలి

(మొదటి పేజీ తరువాయి)

డివైఎఫ్ఐ తిప్పికొట్టాలని, దీనికి ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా అండగా ఉండాలని పిలుపునిచ్చారు.బి.వెంకట్ మాట్లాడుతూ.. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు వీలు లేదన్నారు. మోడీ ప్రభుత్వం.. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు పూనుకుందని, ఇదేనా దేశభక్తి అని ప్రశ్నించారు. ఎస్ పుణ్యవతి మాట్లాడుతూ.. ఎన్నో ప్రాణత్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు మోడీ ప్రభుత్వం యత్నించడం దారుణమన్నారు. దీనికి వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో ఐద్వా భాగస్వామ్యం ఉంటుందని తెలిపారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగం పెరుగుతోం దని విమర్శిం చారు. రాయలసీమ, ఉత్తరాంధ్రకు విభజన చట్టం ప్రకారం ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కడపలో ఉక్కు పరిశ్రమ స్థాపించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విరమించుకోవాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అప్పులు ఇప్పించడం కాదని, నిధులివ్వాలన్నారు. పోలవరం నిర్వాసిత యువతకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. అనంతపురం జిల్లాలో సేవలు అందిస్తున్న ఆర్‌డిటిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ప్రకాశం, నెల్లూరు లాంటి వెనుకబడిన జిల్లాల్లో ప్రభుత్వ రంగ భారీ పరిశ్రమలు నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవి రమణ, డివైఎఫ్ఐ నాయకులు రాజు, శివ, పిచ్చయ్య, హుస్సేన్ బాషా, శివ, నర్సింహ, రమేష్, చిన్ని, పిడి ప్రసాద్, రాంబాబు, రాజేష్, దానియేలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ఎపిఎస్‌డిఆర్‌ఎఫ్ బృందానికి 3వ స్థానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో గత నెల 21 నుంచి 24 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి సిఎస్ఎస్ఆర్ ఫైనల్స్ పోటీల్లో రాష్ట్రానికి చెందిన స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎపిఎస్‌డిఆర్‌ఎఫ్) బృందం మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు ఎపిఎస్‌ఆర్‌డిఎఫ్ అధికారులు తెలిపారు. గెలుపొందిన సభ్యులు శుక్రవారం డిజిపి హరీష్‌కుమార్ గుప్తాను కలిశారు. బృందం సభ్యులను డిజిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ ఎడిజిపి మధుసూదన్‌రెడ్డి, ఎపిఎస్‌డిఆర్‌ఎఫ్ విభాగాధిపతి బి రాజకుమారి పాల్గొన్నారు.

ఎంపి మిథున్ రెడ్డికి ముందస్తు బెయిల్ నిరాకరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైసిపి ఎంపి మిథున్ రెడ్డికి ముందస్తు బెయిల్‌ను సుప్రీంకోర్టు నిరాకరించింది. మద్యం కుంభకోణంలో మిథున్ రెడ్డికి ముందస్తు బెయిల్‌ను హైకోర్టు తిరస్కరించగా, దాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్ధీవాలా, జస్టిస్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. అరెస్ట్ చేయకుండా చార్జ్‌షీట్ ఎలా దాఖలు చేస్తారని సిట్ తరపున న్యాయవాది ముకుల్ రోహత్గీని ప్రశ్నించింది. సరెండర్ కావడానికి వారం రోజులు గడువు ఇవ్వాలని మిథున్ రెడ్డి తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ధర్మాసనాన్ని కోరగా.. దానికి సుప్రీంకోర్టు నిరాకరించింది.

నియోజకవర్గాల అభివృద్ధికి ఒక్కో ఎమ్మెల్యేకు రూ.50 కోట్లు

- కర్ణాటక సిఎం సిద్ధరామయ్య

బెంగళూరు : నియోజకవర్గాల అభివృద్ధి కోసం ఒక్కో ఎమ్మెల్యేకు రూ.50 కోట్ల చొప్పున గ్రాంటు విడుదల చేయాలని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నిర్ణయించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. పార్టీలో అంతర్గతంగా జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం ఆయన ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. నియోజవర్గాల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు సరిపోవడం లేదని కర్ణాటక పార్టీ ఇన్‌ఛార్జి రణదీప్ సూర్జేవాలా వద్ద ఇటీవల ఎమ్మెల్యేలు మొరపెట్టుకున్నారు. బెంగళూరులోని పార్టీ ఆఫీస్‌లో విడివిడిగా ఒక్కో ఎమ్మెల్యే ఆయనతో మాట్లాడారు. నిధుల జాప్యంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కీలకమైన ప్రాజెక్టులు కుంటుపడుతున్నాయని చెప్పారు. ఈ విషయాన్ని సిఎం, డిప్యూటీ సిఎం డికె శివకుమార్ దృష్టికి సూర్జేవాలా తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సిద్ధరామయ్య గ్రాంటు విడుదలకు అంగీకారం తెలిపినట్లు సమాచారం. దీంతో ప్రతి ఎమ్మెల్యే రూ.50 కోట్ల గ్రాంటును పొందనున్నారు.

పదేళ్లుగా వాద్రాకు కేంద్రం వేధింపులు : రాహుల్

న్యూఢిల్లీ : గత పదేళ్లుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తమ బావ రాబర్ట్ వాద్రాను వేధింపులతో వెంటాడుతూనే ఉందని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఓ భూ ఒప్పందానికి సంబంధించి అక్రమాలకు పాల్పడిన కేసులో రాబర్ట్ వాద్రాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) చార్జిషీటు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపైనే శుక్రవారం రాహుల్ ఎక్స్ వేదికగా స్పందించారు. దురుద్దేశంతో, రాజకీయ కక్షతో పెట్టిన ఈ కేసును ఎదుర్కొనేందుకు రాబర్ట్ వాద్రా, ప్రియాంక కుటుంబానికి తాను అండగా ఉంటానని రాహుల్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వీటిని తట్టుకునే ధైర్యం వారందరికీ ఉందని, నిజం ఎప్పటికైనా బయటపడుతుందని ఆయన పేర్కొన్నారు. హర్యానాలో శికోహపుర్‌లో భూ ఒప్పందానికి సంబంధించి అక్రమాలకు పాల్పడినట్లు రాబర్ట్ వాద్రాపై ఆరోపణలున్నాయి. దీనిపై ఇడి ఇప్పటికే పలుమార్లు ఆయనను విచారించింది. ఈ క్రమంలో గురువారం ఆయనపై అభియోగ పత్రాన్ని దాఖలు చేసింది.

మలేసియాలో అమెరికా రాయబారిగా ఇస్లాం వ్యతిరేకి

- ట్రంప్ చర్యపై నిరసనల వెల్లువ

కౌలాలంపూర్ : ముస్లిం మెజారిటీ దేశమైన మలేసియాకు అమెరికా రాయబారిగా నిక్ ఆడమ్స్‌ను అధ్యక్షుడు ట్రంప్ నామినేట్ చేశారు. దీంతో ఇస్లామ్‌ను తీవ్రంగా విమర్శించే ఆడమ్స్ నియామకంపై నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళనకారులు కౌలాలంపూర్‌లోని యుఎస్ ఎంబసీ వెలుపల నిరసన తెలియచేశారు. రాజకీయ వ్యాఖ్యాత, ఇజ్రాయిల్ అనుకూల కన్జర్వేటివ్ రచయిత అయిన ఆడమ్స్ ప్రతిపాదిత నియామకం గురించి గత వారం ట్రంప్ ప్రకటించారు. కాగా అంతర్జాతీయ నిబంధనల కింద ఆడమ్స్ నియామకాన్ని తిరస్కరించాల్సిందిగా ఆందోళనకారులు మలేసియా ప్రభుత్వాన్ని కోరారు. అయితే ఇప్పుడే దీనిపై నిర్ణయించడం తొందరపాటు అవుతుందని కానీ తమ ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇచ్చి దీన్ని పరిశీలిస్తుందని మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం విలేకర్లకు శుక్రవారం చెప్పారు. గాజాలో ఇజ్రాయిల్ చర్యలను సమర్ధిస్తూ ఆడమ్స్ పెట్టే పోస్టులు మలేసియాలోని ముస్లింలను తీవ్రంగా ఆగ్రహానికి గురి చేస్తున్నాయి. ఇరు దేశాల మధ్య వారధిగా వుండడం రాయబారి కర్తవ్యం, కానీ వున్న వారధిని నాశనం చేసే వ్యక్తి రాయబారిగా తమకు వద్దని అన్వర్ పార్టీ సభ్యుడైన మహ్మద్ కసిం వ్యాఖ్యానించారు.

ఢిల్లీ, బెంగళూరుల్లో కలకలం

- పలు పాఠశాలలకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ : దేశ రాజధాని న్యూఢిల్లీ, కర్ణాటక రాజధాని బెంగళూరు నగరాల్లో శుక్రవారం కలకలం రేగింది. ఈ నగరాల్లోని డజన్ల కొద్దీ స్కూళ్లకు శుక్రవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. ఢిల్లీలోని 20 పాఠశాలలకు హెచ్చరికలు అందాయి. గత మూడు రోజుల్లో రెండుసార్లు ఇలాంటి హెచ్చరికలు వచ్చినట్లు ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులు పేర్కొన్నారు. ఢిల్లీ పోలీసులకు కూడా ఓ బెదిరింపు లేఖ వచ్చింది. 'హలో.. నేను పలు స్కూళ్లలో బాంబులను అమర్చాను. వాటిని బయటకు కనిపించనీయకుండా జాగ్రత్తలు తీసుకొన్నా. ఒక్కర్ని కూడా వదిలిపెట్టను.. అందరినీ హతమారుస్తా. టివిలో ఆ వార్తలు చూసినప్పుడు మనస్ఫూర్తిగా నవ్వుకొంటాను. ఆ తర్వాత నా చేయి, గొంతు కోసుకొని ఆత్మహత్య చేసుకొంటాను' అంటూ పేర్కొన్నాడు. వారం రోజుల వ్యవధిలో ఢిల్లీ స్కూళ్లకు ఇలాంటి హెచ్చరికలు నాలుగుసార్లు వచ్చాయి. బెంగళూరు నగరంలో కూడా శుక్రవారం ఉదయం పలు పాఠశాలల్లో బాంబులు ఉన్నట్లు ఇ-మెయిల్స్ వచ్చాయి. దీంతో ఆయా ప్రాంతాలకు బాంబు డిస్పోజబుల్ స్క్వాడ్ బృందాలను పంపించారు. ఇప్పటి వరకు గాలింపు బృందాలకు ఎటువంటి పేలుడు పదార్థాలూ లభించలేదు. ఢిల్లీలో స్కూళ్లకు బాంబు బెదిరింపులు వచ్చిన కొన్ని గంటల్లోనే ఇక్కడ కూడా అటువంటివే రావడం గమనార్హం.

అమెరికాతో ఒప్పందాలపై జాగ్రత్త!

ఆర్‌బిఐ మాజీ గవర్నర్ హెచ్చరిక

న్యూఢిల్లీ : అమెరికాతో వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరిపేటపుడు ముఖ్యంగా వ్యవసాయ రంగానికి సంబంధించిన వ్యవహారాల్లో భారత్ చాలా తెలివిగా, జాగ్రత్తగా ఆలోచించి, వ్యవహరించాల్సి వుందని ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ శుక్రవారం హెచ్చరించారు. భారతదేశ ఆర్థిక వృద్ధి రేటు 6-7శాతం మధ్య స్థిరపడిందని, అంతర్జాతీయంగా వాణిజ్య అనిశ్చితులు నెలకొన్న కారణంగా చాలా స్వల్పమైన శాతంలో ప్రభావితమై వుండొచ్చునని రాజన్ పేర్కొన్నారు. పిటిఐ వీడియోస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాలు వెల్లడించారు.

సాధారణంగా వ్యవసాయ రంగానికి సంపన్న దేశాలు భారీగా సబ్సిడీలు ఇస్తూ వుంటాయి. దాదాపు ప్రతి దేశం తన రైతాంగానికి ఎంతో కొంత సబ్సిడీ ఇస్తూ వుంటుంది. వారితో పోలిస్తే మన రైతులు చాలా స్వల్ప మొత్తాల్లోనే రాయితీలను పొందవచ్చు, లేదా వారికన్నా తక్కువ కూడా వుండొచ్చు, ఇలాంటి పరిస్థితుల్లో ఎలాంటి అడ్డూ అదుపు లేకుండా



బయట నుండి వ్యవసాయ ఉత్పత్తుల వెల్లువ దేశంలోకి వచ్చిపడితే మన రైతాంగానికి అనేక సమస్యలు తలెత్తవచ్చని అన్నారు. దేశంలో విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించవచ్చని ఆయన సూచించారు. ముఖ్యంగా డెయిరీ ఉత్పత్తుల రంగంలో ఇందుకు పరిస్థితులు సానుకూలంగా వున్నాయన్నారు. కేవలం ముడి పదార్థాలు ఎగుమతి చేయడానికి బదులుగా విదేశీ పెట్టుబడులకు అవకాశం కల్పిస్తే స్థానిక రైతాంగం ప్రయోజనాలు పొందుతారని, తమ ఉత్పత్తులకు మరింత విలువను జోడించి మరింత డబ్బును ఆర్జిస్తారని అన్నారు.

"విదేశీ పాల దిగుమతులను స్వాగతించే బదులు ఇతర మార్గాలను అన్వేషించాలి. ఇవన్నీ చాలా జాగ్రత్తగా, తెలివిగా చర్చించాలి. వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నంత కాలం ఎగుమతులు, పెట్టుబడుల రెండింటికీ ప్రతికూలంగా ఉంటుంది. అమెరికా చైనాపై, ఆసియాలోని కొన్ని ఇతర దేశాలపై విధించే సుంకాలు భారతదేశంపై విధించే సుంకాల కంటే ఎక్కువగా ఉంటే.. తయారీ రంగం భారత్‌కు మళ్లవచ్చు." అని రాజన్ తెలిపారు. ప్రస్తుత వాణిజ్య చర్చల్లో భారత్ తన ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి తెలివిగా వ్యవహరించాలని ఆయన పునరుద్ఘాటించారు. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం ప్రస్తుతం వాషింగ్టన్‌లో భారత బృందం ఐదవ రౌండ్ చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాజన్ వ్యాఖ్యలు కీలకంగా మారాయి. ఈ వారం ప్రారంభంలోనే భారత బృందం ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం(బిటిఎ) పై ఐదవ దఫా చర్చలు కోసం వాషింగ్టన్ వెళ్లిన సంగతి తెలిసిందే.

సైన్యం అమ్ములపొదిలోకి 'షేర్ ' తుపాకీలు



న్యూఢిల్లీ : భారత ఆయుధ సంపత్తిలోకి అత్యాధునిక 'షేర్' తుపాకీలు సమకూరనున్నాయి. కలాష్నికోవ్ సిరీస్‌లో అత్యాధునికమైన ఎకె-203 రైఫిళ్లనే తయారీ సంస్థ 'షేర్' పేరుతో అందజేస్తోంది. నిమిషానికి 700 రౌండ్లు ఫైర్ చేయగల సామర్థ్యం ఈ రైఫిళ్లకుంటుంది. అలాగే 800 మీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలుగుతుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమేథిలో భారత్-రష్యా భాగస్వామ్యంతో ఏర్పాటైన ఇండో-రష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఆర్‌ఆర్‌పిఎల్) సంస్థ వీటిని తయారుచేస్తోంది. వాస్తవానికి రూ.5,200 కోట్ల కాంట్రాక్టులో భాగంగా 2032 అక్టోబరు నాటికి 6,01,427 ఎకె-203 రైఫిళ్లను అందజేయాల్సి ఉంది. కానీ, అనుకున్న సమయానికి కంటే ముందుగానే వీటిని అందజేస్తున్నామని ఐఆర్‌ఆర్‌పిఎల్ సిఇఒ-మేనేజింగ్ డైరెక్టర్ మేజర్ జనరల్ ఎస్‌కె శర్మ వెల్లడించారు. 'ఇప్పటికే దాదాపు 48 వేల రైఫిళ్లను ఇచ్చేశాం. రెండు నుంచి మూడు వారాల్లోగా మరో 7 వేల రైఫిళ్లు అందజేస్తాం. డిసెంబరు నాటికి 15 వేల రైఫిళ్లు అదనంగా ఇస్తాం" అని ఆయన వెల్లడించారు. ఏకే-47, ఏకే-57తో పోల్చుకుంటే ఈ 'షేర్' తుపాకీలు అత్యాధునికమైనవి. కొన్ని దశాబ్దాలుగా సాయుధ దళాలు ప్రముఖంగా వినియోగించే ఇన్సాస్ రైఫిళ్ల స్థానంలో ఆర్మీ వీటి వినియోగం పెంచనుంది. ఇన్సాస్ రైఫిల్ కాలిబర్ 5.62 ఎంఎం కాగా.. 7.62 ఎంఎం కాలిబర్‌తో వీటిని రూపకల్పన చేశారు.

'అభిశంసన' ప్రక్రియ ప్రభుత్వం చేతుల్లో లేదు

- అది పార్లమెంటు సభ్యులే చేయాలి
- కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తిని తొలగించే రాజ్యాంగ అధికారం పార్లమెంటుకు ఉన్నప్పటికీ, అటువంటి తీర్మానాన్ని ప్రారంభించే ప్రక్రియ ఎంపిల చేతుల్లో ఉందని కేంద్ర న్యాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ స్పష్టం చేశారు. నగదు సంబంధిత వివాదంలో దుష్ప్రవర్తనకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసనకు గురయ్యే అవకాశం ఉందని చర్చ నేపథ్యంలో శుక్రవారం ఆయన స్పందించారు. అభిశంసన తీర్మానం తీసుకురావడంలో ప్రభుత్వానికి ఎటువంటి పాత్ర లేదని, అలాంటి ఏదైనా చర్యను ఎంపిలు స్వతంత్రంగా నడిపించాలని నొక్కి చెప్పారు. "ఇది పూర్తిగా ఎంపిల విషయం. ప్రభుత్వం చేతుల్లో లేదు" అని ఆయన అన్నారు.

ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి , ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ యశ్వంత్ వర్మ చుట్టూ వివాదం నెలకొన్న నేపథ్యంలో ఆయనను అభిశంసించేవీలుందా అని చర్చ జరుగుతున్న వేళ అర్జున్ మేఘ్వాల్ పై విధంగా స్పందించారు. కాగా రాజ్యాంగం ప్రకారం ఒక న్యాయమూర్తిని అభిశంసించే తీర్మానానికి కనీసం 100 మంది లోక్‌సభ సభ్యులు లేదా 50 మంది రాజ్యసభ సభ్యుల మద్దతు అవసరం. ఈ ప్రక్రియ పూర్తిగా చట్టబద్ధమైన ప్రక్రియ అని మేఘ్వాల్ పునరుద్ఘాటించినప్పటికీ, కొంతమంది ఎంపిలు ఈ తీర్మానాన్ని ప్రారంభించడానికి ఆసక్తి చూపారని ఆయన తెలిపారు. జూలై 21న ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ అంశం ఊపందుకునే అవకాశం ఉంది. కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేష్ ఇప్పటికే తమ పార్టీ ఎంపిలు ఈ తీర్మానానికి మద్దతు ఇస్తారని ప్రకటించారు.

గాజాలో ఏమీ మిగల్లేదు!

- స్వచ్ఛంద సంస్థల ఆందోళన
- పోషకాహార లోపంతో ఏడాది బాలిక మృతి
- మరో 35 మంది మృత్యువాత



మధ్య గాజా స్ట్రిప్‌లో నెట్‌జరీం కారిడార్ వద్ద జిహెచ్‌ఎఫ్ పంపిణీ చేసిన ఆహార బాక్సుల కోసం పాలస్తీనీయన్ల పాట్లు

గాజా : ఆహార సరఫరాను దిగ్బంధించి కనీస ఆహారం కోసం ప్రజలు అలమటించేలా ఇజ్రాయిల్ పాల్పడుతున్న చర్యలతో గాజా ప్రాంత వ్యాప్తంగా ఆస్పత్రుల్లో పోషకాహారం లోపంతో బాధపడుతున్నవారి సంఖ్య అనూహ్యంగా పెరుగుతోందని గాజా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. గాజాలో ఏమీ మిగల్లేదని గాజా అక్కడ స్వచ్ఛంద సేవలందిస్తున్న సంస్థల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోషకాహార లోపంతో బాధపడుతూ, చికిత్స కోసం ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోందంటే జిహెచ్‌ఎఫ్ మానవతా అవసరాలను తీర్చడంలో విఫలమైందని స్పష్టమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలస్తీనాలోని ఎన్‌జిఒ సంస్థల గ్రూపు డైరెక్టర్ అంజాద్ షావా మీడియాతో మాట్లాడుతూ గాజాలో తినేందుకు ఏమీ మిగల్లేదని వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్య సమితి తరపున ఆహార పంపిణీ బాధ్యత చేపడతామంటూ వచ్చిన జిహెచ్‌ఎఫ్ ఆహార అవసరాలు తీర్చడం కన్నా ఇజ్రాయిల్ రాజకీయ-మిలటరీ ఎజెండాను అమలు చేస్తోందని విమర్శించారు. ఆహారం కోసం సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసల కోర్చి దక్షిణ ప్రాంతానికి వచ్చేలా చేసి అక్కడ వారిపై కాల్పులకు తెగబడు తోందని ఆయన విమర్శించారు. హమాస్ కూడా ఇదే తీరున విమర్శలు చేస్తోంది. పాలస్తీనియన్లను మూకుమ్మడిగా ఆహార కొరతతో చంపేయాలన్నది ఇజ్రాయిల్ లక్ష్యంగా వుందని హమాస్ ఒక ప్రకటనలో విమర్శించింది. సెంట్రల్ గాజాలోని డేర్ అల్ బాలాహ్‌లో ఏడాది వయస్సున్న బాలిక పోషకాహారం లోపంతో చనిపోయిందని అల్ అక్సర్ అమరవీరుల ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

అందరినీ కలుపుకుని ముందుకెళ్లడమే విప్లవ లక్ష్యం !

- క్యూబా అధ్యక్షులు మిగ్వెల్ డియాజ్ కానెల్



హవానా : క్యూబా తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, వివిధ రకాలైన ఆర్థిక ఆంక్షలు, సవాళ్ళే కాకుండా కొత్తగా సామాజికపరమైన సవాళ్లు కూడా తలెత్తుతున్నాయని క్యూబా అధ్యక్షుడు మిగ్వెల్ డియాజ్ కానెల్ ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో దుర్బలంగా వుండే నిర్దిష్ట గ్రూపుల్లో ఇటువంటి అంశాలు తీవ్ర పరిణామాలను సృష్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా వారి ప్రవర్తన, వ్యవహార శైలి సమాజానికి ఆందోళనకరంగా మారుతోందని అన్నారు. క్యూబన్ సమాజంలో ముఖ్యంగా కుటుంబాల్లో విలువల క్షీణతగా ఆయన ఈ మార్పును అభివర్ణించారు. అయితే విప్లవం ఎవరినీ వెనుకబడేలా చేయదని, అందరినీ కలుపుకుని ముందుకు తీసుకెళ్లడానికే చూస్తుందని ఆయన ధృఢంగా చెప్పారు. నేషనల్ అసెంబ్లీ ఐదవ సాధారణ సమావేశం ప్రారంభం సందర్భంగా యువత, పిల్లలు, మహిళల సమాన హక్కులకు సంబంధించిన కమిషన్‌లో మిగ్వేల్ ప్రసంగించారు. ప్రజలు, వారి సంక్షేమం అనేది ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని వ్యాఖ్యానించారు. సమాజంలోని వక్రీకరణల దిద్దుబాటుకు ప్రభుత్వం చేపట్టే కార్యక్రమ లక్ష్యాలపై నివేదికను అందచేయడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యమని చెప్పారు. అలాగే ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి కూడా చర్చించనున్నట్లు తెలిపారు. పరిస్థితులు ఎలా వున్నా వాటితో నిమిత్తం లేకుండా ప్రజల సంక్షేమానికి కట్టుబడి వుండడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

బోల్సొనారోపై కోర్టు ఆంక్షలు

- ఎన్నికల ఫలితాల తారుమారుకు కుట్ర
- దేశం విడిచి వెళ్లరాదన్న న్యాయస్థానం



బ్రెజిల్ : బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సొనారోపై ఆదేశ అత్యున్నత న్యాయస్థానం ఆంక్షలు విధించింది. ఆయన ఎలక్ట్రానిక్ యాంకిల్ మానిటర్ (నేరస్తులకు అమర్చే నిఘా పరికరం) ధరించాలని శుక్రవారం ఆదేశించింది. అంతేకాకుండా సోషల్ మీడియా ఉపయోగించడాన్ని నిషేధించింది. విదేశీ రాయబారులతో సంప్రదింపులు జరపరాదని స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల అనంతరం పోలీసులు బోల్సొనారో నివాసం, కార్యాలయంలో సోదాలు చేసి పలు ఆధారాలు సేకరించామని, దొరికిన 14 వేల డాలర్లు సీజ్ చేశామని ప్రకటించారు.

ఎందుకు కేసు ?

బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికలు 2022 అక్టోబర్‌లో జరిగాయి. ఆ ఎన్నికల్లో బోల్సొనారో ఓడిపోయారు. అనంతరం దేశవ్యాప్తంగా అల్లర్లు చెలరేగాయి. ఫలితాలు మార్చి అధికారంలో కొనసాగటానికి ఆయన కుట్ర చేశారని ప్రధాన అభియోగం. దీనిపై విచారణ కొనసాగుతుండగా ఇటీవలె బోల్సొనారోకు మద్దతుగా ట్రంప్ మాట్లాడారు. ఆయనపై బ్రెజిల్ అధ్యక్షుడు లూలా రాజకీయ కక్ష సాధిస్తున్నారని ట్రంప్ ఆరోపించారు. ఆయనతో భేటీ అనంతరం బ్రెజిల్ పై 50% సుంకాలు విధిస్తామని ట్రంప్ బెదిరించడం గమనార్హం. కోర్టు ఆంక్షలు వెల్లడించిన తరువాత ట్రంప్ తన సోషల్ ట్రూత్‌లో సుప్రింకోర్టును అన్యాయమైన వ్యవస్థగా అభివర్ణించారు. ఆయన్ని బాధితుడుగా పేర్కొన్నారు. బోల్సొనారో, ఆయన కుమారుడు అమెరికా విదేశాంగ అధికారులతో జరిపిన రహస్య సమావేశ వివరాలను లూలా ప్రభుత్వం కోర్టు ముందుంచింది. వీటిని పరిగణలోకి తీసుకుని దేశం విడిచి వెళ్లరాదని కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. బోల్సొనారోపై నేరం రుజువైతే ఆయన రాజకీయ జీవితం ముగిసినట్లేనని పరిశీలకులు భావిస్తున్నారు.

వాల్‌స్ట్రీట్ జర్నల్‌పై కేసు పెడతా : ట్రంప్


వాషింగ్టన్ : వివాదాస్పద ఫైనాన్షియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు తాను రాసిన లేఖపై కథనాన్ని ప్రచురించిన వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక పైన, దాని యజమాని రూపర్ట్ మర్డోచ్ పైన దావా వేస్తానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. 2003లో ఎప్‌స్టీన్ 50వ పుట్టినరోజు సందర్భంగా జరిగిన నోట్స్ సేకరణలో నగ్నంగా ఉన్న మహిళ స్కెచ్, ట్రంప్ సంతకంతో కూడిన లేఖ ఉన్నదంటూ పత్రిక ఓ కథనాన్ని అందించింది. తాను ఆ లేఖను పరిశీలించానని, కానీ మహిళ చిత్రాన్ని ముద్రించలేదని పత్రిక వివరణ ఇచ్చింది. కాగా 'ఇది ఓ కుంభకోణమని, బూటకను కథనాన్ని ప్రచురించవద్దని రూపర్ట్ మర్డోచ్‌కు చెప్పాను. కానీ ఆయన ఆ పని చేశారు. కాబట్టి నేను దావా వేస్తాను' అని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. లేఖ నకిలీదని అధ్యక్ష భవనం పత్రికా కార్యదర్శి కరోలిన్ లీవిట్, తాను పత్రిక ఎడిటర్-ఇన్-చీఫ్ ఎమ్మా టకర్‌కు తెలియజేశామని గతంలో పెట్టిన పోస్ట్‌లో ట్రంప్ తెలిపారు. పత్రికలు తప్పుడు కథనాలు అందించకూడదని చెప్పుకొచ్చారు.

రష్యాపై 18వ దఫా ఇయు ఆంక్షలు

బ్రసెల్స్ : రష్యాపై కొత్తగా ఆంక్షలకు యురోపియన్ యూనియన్ (ఇయు) శుక్రవారం ఆమోద ముద్ర వేసింది. రష్యాపై అమలయ్యే అతి కఠినమైన ఆంక్షల ప్యాకేజీలో ఒకదానికి ఇయు ఆమోదం తెలిపిందని విదేశాంగ వ్యవహారాలు, భద్రతా విధానానికి సంబంధించిన ఇయు ప్రతినిధి కాజా కల్లాస్ చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. తృతీయ దేశాలకు విక్రయించే రష్యన్ చమురుపై ధరల పరిమితిని మార్కెట్ రేటు కన్నా 15శాతం మేరా తగ్గించాలనే నిబంధన ఈ ప్యాకేజీలో వుంది. ఇవి, రష్యాపై ఇయు విధించిన 18వ దఫా ఆంక్షలు. తొలుత 2022లో జి 7 దేశాలు బ్యారెల్‌కు 60 అమెరికన్ డాలర్లుగా నిర్ణయించాయి. ఇప్పుడు కొత్త ఇయు పథకం కింద ఈ పరిమితి 47.6డాలర్లుగా వుండనుంది. భవిష్యత్తులో చమురు ధరల కదలికలకు అనుగుణంగా సద్దుబాటు చేసుకునే వెసులుబాటు వుంది. బాల్టిక్ సముద్రంలోని నార్డ్ స్ట్రీమ్ 1, 2 గ్యాస్ పైప్‌లైన్లను తిరిగి యాక్టివేట్ చేయరాదన్న నిబంధన కూడా ప్యాకేజీలో భాగంగా వుంది. భారత్‌లో రష్యాకు చెందిన చమురు శుద్ధికర్మాగారంపై కూడా ఇయు ఆంక్షలు అమలవు తాయని కల్లాస్ చెప్పారు. కాగా రష్యా గ్యాస్‌పై ప్రధానంగా ఆధారపడే స్లొవేకియా ప్రతిపాదితియు ఆంక్షల ప్యాకేజీని నిలుపుచేస్తోంది. అయితే స్లొవేకియా ఇంధన అవసరాలను పరిరక్షిస్తామని యురోపియన్ కమిషన్ అధ్యక్షుడు ఉర్సులా వాన్ డెర్ లేయన్ హామీ ఇవ్వడంతో ఇక తాము కూడా పచ్చజెండా ఊపుతామని తెలిపింది.

సంఘ్ పరివార్‌తో మీరా పోరాడేది!

- రాహుల్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన సిపిఎం
- ఆర్‌ఎస్‌ఎస్‌తో సమానంగా సిపిఎంను చూడటంపై అభ్యంతరం



సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ

న్యూఢిల్లీ : ఆర్‌ఎస్‌ఎస్ పైనా, సిపిఎం పైనా తాను సైద్ధాంతికంగా పోరాడుతున్నానని, వాటికి ప్రజల మనోభావాలు పట్టవని కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను సిపిఎం తీవ్రంగా ఖండించింది. సంఘ్ పరివార్ శక్తులతో కలిసి కేరళలో నిత్యం సిపిఎంపై దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేత నుంచి ఇలాంటి వ్యాఖ్యలు రావడంలో ఆశ్చర్యమేమీ లేదని పేర్కొంది. 'సంఘ్ పరివార్‌తో వీలున్నప్పుడల్లా జట్టు కట్టే మీరా ఆర్‌ఎస్‌ఎస్‌తో పోరాడేది' అని ఎద్దేవా చేసింది. ఈ మేరకు సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ ఒక వీడియో సందేశాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఫక్తు మతతత్వ ఆర్‌ఎస్‌ఎస్‌ను, శ్రామిక గళంగా నిత్యం ప్రజల పక్షాన పోరాడుతున్న సిపిఎంను సమానంగా చూస్తూ రాహుల్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్‌తో కేరళలో అనునిత్యం పోరాడుతున్నది సిపిఎంయే అన్న సంగతి రాహుల్ మర్చిపోయినట్లు ఉన్నారని పేర్కొన్నారు. సంఘ్ పరివార్ సాగించిన ఉన్మాద దాడుల్లో.. అంకితభావంతో పనిచేసే అనేక మంది కార్యకర్తలను సిపిఎం పోగొట్టుకున్నదని ఈ సందర్భంగా బేబీ గుర్తు చేశారు. ఇదే కేరళలో వామపక్షాలకు వ్యతిరేకంగా దుష్ప్రచారం చేసేందుకు కాంగ్రెస్, ఆర్‌ఎస్‌ఎస్ ఒకే జట్టుగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కేరళలో రాహుల్ అడుగుపెట్టగానే అతనికి ఈ తరహా వ్యాఖ్యలు చేయడం అలవాటుగా మారిందని విమర్శించారు.

ఎంఎ బేబీ తన వీడియోలో ఏం చెప్పారంటే...

'కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల గురించి కొందరు మిత్రులు నా దృష్టికి తీసుకొచ్చారు. ఆర్‌ఎస్‌ఎస్ మరియు సిపిఎంతో సైద్ధాంతికంగా పోరాడేందుకు అంకితమైనట్లు ఆయన పేర్కొన్నారు. ఇది చాలా దురదృష్టకరం. కేరళలో ఆర్‌ఎస్‌ఎస్‌తో సైద్ధాంతికంగా, రాజకీయంగా పోరాడటంలో సిపిఎం ముందు భాగాన ఉంటోంది. ఆర్‌ఎస్‌ఎస్ వాళ్లు వందలాది మంది సిపిఎం కార్యకర్తలను, విద్యార్థి, యువజన సంఘాల కార్యాకర్తలను హత్య చేశారు. అయినా ఆర్‌ఎస్‌ఎస్‌తో సైద్ధాంతికంగా, రాజకీయంగా పోరాడేందుకు సిపిఎం కట్టుబడివుంది. రాహుల్ గాంధీకి కేరళలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర ఏమిటీ? సిపిఎం నిర్వహిస్తున్న పాత్ర ఏమిటీ అనేది తెలుసో లేదో ! ఆర్‌ఎస్‌ఎస్‌పైనా, బిజెపి పైనా మేము ఎంతటి నిర్మాణాత్మకంగా పోరాడుతున్నామో దేశం మొత్తానికి తెలుసు. సిపిఎం, ఇతర వామపక్షాలు మద్దతు ఇవ్వకపోయివుంటే 2004లో కేంద్రంలో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగేవారా? లేదా? అనేది రాహుల్ గాంధీ తెలుసుకోవాలి? ఏదేమైనా రాహుల్ గాంధీ కేరళలో వయనాడ్ నుంచి ఎంపీగా గతంలో గెలిచారు. ఆయన ఎవరిపై పోరాడారు. ఆర్‌ఎస్‌ఎస్‌తో, బిజెపితో పోరాడి గెలిచారా? ఆయన పోటీ పడింది సిపిఐతో అన్న సంగతి గుర్తు చేస్తున్నాం. ఆయన ఇప్పటికైనా సిపిఎంకు వ్యతిరేకంగా మాట్లాడేటప్పుడు మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నాం. ఆయన సిపిఎంపై విమర్శలు చేయవచ్చు. సిపిఎం కూడా కాంగ్రెస్ ఆర్థిక విధానాలను విమర్శిస్తూవస్తోంది. అది స్నేహపూర్వకంగానే. ఇక ముందు కూడా ఆర్థిక విధానాల విషయంలో కాంగ్రెస్, బిజెపి తప్పుడు విధానాలను ఎత్తి చూపుతూనేవుంటాం. కానీ మేము వాటన్నిటినీ ఒకే గాటన కట్టి విమర్శించడం లేదు. ఆర్‌ఎస్‌ఎస్‌ను ఏకాకిని చేసే విమర్శలు చేస్తాం. కానీ రాహుల్ గాంధీ చాలా క్యాజువల్‌గా ఆర్‌ఎస్‌ఎస్‌ను, సిపిఎంను తన సైద్ధాంతిక శత్రువుగా పేర్కొనడం సబబు కాదు. దీనిపై ప్రజలు కచ్చితంగా గుణపాఠం చెబుతారు' అని ఎంఎ బేబీ తన వీడియో సందేశంలో పేర్కొన్నారు.

అంతకుముందు కేరళలోని కొట్టాయంలో జరిగిన ఒక సభలో రాహుల్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు అందరూ మాజీ ముఖ్యమంత్రి ఊమెన్‌చాండీని ఆదర్శంగా తీసుకొని పనిచేయాలన్నారు. ఇదే సమయంలో ఆయన ఆర్‌ఎస్‌ఎస్‌పైనా, సిపిఎంపైనా ఆరోపణలు గుప్పించారు. 'ఆర్‌ఎస్‌ఎస్, సిపిఎంతో సైద్ధాంతికంగా పోరాడుతున్నాం. వాటిపై నా నుంచి పెద్ద విమర్శ ఏమిటంటే వాటికి ప్రజల మనోభావాలు అర్థం కావు. మీరు ఎంతటి గొప్ప ప్రసంగాలు చేసినా..ప్రజల భావాలను అర్థం చేసుకోకుంటే..వారితో మమేకం కాకుంటే..వారిని కౌగిలించుకోలేకపోతే ..మీరు నాయకులవ్వలేరు' అని రాహుల్ పేర్కొన్నారు. అయితే ఆర్‌ఎస్‌ఎస్‌ను, సిపిఎంను రెండింటిని ఒకే గాటన కట్టి రాహుల్ ఆరోపణలు చేయడంతో అక్కడి కాంగ్రెస్ కార్యకర్తలు సైతం విస్తుపోయారు.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు అడ్డుపడొద్దు

- రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు రద్దు చేయండి
- ఎపి సిఎం చంద్రబాబుకు తెలంగాణ సిఎం రేవంత్ విజ్ఞప్తి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో



తెలంగాణ రైతాంగానికి అతి ముఖ్యమైన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు అడ్డుపడొద్దని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు నాయుడిని కోరారు. తెలంగాణకు నష్టం కలిగించే రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టును రద్దు చేసి ఉదారంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. 'మా సమస్యలపై విజ్ఞప్తులు చేస్తాం. వినకపోతే పోరాటం ఎలా చేయాలో మా పాలమూరు బిడ్డలకు బాగా తెలుసు. అక్కడ సూర్యుడు ఇక్కడ మొలిచినా పాలమూరు అభివృద్ధి చేసి తీరతాం' అని అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం జటప్రోలులో శుక్రవారం నిర్వహించిన 'ప్రజాపాలన-ప్రగతి బాట' సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. తెలంగాణకు నష్టం కలిగించే చర్యలను విరమించుకోవాలని ఎపి ముఖ్యమంత్రిని కోరుతూనే పోరాటానికైనా సిద్ధమేనని హెచ్చరిక కూడా చేశారు. గత పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లాను పట్టించుకోలేదని, పాలమూరు ప్రజలంటే కెసిఆర్‌కు చిన్నచూపని విమర్శించారు. అభివృద్ధి చూసి ఓర్వలేక ప్రజా ప్రభుత్వంపై బిఆర్‌ఎస్ విషం చిమ్ముతోందని దుయ్యబట్టారు.అనంతరం స్వయం సహాయక సంఘాలకు రూ.344 కోట్ల వడ్డీలేని రుణాలను విడుదల చేస్తూ చెక్కును మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎంపి మల్లు రవి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నీళ్లతో రాజకీయాలు చేయొద్దు

- సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బనకచర్ల ప్రస్తుత ప్రాధాన్యత ఉన్న ప్రాజెక్టు కాదని, మొదట పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ తెలిపారు. శుక్రవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. నీళ్లను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయడం, తల్లిని అడ్డం పెట్టుకుని రాజకీయం చేయడమేనని అన్నారు. ఎపి, తెలంగాణ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి నీళ్లను అడ్డుకోవద్దని హితవు పలికారు. రెండు రాష్ట్రాలు నీటి పంపిణీ, ప్రాజెక్టుల సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. రెండు రాష్ట్రాల మధ్య నీటి సమస్యను పరిష్కరించేందుకు కేంద్రం సమావేశాన్ని ఏర్పాటు చేయడాన్ని సిపిఐ స్వాగతిస్తుందన్నారు. నదుల్లో రెండు రాష్ట్రాల నీటి వాటాలు తేలాకనే నీటి ప్రాజెక్టులపై ముందుకు వెళ్లాలని సూచించారు. రాయలసీమకు నీళ్లు అవసరమని అన్నారు. ఎపి, తెలంగాణలో నీటి అంశాలను రాజకీయం చేస్తున్నారని పేర్కొన్నారు. కాళేశ్వరం అవినీతిమయమైందన్నారు. బనకచర్ల గురించి చంద్రబాబు అతిగా మాట్లాడారని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయకుండా బనకచర్ల తెరమీదకు తెచ్చారని విమర్శించారు.

లాలూ కేసులో జోక్యానికి సుప్రీం తిరస్కృతి

న్యూఢిల్లీ : రైల్వే ఉద్యోగాలకు భూమి కేటాయింపు కేసులో బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్‌పై జరుగుతున్న అవినీతి విచారణపై స్టే విధించడానికి ఢిల్లీ హైకోర్టు తిరస్కరించిన విషయమై జోక్యం చేసుకోవడానికి సుప్రీం కోర్టు శుక్రవారం తిరస్కరించింది. అయితే, సిబిఐ తనపై నమోదు చేసిన క్రిమినల్ కేసును కొట్టేయాలంటూ లాలూ ప్రసాద్ పెట్టుకున్న ప్రధాన పిటిషన్‌పై విచారణను వేగిరపరచాలని జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన బెంచ్ ఢిల్లీ హైకోర్టును కోరింది. తాత్కాలిక ఉత్తర్వులో హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రధాన పిటిషన్ పరిష్కారాన్ని ప్రభావితం చేయరాదని కూడా బెంచ్ స్పష్టం చేసింది. హైకోర్టు తాత్కాలిక ఉత్తర్వులను సవాలు చేస్తూ యాదవ్ పెట్టుకున్న పిటిషన్ ప్రాతిపదికగా ఆయనకు వ్యతిరేకంగా ఈ కేసుపై తాము వ్యాఖ్యానించబోమని సుప్రీం తెలిపింది. ఆయన వయస్సు, ఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకుని విచారణ కార్యకలాపాల నుండి యాదవ్‌ను మినహాయించాల్సిందిగా కూడా కోర్టు ఆదేశించింది.



జీవన సౌరభం

వినడానికి కటువుగా ఉన్నా..
నీ గురించి వాస్తవాలు చెప్పే
వారి సలహాలే తీసుకో.

మీ కోసం

రాళ్ల ఉప్పు, పంచదార, నిమ్మరసం,
మిరియాలు వేసి మిశ్రమంలా చేసుకుని
ప్రతిరోజూ రెండు స్పూన్లు తీసుకుంటే
శ్లేష్మం, దగ్గు సమస్యలు పోతాయి.



JEEVANA జీవన the family

'అయ్యో.. పాపం!'



కార్తికేయ నాలుగో తరగతి చదువుతున్నాడు. ఆదివారం కావటంతో ఆలస్యంగా నిద్ర లేచాడు. గమనించిన తల్లి పెరట్లో మొక్కలకు నీళు పట్టమని పురమాయించింది. కార్తికేయ అయిష్టంగా పెరట్లోకి వెళ్లాడు. అక్కడ నీళ్ల వృథాగా పోతున్నాయి. వెంటనే పంపుకు పైపు తగిలించి మొక్కలకు నీళ్ల పట్టసాగాడు. కార్తికేయ నీళ్లతో సరదాగా ఆడుకుంటూ మొక్కలకు నీళ్ల పెడుతున్నాడు. ఇంతలో తన దృష్టి ఒకచోట పడింది. అక్కడ ఓ బుజ్జి వానపాము భూమిలోంచి బయటకు రావటానికి ప్రయత్నిస్తున్నది. కార్తికేయ ఆసక్తిగా దాన్ని గమనించసాగాడు. చివరకు అది విజయం సాధించింది. భూమి మీదకు రాగానే దానికి అంతా కొత్తగా కనిపించింది. మెల్లగా అటూఇటూ పాకటం ప్రారంభించింది. అలా పాకుతూ చెట్టు కిందకు చేరింది.

అక్కడే వున్న చీమలు, బుజ్జి వానపామును గుర్తించాయి. ఆహారం దొరికిందని ఆనందంతో వానపాము దగ్గరకు వచ్చాయి. దానికి ఏమీ అర్థం కాలేదు. చీమలన్నీ మూకుమ్మడిగా వానపాము మీద దాడిచేశాయి. వానపాము బిత్తరపోయింది. బాధతో శరీరాన్ని కదిలిస్తూ తప్పించుకోవాలని చూసింది. కానీ దాని వల్ల కాలేదు. భూమిలోకి వెళ్లాలని చూసింది. కానీ సాధ్యం కాలేదు. చీమలు కుట్టటంతో బాధతో మెలికలు తిరగసాగింది. బుజ్జి వానపాము పరిస్థితి కార్తికేయను కదిలించింది. దానిని రక్షించాలని నిర్ణయించుకున్నాడు. ఇంతలో మెరుపులాంటి ఆలోచన వచ్చింది. తన చేతిలో వున్న నీళ్ల పైపును వానపాము వైపు మళ్లించాడు.

అంతే.. నీళ్ల ధాటికి చీమలన్నీ వానపామును వదిలి తలో దిక్కుకు పోయాయి. వానపాము బతుకు జీవుడా అనుకుంటూ భూమి లోపలికి పరుగు తీసింది. దానిని రక్షించానన్న ఆనందంతో కార్తికేయ తన పనిలో నిమగ్నమయ్యాడు.

– తమ్మవరపు వెంకట సాయి సుచిత్ర,
ఖమ్మం, 94923 09100.

నిన్ను నీవు గెలవరా!



భయం దేనికి
జయం నీదిరా!
సంకోచం విడిచి
ముందడుగు వేయరా!

ఎత్తైన కొండలను
చిత్తు చేసే శక్తి మనదిరా!
లోతైన సంద్రాలను
వశపరుచుకునే ఓర్పు
మనకుందిరా!

గగనానికి ఎగిరే
గతిశక్తిని పొందారా!
గ్రహాలను చేరే
గొప్ప గురి మనకుందిరా!

ముందు నిన్ను నువ్వు
గెలవరా!
మనల్ని ఆపేది
ఇంకేది లేదురా!

భయం దేనికి
జయం నీదిరా!
సంకోచం విడిచి
ముందడుగు వేయరా!

– తిప్పాన హరి రెడ్డి,
విజయవాడ,
94938 32412.

నేను గీసిన బొమ్మ





డి. దుర్గా భవాని,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
పోతారెడ్డిపేట, సిద్ధిపేట.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మాలతి.. ఆ ఊరికి విద్యాజ్యోతి..

'ఏమీ లేని చోట నుండి ఏదైనా సాధించాలి' అన్న పట్టుదల చాలా తక్కువమందిలో ఉంటుంది. అలాంటివారిలో ఒకరే మాలతీ ముర్ము. పశ్చిమబెంగాల్ పురులియా జిల్లాలోని అయోధ్య కొండల దిగువన జిలింగ్‌సీలింగ్ అనే ఆదివాసీ గ్రామం ఉంది. అక్కడ మాలతి ఓ 45 మంది పిల్లలకు చదువు నేర్పిస్తోంది. వారంతా ఆ చుట్టుపక్కల గూడెలలోని పిల్లలు. ఆ పిల్లలకు మట్టితో కట్టిన గోడల మధ్య సుద్దముక్కతో బోర్డుపై అక్షరాలు నేర్పిస్తోంది. ఇదంతా చేస్తున్నందుకు ఆమెకి జీతం రాదు. ఎందుకంటే ఆమేమీ ప్రభుత్వ ఉద్యోగి కాదు. సాదాసీదా గృహిణి. ఇద్దరు బిడ్డల తల్లి. 'విద్య ఒక తరాన్ని ముందుకు తీసుకెళ్తుంది' అన్న దూరదృష్టి ఉన్న మహిళ. అందుకే ఎవరు సాయం చేసినా, చేయకపోయినా నిస్వార్థంగా తన పని తాను చేసుకుపోతోంది.



మాలతి 2019లో బంకా ముర్ముని వివాహం చేసుకుని ఆ గ్రామానికి వచ్చింది. గ్రామంలో బడి ఈడు పిల్లలు, యువతీ యువకులకు సరైన అక్షర జ్ఞానం లేదని త్వరగానే గ్రహించింది. 12వ తరగతి వరకు చదువుకున్న మాలతి ఊరి పిల్లలంతా కట్టెలు కొట్టుకుంటూ జీవించడం చూసి తట్టుకోలేకపోయింది. 25 కిలోమీటర్లు ప్రయాణించి, ప్రాథమిక పాఠశాలకి వెళ్లలేక ఇంటికే పరిమితమైన చిన్నారులను చూసి చాలా బాధ పడింది. సరైన ప్రోత్సాహం లేనందున, తమ సొంత భాష సంతాలీలో రాయడం, చదవడం కూడా రాని ఆ పిల్లలపై జాలిపడింది.

అప్పుడే కోవిడ్ రూపంలో 2020లో ఉన్న ఆ ఒక్క స్కూలు మూతబడింది. స్మార్ట్‌ఫోనులు, ఆన్‌లైన్ క్లాసులతో దేశంలో సగం మంది పిల్లలు చదువుకుంటుంటే, తన గ్రామం పిల్లలు కూడా చదువుకోవాలని మాలతి ఎంతో తపించింది. మాలతీ సంకల్పానికి భర్త బంకా చేయందించాడు. మట్టితో నాలుగు గోడల గదిని కట్టించి ఇచ్చాడు. ఓ గోడపై బోర్డు సిద్ధం చేశాడు. ఇప్పుడు స్కూలు సిద్ధమైంది. మరి పిల్లలు ఎలా వస్తారు? ఈ పనికి మాలతీ స్వయంగా నడుంబిగించింది. సంకలో రెండునెలల పసిబిడ్డని పెట్టుకుని 'మీ పిల్లలకు చదువు చెబుతాను. నా దగ్గరికి పంపించండి' అని ఇల్లు ఇల్లు తిరిగి ప్రచారం చేసింది. మాలతి మాటలు మొదట ఎవరూ పట్టించుకోలేదు. అయినా మాలతి వెనుదిరగలేదు. వచ్చిన కొద్దిమంది పిల్లలకే విద్య నేర్పడం మొదలుపెట్టింది. ఊరికి వచ్చిన కొత్త కోడలు ఇంటిని చక్కబెడుతుందని అందరూ అనుకుంటే 'ఆమె ఊరినే బాగు చేస్తోంది' అని గ్రామస్తులంతా అనుకునేలా ఈ ఐదేళ్లలో మాలతీ విజయం సాధించింది. ఇంటిని పాఠశాలగా, పాఠశాలని జీవనాధారంగా చేసిన మాలతి ఇప్పుడు ఎందరినో చీకటి నుండి వెలుగులోకి నడిపిస్తోంది.

మాలతి చెప్పే విద్య తరగతి గదికే పరిమితం కాదు. అది వారి మూలాలను వెతికిచూపిస్తోంది. చాలామంది గిరిజన పిల్లలు తమ సొంత భాషలో అభ్యసించే వీలులేక, అన్య భాషలు అర్థం కాక విద్యకు దూరమవుతున్నారు. మాలతీ ఈ అవరోధాన్నే అధిగమించాలనుకుంది. మొదట తమ సొంత భాష సంతాలీలో పాఠాలు నేర్పించింది. ఆ తరువాత బెంగాలీ, ఆంగ్లంపై పట్టు సాధించేలా అక్షరాలు దిద్దిస్తోంది. ఇప్పుడు ఆ గ్రామంలోని పిల్లలకు భాష అవరోధంగా కాదు.. వంతెనలా పనిచేస్తోంది.

స్కూలు తెరిచినా..

కోవిడ్ టైంలో పాఠశాల మూతబడి స్కూలుకు దూరమైన పిల్లలు, ఆ తరువాత స్కూలు తెరిచినా అక్కడికి వెళ్లలేదు. మాలతి చెప్పే ఆ మట్టిగోడల మధ్య నాలుగు అక్షరాలు నేర్చుకోవడానికే మొగ్గుచూపుతున్నారు. ఎందుకంటే.. పిల్లలకు చదువు చెప్పాలనే సంకల్పం బలంగా ఉన్న మాలతి పిల్లలకు పాఠాలు చెప్పడానికంటే ముందు, వారి మాటలు, పాటలు, బాధలు అన్నింటినీ వింటుంది. వారికి అవసరమైన ప్రోత్సాహం కల్పిస్తుంది. చెప్పులు లేని పాదాలు మోసిన ప్రతి బిడ్డా కలని సాకారం చేయాలని దృఢంగా తపిస్తుంది.

ఇంటిపనులు, బిడ్డల ఆలనాపాలనా చూసుకుంటూనే స్కూలు నిర్వహిస్తోన్న మాలతిని ఈ బాధ్యతలేవీ నీరుగార్చడం లేదు. స్కూల్లో కనీస వసతుల్లేవనే ఆమె కలవర పడుతోంది. ఉన్నత విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థలు మాలతి చేస్తున్న నిస్వార్థ సేవకు అండగా నిలుస్తున్నారు. ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. అయితే మాలతికి కావాల్సింది పొగడ్తలు కాదు. నిధులు కావాలి. ఆ సాయమే నామమాత్రంగాఉంటోంది. క్లాసు రూంలో పిల్లలు కూర్చోవడానికి బల్లలు లేవు. పుస్తకాలు లేవు. కరెంటు లేదు. గ్రామస్తుల సహకారంతో ఇప్పటివరకు నిర్వహించింది. కానీ ఇప్పుడవి సరిపోవడం లేదు.

మాలతి సంకల్పాని చూస్తుంటే.. నిజమైన విద్య అంటే ఏమిటో అర్థమవుతుంది. చదువంటే సిలబస్‌ని అందించడమే కాదు. ఆత్మగౌరవాన్ని పెంపొందించడం. దేశ ఆత్మ, స్మార్ట్ తరగతి గదుల్లో లేదా ఉన్నత అకాడెమీల్లో ఉండదు. మాలతి వంటి మహిళలు నిశ్శబ్దంగా దేశ భవిష్యత్తుని నిర్మిస్తున్నారు. వారి ప్రయత్నాల్లోనే దేశ ఆత్మ కనిపిస్తుంది.

విద్య వెలుగులు అంతటా ప్రసరించాలి

నేను ఈ గ్రామానికి వచ్చినప్పుడు ఇక్కడ అధికార విద్య లేదని గ్రహించాను. 2020లో వీరికి ఉచిత విద్య బోధించాలని నిర్ణయించుకున్నాను. మొదట నా ఇంటిని అందుకు సిద్ధం చేశాను. తరువాత గ్రామస్తుల సాయంతో మట్టిగోడలతో ఓ తరగతి గదిని ఏర్పాటుచేశాను. అక్కడే ట్యూటోరియల్ నిర్వహిస్తున్నాను. గ్రామంలోని వారే కాదు, చుట్టుపక్కల గ్రామాల నుండి కూడా విద్యార్థులు ఇక్కడికి రావాలి. విద్య తన వెలుగులను ఈ చుట్టుపక్కల అన్ని గ్రామాలకు విస్తరించాలి.

– మాలతీ ముర్ము.

మాలతి వల్లే మా పిల్లలు చదువుతున్నారు

గ్రామంలో చాలామంది పిల్లలు బడికి వెళ్లరు. కానీ ఇప్పుడు వారంతా మాలతి ట్యూటోరియల్‌కి చాలా ఇష్టంగా వెళుతున్నారు. అక్షరాలు నేర్చుకుంటున్నారు. మాలతి, బంకు ఏ స్వార్థం లేకుండా మా పిల్లల కోసం ఇదంతా చేస్తున్నారు. అందుకే ఈ స్కూలు కోసం మేము ఏమైనా చేస్తాం.

– సునీతా మండి,
గ్రామస్తురాలు.

పిల్లలకు గొప్ప మార్గదర్శకురాలు

పిల్లలు వెళ్లడానికి ప్రాథమిక పాఠశాల ఉన్నా, లాక్‌డౌన్‌లో అది మూతబడింది. దీంతో అంతంతమాత్రం చదువుతున్న గ్రామంలోని పిల్లలంతా చదువుకు దూరమయ్యారు. అప్పుడే మాలతి ముందుకొచ్చింది. చదువుకున్న ఆ అమ్మాయి గ్రామంలోని పిల్లలు కూడా చదవాలని కోరుకుంది. ఇప్పుడు మాలతి మా పిల్లలకు గొప్ప మార్గదర్శకురాలిగా మారింది. ఆమె ప్రతి సంకల్పంలో మేం అండగా ఉండాలనుకుంటున్నాం.

– మినాటి సోరెన్, గ్రామస్తురాలు.

స్మార్ట్ తరగతి గదుల్లో చదువుకు కృషి

ప్రస్తుతం విద్య వేగంగా మారుతోంది. స్మార్ట్ తరగతి గదుల్లో ఎంతోమంది పిల్లలు చదువుకుంటున్నారు. మా గ్రామంలోని పిల్లలు ఆ తరహా విద్యని ఎందుకు పొందకూడదు? 'మాలతి నడిపిస్తున్న ఈ ట్యూటోరియల్‌ని ఇంకా అభివృద్ధి చేయాల'ని నేను నిత్యం ఆలోచిస్తున్నాను. ఆమె ప్రయత్నాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లే ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తున్నాను.

– బంకా ముర్ము, మాలతి భర్త.

'గరివిడి లక్ష్మి' ఫస్ట్ లుక్ పోస్టర్



టాలీవుడ్ యంగ్ హీరోయిన్ ఆనంది 'గరివిడి లక్ష్మి' అనే సినిమాతో రాబోతున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదలచేశారు. ఈ పోస్ట్‌కు.. 'మన గరివిడి లక్ష్మి ఒచ్చేసింది.. ఇక స్టేజి రెక్కి అగ్గిదీసేద్దంతే! అనేక హృదయాలను తాకిన ఒక స్వరం కథ' అనే క్యాప్షన్ జత చేశారు. ఈ మూవీ లేడీ ఓరియెంటెడ్ చిత్రంగా రాబోతున్నట్లు సమాచారం. ఈ సినిమా ద్వారా గౌరీ నాయుడు జమ్మూ అనే కొత్త దర్శకుడు టాలీవుడ్ ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నారు. ఇందులో రాగ్ మయూర్, నరేష్, రాశి, శరణ్య, ప్రదీప్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ కుమార్తె కృతి ప్రసాద్ నిర్మాతగా పరిచయమవుతున్నారు. చరణ్ అర్జున్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా బుర్రకథలో ఒక కొత్త ఒరవడిని సృష్టించి, యావత్ ఉత్తరాంధ్ర ప్రజలను తనవైపు తిప్పుకొని అద్భుతమైన పేరును తెచ్చుకున్న బుర్రకథ కళాకారిణి గరివిడి లక్ష్మి జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతోంది. షూటింగ్ శరవేగంగా జరుగుతున్న ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



సెప్టెంబర్ బరిలో బాలయ్యXపవన్

సెప్టెంబర్ 25న టాలీవుడ్‌లో ఇద్దరు పెద్ద కథానాయకుల సినిమాలు విడుదల కాబోతున్నాయి. ఆయా సినిమాల ఇద్దరు దర్శకులు అదేరోజున సినిమాలు విడుదల చేస్తామని ప్రకటించటంతో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అఖండ-2 నిర్మాతలు తమ సినిమా స్టేటస్ బయటపెట్టారు. ప్రస్తుతం డబ్బింగ్ నడుస్తోందని, అన్ని పనులు ఆగస్ట్ చివరి నాటికి పూర్తవుతాయని స్పష్టం చేశారు. అవసరమైతే ఓవర్సీస్‌కు సెప్టెంబర్ మొదటి వారంలోనే కాపీ పంపించేస్తామని చెబుతున్నారు. తమ సినిమా వాయిదా పడిందనే ప్రచారాన్ని పూర్తిగా ఖండిస్తున్నారు. ఇటు డివివి దానయ్య కూడా తగ్గట్లేదు. తాజాగా తిరుమలలో మీడియాతో మాట్లాడుతూ ఓజీ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గతంలో ప్రకటించినట్లుగానే సెప్టెంబర్ 25కి థియేటర్లలోకి వస్తామన్నారు. తమ సినిమా వాయిదా పడే ప్రసక్తి లేదని కూడా తేల్చేశారు. నిజానికి ఈ రెండు సినిమాలు షెడ్యూల్ టైమ్ కంటే ముందే సిద్ధమవుతున్నాయి.

25 నుంచి 'విశ్వంభర' తుది షెడ్యూల్



'చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'విశ్వంభర'. నా దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తయ్యింది. 'జగదేకవీరుడు అతిలోక సుందరి', 'అంజి' తర్వాత చిరు ఫాంటసీ జానర్‌లో సినిమాలు చేయలేదు. అందుకే నేను ఇలాంటి స్టోరీని ఎంచుకున్నా. ఓ స్పెషల్ సాంగ్, రెండు రోజుల ప్యాచ్ వర్క్ బ్యాలెన్స్ మాత్రమే ఉంది. ఈనెల 25 నుంచి మొదలయ్యే షూటింగ్‌తో ఇది పూర్తిచేస్తాం. దీంతో మొత్తం సినిమా చిత్రీకరణ పూర్తవుతుంది. మనకు మొత్తం 14 లోకాలున్నాయి. ఇప్పటివరకు వాటిని ఎవరికి తోచిన విధంగా వాళ్లు చూపించారు. యమలోకం, స్వర్గం, పాతాళలోకం.. అన్నీ చూసేశాం.

'విశ్వంభర' కోసం వీటన్నింటిని దాటి నేను పైకి వెళ్లాను. బ్రహ్మదేవుడు ఉండే సత్యలోకాన్ని ఇందులో చూపించాం. ఈ 14 లోకాలకు అదే మెయిన్. హీరో నేరుగా ఆ లోకానికి వెళ్తాడు. హీరోయిన్‌ని ఎలా తిరిగి తనతో పాటు తెచ్చుకుంటాడనేదే స్టోరీ. రెండున్నర గంటల సినిమాలో రెండు గంటల పాటు గ్రాఫిక్స్ ఉంటుంది. సెకండాఫ్ మొత్తం అదే. అంటే దాదాపు 70 శాతం విఎఫ్ఎక్స్ ఉంటుంది' అని దర్శకుడు వశిష్ట చెప్పారు. ఈ సినిమాలో చిరంజీవి సరసన త్రిష నటిస్తున్నారు.

650 మంది స్టంట్ మ్యాన్‌లకి బీమా..



ఇటీవల తమిళ చిత్రం షూటింగ్ జరుగుతుండగా.. ప్రమాదం చోటుచేసుకొని ప్రముఖ స్టంట్ మ్యాన్ రాజు గుండెపోటుతో చనిపోయారు. పా. రంజిత్ డైరెక్షన్‌లో ఆర్య నటిస్తున్న మూవీ సెట్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్ బాలీవుడ్ ఇండస్ట్రీలోని 650 మంది స్టంట్ మ్యాన్‌లకి తన సొంత డబ్బుతో ఇన్సూరెన్స్ చేయించారు. ఈ పాలసీలో ఆరోగ్య, ప్రమాద బీమా రెండూ ఉన్నట్లు తెలుస్తోంది. స్టంట్ మ్యాన్ సెట్‌లో, బయట ఎక్కడైనా గాయపడితే రూ. 5 లక్షలనుండి రూ.5.50 లక్షల వరకు బీమా పొందవచ్చు.

సిరీస్‌పై హర్మన్‌ప్రీత్ సేన గురి

- **నేడు ఇంగ్లండ్ మహిళలతో రెండో వన్డే**
- **సాయంత్రం 3.30గం॥లకు**



లండన్: తొలి వన్డేలో ఘన విజయం సాధించిన హర్మన్ ప్రీత్ సేన ఇక సిరీస్‌పై గురి పెట్టింది. లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్ మహిళలతో జరిగే రెండో వన్డేలోనూ గెలిస్తే.. మరో వన్డే మిగిలి ఉండగానే సిరీస్‌ను కైవసం చేసుకోనుంది. ఇంగ్లండ్ పర్యటనలో టి20 సిరీస్, వన్డే సిరీస్ చేజిక్కించుకుంటే హర్మన్ ప్రీత్ సేన రికార్డు పుటల్లోకెక్కనుంది. సౌథాంప్టన్ వేదికగా జరిగిన తొలి వన్డేలో ఇంగ్లండ్ నిర్దేశించిన 259 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. దీప్తి శర్మ (62నాటౌట్), జెమీమా రోడ్రిగ్స్(48)ల మెరుపులతో అద్భుత విజయంతో సిరీస్‌లో ముందంజ వేసింది. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో దుర్భేధ్య ఫామ్‌లో ఉండడం భారత్‌కు కలిసిరానుండగా.. ఇంగ్లండ్ జట్టుకు ఈ మ్యాచ్ గెలుపు తప్పనిసరి. రెండో వన్డేలో గెలిస్తేనే.. ఆ జట్టు సిరీస్‌పై ఆశలు సజీవంగా నిలుపుకోనుంది. ఈ మైదానంలో గత వారం జరిగిన పురుషుల మూడో టెస్ట్‌లో భారతజట్టు 22పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దీంతో ఈ మైదానంలో మహిళలు సత్తా చాటి దానికి బదులు తీర్చుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు. టి20 సిరీస్‌ను భారతజట్టు 3-2తో చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే.

ఇరుజట్ల ఆటగాళ్లకు జరిమానా..

క్రికెట్ స్ఫూర్తిని దెబ్బతీసే చర్యలను తీవ్రంగా పరిగణించే అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) హద్దు మీరిన ఆటగాళ్లకు జరిమానాలు విధిస్తుంటుంది. ఈ క్రమంలోనే భారత ఓపెనర్ ప్రతికా రావల్‌కు ఐసీసీ షాకిచ్చింది. ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో కోడ్‌ను ఉల్లంఘించినందుకు ఓపెనర్‌కు మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా వేసింది. అలాగే ఒక డీమెరిట్ పాయింట్ కేటాయించింది. నాట్ సీవర్ బ్రంట్ నేతృత్వంలోని ఆతిథ్య జట్టుకు కూడా భారీ జరిమానా పడింది. స్లో ఓవర్ రేటు కారణంగా జట్టు సభ్యులకు మ్యాచ్ ఫీజులో 5 శాతం జరిమానా విధించింది ఐసిసి జులై 17న బర్మింగ్‌హామ్‌లో జరిగిన వన్డేలో ప్రతికా మైదానంలో రెండుసార్లు ఐసిసి కోడ్‌ను ఉల్లంఘించింది. 18వ ఓవర్లో సింగిల్ తీసే క్రమంలో ఇంగ్లండ్ బౌలర్ లారెన్ ఫిలెర్‌ను ఢీకొట్టింది. 36 పరుగుల వద్ద ఔటైనా ప్రతీకా కోపాన్ని నియంత్రించుకోలేక సోఫీ ఎకిల్‌స్టోన్‌తో వాగ్వాదానికి దిగింది. దాంతో, రెండు పర్యాయాలు ఐసిసి నియమావళి ఉల్లంఘనకు పాల్పడిన విషయాన్ని మ్యాచ్ అనంతరం రిఫరీ ఐసీసీ క్రమశిక్షణ కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. విచారణ సమయంలో భారత ఓపెనర్ తన పొరపాటును అంగీకరించింది. దాంతో, లెవల్ 1 తప్పిదంగా పరిగణించి ఆమెకు మ్యాచ్ ఫీజులో పది శాతం కోత.. ఒక డీమెరిట్ పాయింట్ విధించారు.

జట్లు(అంచనా)..

ఇండియా : హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), ప్రతికా రావల్, మంధాన, హర్లీన్, రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రీచా ఘోష్(వికెట్ కీపర్), అమన్‌జ్యోత్ కౌర్, స్నేహ్ రాణా, శ్రీ చరణి, క్రాంతి గాడ్.

ఇంగ్లండ్ : స్కీవర్ బ్రంట్(కెప్టెన్), బ్యూమౌంట్, అమీ జోన్స్(వికెట్ కీపర్), లాంబ్, డంక్లే, రిచర్డ్స్, ఎక్లేస్టోన్, ఛార్లీ డీన్, క్రాస్, ఫిలెర్, లారెన్ బెల్.

న్యూజిలాండ్‌కు మరో విజయం

- టి20 ట్రయాంగులర్ సిరీస్



హరారే: టి20 ట్రయాంగులర్ సిరీస్‌లో న్యూజిలాండ్ జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. ఆతిథ్య జింబాబ్వేతో శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టు 8వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 120 పరుగులు చేయగా.. అనంతరం న్యూజిలాండ్ జట్టు 13.5ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. ఓపెనర్ కాన్వే(59నాటౌట్), రచిన్ రవీంద్ర(30), మిఛెల్(26నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. అంతకుముందు జింబాబ్వే జట్టు ఓపెనర్లు మధరె(36), బెన్నెట్(21) తొలి వికెట్‌కు 37పరుగులు జతచేసినా.. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన



సెమీస్‌లో అర్జున్

- క్వార్టర్స్‌లో ఓడిన ప్రజ్ఞానంద

లాస్‌వెగాస్: భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఎరిగేసి విశ్వ వేదికపై మరోసారి తన తడాఖా చూపించాడు. ప్రతిష్ఠాత్మక ఫ్రీస్టయిల్ గ్రాండ్ స్లామ్ టూర్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. లాస్ వేగాస్‌లో శుక్రవారం జరిగిన క్వార్టర్స్‌లో ఉజ్బెకిస్థాన్ స్టార్ నొద్రిబెక్ అబ్దుసత్రోవ్‌పై విజయం సాధించాడు. ఇక ఫ్రీస్టయిల్ గ్రాండ్ స్లామ్ టూర్‌లోనూ మెరిశాడు. నొద్రిబెక్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తూ 1.5-0.5తో గెలుపొందాడు. తన వ్యూహాత్మక ఎత్తుగడలతో ప్రత్యర్థిని మట్టికరిపించి సెమీస్‌లో అడుగుపెట్టి టైటిల్ వేటకు రెండడుగుల దూరంలో నిలిచాడు. గత మ్యాచ్‌లో వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్‌కు ముచ్చెమటలు పట్టించిన ప్రజ్ఞానంద సెమీస్ బెర్తు సాధించలేక పోయాడు. క్వార్టర్స్‌లో కరౌనా చేతిలో 3-4తో పరాజయం చెందాడు.

టెన్నిస్‌కు జబీర్ గుడ్‌బై



ట్యునిష్: మూడుసార్లు గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు చేరిన ట్యునీషియాకు చెందిన అన్స్ జబీర్ సంచలన నిర్ణయం తీసుకుంది. టెన్నిస్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు శుక్రవారం ప్రకటించింది. 'గత రెండేళ్లుగా తీవ్ర గాయాలతో ఇబ్బందులు పడుతున్నా.. కోర్టులోకి పూర్తి ఆరోగ్యంతో దిగడం లేదు' అని తన రిటైర్మెంట్ ప్రకటనలో తెలిపింది. మీ మద్దతుకు, ప్రేమను మర్చిపోలేను అని తెలిపింది. ఇటీవల జరిగిన వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌లో తొలిరౌండ్ ఆట మధ్యలోనే వైదొలిగింది. రెండుసార్లు(2022, 2023) వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ రన్నరప్‌గా నిలిచిన 30ఏళ్ల జబీర్ ఒక గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్‌కు చేరిన తొలి అరబ్ క్రీడాకారిణిగా రికార్డుపుటల్లోకెక్కింది. 2022లోనూ యుఎస్ ఓపెన్ ఫైనల్‌కు చేరింది. ఈ ఏడాది జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనూ శ్వాస తీసుకోవడంలో ఇబ్బందుల కారణంగా వైదొలిగింది. మాజీ ఫెన్సింగ్ ఆటగాడు కరీం కమౌన్‌ను వివాహం చేసుకుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68